గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.


# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక


ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 80, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1 బుధవారం - 17 - ఏప్రిల్ - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



హైదరాబాద్: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23 వరకూ పొడిగించింది.కవితకు గత నెల 26న కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన సంగతి తెలిసిందే. ఆ గడువు ముగియడంతో ఈడీ అధికారులు సోమవారం (ఏప్రిల్ 15) ఆమెను కోర్టులో హాజరు పరిచారు.ఈ సందర్భంగా

## గల్ఫ్ సహా విదేశాలకు వెళ్లే కార్మికులకు
# సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త

- విదేశాలకు వెళ్లే వారి కోసం కొత్త విధానం తీసుకు రాబోతున్నామన్న రేవంత్ రెడ్డి
- ఓవర్సీస్ కార్మికుల కోసం ఇతర దేశాలు, రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి
- రైతు బీమా మాదిరి గల్ఫ్ కార్మికుల బీమాను ఏర్పాటు చేస్తామన్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలతో పాటు విదేశాలకు వెళ్తున్న తెలంగాణ కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఇతర దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్తున్న వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం తీసుకు రాబోతుందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ గల్ఫ్ అండ్ ఓవర్సీస్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ఇందులో ఓ ఐఏఎస్ అధికారితో పాటు సిబ్బందిని నియమిస్తామన్నారు. సెప్టెంబర్ 17వ తేదీలోగా ఈ వ్యవస్థ పకడ్బందీగా ఏర్పాటయ్యే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. తెలంగాణలో పదిహేను లక్షల కుటుంబాలు గల్ఫ్ ఉపాధిపై ఆధారపడి ఉన్నట్లు చెప్పారు. ఓవర్సీస్ కార్మికుల కోసం పిలిప్పీన్స్, కేరళలో మంచి విధానం ఉందని, ఈ విషయంలో ఇతర దేశాలు, రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. గల్ఫ్ కార్మికులు చనిపోతే రూ.5 లక్షలు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించినట్లు చెప్పారు. రైతుబీమా మాదిరి రాబోయే రోజుల్లో గల్ఫ్ కార్మికుల బీమాను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామన్నారు. విదేశాల్లో తెలంగాణ బిడ్డలు ఇబ్బందుల్లో ఉంటే సంప్రదించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. విదేశాలకు వెళ్లిన వారి సంక్షేమంతో పాటు ఇక్కడి వారి తల్లిదండ్రుల ఆరోగ్యం కోసమూ తమ ప్రభుత్వం ఆలోచన చేయనుందన్నారు.

## ముఖ్యమంత్రిని హెచ్చరిస్తున్నా...
## రైతుకు బోనస్ ఇవ్వండి...
### మేం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయం

ఎన్నికల సమయంలో బాండ్ రాసిచ్చినట్లుగా బోనస్ కోసం చిట్టీలు రాసివ్వండన్న కేసీఆర్

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్నామన్న కేసీఆర్

కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపు



హైదరాబాద్: 'నేను ముఖ్యమంత్రిని... రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను... బోనస్ పేరు మీద మీరు తప్పించుకోలేరు. దానికి ఎన్నికల కమిషన్ అడ్డురాదు... మేం కూడా మీ పైన కంప్లయింట్ చేయబోం. ఏ రైతుకు ఎంత బాకీ ఉంటారో అంత బోనస్ చిట్టీలు రాసివ్వండి. ఎన్నికల సమయంలో బాండ్ రాసిచ్చారు కదా. అలా బాండ్ ఇచ్చినట్లుగా ఇవ్వండి. అలా కాదంటే ఎన్నికల తెల్లారి ఇవ్వండి. కానీ బోనస్ ఎగబెడతాం అంటే మాత్రం ఊరుకునేది లేద'ని ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ పాల్గొన్నారు.

## న్యాయ వ్యవస్థలను అణగదొక్కాలని చూస్తున్నారు :
## సీజేఐకు మాజీ జడ్జీల లేఖ



న్యూఢిల్లీ : న్యాయవ్యవస్థను కాపాడాలని కోరుతూ 21 మందితో కూడిన సుప్రీం, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. న్యాయవ్యవస్థపై తీవ్ర ఒత్తిడి, తప్పుడు సమాచారాలతో అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయాలని

### న్యాయం కోసం కొంగు చాచి అడుగుతున్నాం..
## మాపై దయ చూపండి"

సీబీఐ చేయాల్సింది చాలా ఉంది..

వివేక హత్యపై సునీత సంచలన పవర్ పాయింట్ ప్రజెంటేషన్



కడప : ఈ హత్య కేసులో సిబిఐ చేయాల్సింది చాలా ఉంది. న్యాయం కోసం ఐదు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాను. ఈ కేసులో సిబిఐ పై రాజకీయ ఒత్తిడి ఉంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో నేను ఇన్ని దృశ్యాలు చూపించాను."మీ ఆడబిడ్డలం మీ దగ్గరకు వచ్చాం.. న్యాయం కోసం కొంగు చాచి అడుగుతున్నాం.. మాపై దయ చూపండి" అంటూ ఇటీవల కడపలో వైఎస్ షర్మిల, సునీతా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వారు అలా మాట్లాడిన మరుసటి రోజు వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరి వైఎస్ విమలమ్మ

## పిల్లిని తిన్న గర్భిణీ స్త్రీ
## - బిడ్డ ఎలా పుట్టాడంటే..



ఇంటర్‌నెట్ డెస్క్ : ప్రపంచంలో ఏ మహిళ అయినా సరే గర్భధారణ సమయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటూ కనబోయే బిడ్డలకోసం మంచి ఆహారం తీసుకుంటూ సరైన సమయానికి మందులు తీసుకుంటూ పండంటి బిడ్డకు జన్మనివ్వడానికి ప్రయత్నిస్తుంది. అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న ఒక్కోసారి పుట్టిన పిల్లలు అరుదైన

# ఎన్నికల ప్రచారాలు
# ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు




వివరాలు 2లో..


- ట్రాఫిక్ చిక్కులతో జనం విలవిల
- రోడ్లేమో సిక్స్ లేన్.. వంతెనలు డబుల్ లేన్
- చేతులెత్తేసిన పోలీసులు
- అవగాహన కల్పించడంలో విఫలం

విజయవాడ : ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత ఏపీలో రోడ్ల మీద ప్రయాణం నరకంలా మారింది. రాజకీయ పార్టీలు పోటా పోటీగా రోడ్ షోలు నిర్వహిస్తున్నాయి. ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీ, జనసేనలు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాలు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో జనాన్ని ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి.

ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు నుంచి ఏపీ రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. టీడీపీ తరపున చంద్రబాబు, నారా లోకేష్ వేర్వేరుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో ప్రచారాన్ని ప్రారంభించారు. పవన్ కళ్యాణ్ కూడా ఇటీవల విడిగా వారాహి యాత్రలు, ఎన్డీఏ కూటమిలో భాగంగా చంద్రబాబుతో రోడ్ షోలు నిర్వహిస్తున్నారు.ఏ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినా ఆ సభలు, సమావేశాలకు ఎన్ని లక్షల మంది హాజరయ్యారనే ప్రచారమే ప్రధాన అంశంగా మారుతోంది.

## ఈ ఏడాది వర్షాలే.. వర్షాలు: ఐఎండీ



న్యూఢిల్లీ : భారత వాతావరణ శాఖ ప్రస్తుతం ఎండలతో విలవిల్లాడుతున్న ప్రజలకు చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు సీజన్‌లో అధిక వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. లానినా పరిస్థితుల కారణంగా ఎక్కువ మోతాదులో వర్షాలు కురుస్తాయని తెలిపింది.జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల కాలానికి గతంలో కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నాలుగు నెలల దీర్ఘకాల సగటు వర్షపాతం 87 సెంటీమీటర్లతో పోల్చితే.. వచ్చే నైరుతి రుతుపవనాల

## డ్రగ్స్‌దే అగ్రస్థానం,.
## ఏపీలో 125 కోట్లు : ఈసీ ప్రకటన



న్యూఢిల్లీ: తొలి దశ ఎన్నికల పోలింగ్‌కు ముందు రికార్డు స్థాయిలో అంటే 4650 కోట్ల విలువైన నగదు, నగలు, డ్రగ్స్ స్వాధీనం చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం తెలిపింది.దేశంలో సార్వత్రిక ఎన్నికల వేళ

## బీజేపీకి వరుస షాక్ లు
### ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న కీలక నేతలు



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ నేతల ఒక్కొక్కరుగా జారుకుంటున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి అభ్యర్థులుగా నిలిచిన దాదాపు పది మంది ఆ పార్టీని వీడారు. త్వరలో మరికొంత మంది నేతలు బీజేపీని విడుతారనే ప్రచారం జోరుగా సాగు తోంది. పార్లమెంట్ ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో నేతలు ఒక్కొక్కరుగా బీజేపీకి గుడ్ బై చెబుతూ ఉండడం కమలనాథులను కలవరపెడుతోంది. రోజుకో కీలక నేత బీజేపీని వీడుతూ ఉండడంతో రాష్ట్ర నాయకత్వం అప్రమత్తమై..... నేతలు చేజారకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తుంది. బీజేపీ నేతలు సమయం చూసుకుని ఒక్కొక్కరుగా పార్టీ మారుతుండడంతో చాప కింద నీరులా పార్టీ పరిస్థితి అయిందని సామాజిక మాధ్యమాల్లో సొంత పార్టీ శ్రేణులు వ్యాఖ్యలు చేస్తున్నారు. మొన్నటి వరకు ఊపు మీద ఉన్న బీజేపీకి నేతలు సమయం

# పదే..పది'కీ'లకం..!

అమరావతి: మే 13న పోలింగ్ జరగనుంది. 11తో ప్రచారం ముగియనుంది. ఈ నేపథ్యంలో మే రెండు నుంచి మూడు పార్టీలు ఉమ్మడిగానే సభలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వంటి వారి సభలకు మూడు పార్టీల నాయకులు హాజరుకావాలని నిర్ణయించారు. తద్వారా ఎన్డీఏకు ఒక ఊపు తేవాలని వ్యూహరచన చేస్తున్నారు. చంద్రబాబు నివాసంలో మూడు పార్టీల నేతలు సమావేశం నిర్వహించారు. ప్రచార పర్వం పై చర్చలు జరిపారు. ఈ 15 రోజులపాటు ఎవరికి వారే ప్రచారం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.ఏపీలో ప్రచార పర్వాన్ని కొత్త పుంతలు తొక్కించాలని కూటమి పక్షాలు నిర్ణయించాయి. 2014 ఎన్నికల్లో తిరుపతి నుంచి విశాఖ వరకు వరుసగా



## రాయితోనే దాడి చేసారు కానీ...!!

దాడి చేసిందెవరో ఇంకా గుర్తించలేదని సీపీ స్పష్టం

ఈ కేసు దర్యాప్తు కోసం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు

ముఖ్యమంత్రికి తగిలిన తర్వాత అదే రాయి పక్కన ఉన్న వెల్లంపల్లికి తగిలింది



విజయవాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై రాయితోనే దాడి చేశారని విజయవాడ సీపీ కాంతిరాణా నిర్ధారించారు. అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించిన తర్వాత నిర్ధారణకు వచ్చినట్టు చెప్పారు. దాడి చేసిందెవరో ఇంకా గుర్తించలేదని సీపీ స్పష్టం చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో నిందితుడిని గుర్తించెందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.శనివారం రాత్రి 8.04 గంటలకు సిఎం జగన్‌పై దాడి జరిగిందని సీపీ చెప్పారు.

## కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

మొదటి పేజి తరువాయి

ఈడీ తరఫున అడ్వొకేట్ జోహెబ్ హుస్సేన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించారు.కవిత బయట ఉంటే కేసు దర్యాప్తు ప్రభావితమవుతుందని ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఆమె కస్టడీని పొడిగించాలని కోరారు. కవిత తరఫున అడ్వొకేట్ నితీశ్ రాణా వాదనలు వినిపించారు.కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని కోరడానికి ఈడీ వద్ద కొత్త కారణాలేమీ లేవన్నారు.2022 నుంచి కేసు దర్యాప్తు సాగుతున్నదని, అప్పటి నుంచి కవిత దర్యాప్తును ప్రభావితం చేసే వ్యక్తి అని ఈడీ ఆరోపిస్తూనే ఉందనీ అయితే ఇప్పటి వరకు ఆమె దర్యాప్తును ప్రభావితం చేశారనడాకి ఎటువంటి ఆధారాలూ లేవన్నారు. ఇరు వైపుల వాదనా విన్న అనంతరం న్యాయమూర్తి జస్టిస్ కావేరి బవేజా తీర్పును కొద్ది సేపు రిజర్వ్ చేసి అనంతరం కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23 వరకూ పొడిగిస్తూ తీర్పు ఇచ్చారు.

## న్యాయ వ్యవస్థలను అణగదొక్కాలని చూస్తున్నారు : సీజేఐకు మాజీ జడ్జీల లేఖ

మొదటి పేజి తరువాయి

చూస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సంకుచిత రాజకీయ మరియు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు.ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు హానికరమని పేర్కొన్నారు. రాజకీయ ప్రముఖుల అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్న వారు న్యాయవ్యవస్థకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ తరుణంలో న్యాయవ్యవస్థపై ప్రజలకు అపనమ్మకం కలుగుతుందని ఆరోపించారు. ఈ ప్రక్రియలు న్యాయవ్యవస్థ పనితీరును కించపరిచేలా ఉన్నాయని అన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసమే కోర్టులను వాడుకుంటున్నారని, ఇబ్బంది పెట్టేందుకు కొందరు యత్నిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఉద్దేశ్యపూర్వకంగానే ప్రకటనలు కూడా చేస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. కోర్టులను ఇన్‌ఫ్లుయెన్స్ చేయడం ఈజీ అంటూ పలువురు చేస్తున్న వ్యాఖ్యల పట్ల ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు 600 మంది లాయర్లు కలిపి లేఖను రాశారు.అనవసన ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థను రక్షించుకోవాలని కోరారు. కోర్టుల తీర్పులను ప్రభావితం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ మేరకు దేశ సర్వోన్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు.

## పిల్లిని తిన్న గర్భిణీ స్త్రీ - బిడ్డ ఎలా పుట్టాడంటే..

మొదటి పేజి తరువాయి

వ్యాధితో ఇబ్బంది పడాల్సి వస్తుంది. కాకపోతే ఇలాంటివి ఆహారపు అలవాట్ల వల్ల వచ్చినది కాకపోవచ్చు ఒక్కోసారి జన్యుపరమైన విషయాలతో కూడిన వ్యాధులు కూడా రావచ్చు.ఇకపోతే ఫిలిప్పీన్స్ దేశంలో ఆల్మనే ఓ మహిళ బిడ్డకు జన్మను ఇవ్వగా పుట్టిన బిడ్డ చూడడానికి అచ్చం ఎలుగుబంటిలా కనిపించడం ఇప్పుడు అందరిని ఆశ్చర్య వ్యక్తం చేస్తుంది. ఆ చిన్నారికి శరీరం మొత్తం వెంట్రుకలు రావడం ఓ అరుదైన వ్యాధి కారణంగా ఇలా జరిగినట్లు తెలుస్తోంది. ఇకపోతే తాను గర్భవతిగా ఉన్న సమయంలో పిల్లిని తిన్నానని అందుకోసమే పిల్లాడు శాపానికి గురయ్యాడని మహిళ నమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఫిలిప్పీన్స్ దేశంలోని అపయావో ప్రావిన్ లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇలా జన్మనిచ్చిన బిడ్డకు కేవలం తలపై కనురెప్పలపై మాత్రమే కాకుండా శరీరం మొత్తం వెంట్రుకలతో నిండిపోయింది.వేర్ వోల్ఫ్ అనే సెంట్రల్ కారణంగా ఇది జరిగినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ పిల్లాడిని ప్రపంచంలోనే అత్యధిక వెంట్రుకలు ఉన్న శిశువుగా పరిగణిస్తున్నారు. వెర్ వోల్ఫ్ సిండ్రోమ్ మానవ శరీరంపై ఎక్కువ వెంట్రుకలు పెరిగే అరుగైన వ్యాధిని కలగజేస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. అయితే సదరు జన్మనిచ్చిన తల్లి మాత్రం తాను గర్భం దాల్చిన సమయంలో తన స్నేహితులు తన కోరిక మేరకు ఓ నల్ల పిల్లి మాంసాన్ని తీసుకోవచి దట్టమైన మసాలాలు కలిపి ఉండగా దాన్ని తినడంతో పిల్లాడికి ఇలా కలిగిందని ఆమె చెప్పుకొచ్చింది.

## ఈ ఏడాది వర్షాలే.. వర్షాలు: ఐఎండీ

మొదటి పేజి తరువాయి

సీజన్‌లో అధిక వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. లానినా పరిస్థితుల కారణంగా ఎక్కువ మోతాదులో వర్షాలు కురుస్తాయని తెలిపింది.జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల కాలానికి గతంలో కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నాలుగు నెలల దీర్ఘకాల సగటు వర్షపాతం 87 సెంటీమీటర్లతో పోల్చితే.. వచ్చే నైరుతి రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం దేశంలో నమోదవ్వవచ్చని ఐఎండీ అంచనా వేసింది.ఈ విషయాన్ని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ సోమవారం వెల్లడించారు. 1951 నుంచి 2023 వరకు ఉన్న డేటా ప్రకారం లానినా, ఎల్‌నినా పరిస్థితుల కారణంగా దేశంలో 9 సార్లు అధిక వర్షపాతం నమోదైందన్నారు. గత నాలుగేళ్లలో రుతుపవనాలను సీజన్‌ను చూసుకుంటే.. సాధరణ, సాధరణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైనట్లు ఆయన వెల్లడించారు.ఈ ఏడాది కూడా లానినా పరిస్థితుల కారణంగా దేశంలో అధిక వర్షపాతం నమోదవుతుందన్నారు. వాయువ్య, ఈశాన్య, తూర్పు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మినహా.. దేశంలోని అన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తాయన్నారు. గత ఏడాదిలా కాకుండా ఈ సంవత్సరం.. జూన్ నెల నాటికి దేశవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరిస్తాయన్నారు. నైరుతి రుతుపవనాలు సీజన్‌లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా అధిక వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు.

## డ్రగ్స్‌దే అగ్రస్థానం,. ఏపీలో 125 కోట్లు : ఈసీ ప్రకటన

మొదటి పేజి తరువాయి

కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కోడ్ కూత మొదలు ఇప్పటివరకు భారీ స్థాయితో నగదు, నగలు పట్టుబడ్డాయి. అయితే ఇంకా షాకింగ్ విషయం ఏంటంటే.. భారీ స్థాయిలో డ్రగ్స్ పట్టుబడడం సంచలనం రేపుతోంది. ఈ విషయం తెలిసి అధికారులకే షాకయ్యారు. దేశంలో చాప కింద నీరుగా డ్రగ్స్ విస్తరిస్తోందన్నది ముమ్మాటికీ నిజం.సార్వత్రిక ఎన్నికలు తొలి దశ ముందే రికార్డు క్రియేట్ చేసింది. 2019తో పోల్చితే ఇది చాలా ఎక్కువని వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఈ స్థాయిలో సీజ్ చేసిన సందర్భాలు లేవని పేర్కొంది. రోజుకు సగటున 100 కోట్ల రూపాయలు పట్టుబడినట్టు చెబుతోంది.ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పిన కేంద్ర ఎన్నికల సంఘం, భారీ ఎత్తున తనిఖీలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను మోహరించింది. నగదు రూపంలో రూ. 395.39 కోట్లు, బంగారం %-% ఇతర విలువైన లోహాల రూపంలో రూ. 562.10 కోట్లు పట్టుబడ్డాయి. మద్యం రూపంలో రూ. 489.31 కోట్లు విలువ చేసే 3.58 కోట్ల లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుంది.ఇక డ్రగ్స్ రూపంలో అత్యధికంగా రూ. 2,068.85 కోట్ల రూపాయలున్నట్లు చెబుతోంది. అంటే దాదాపు 45శాతమన్నమాట. బహుమతుల రూపంలో రూ. 1,142.49 కోట్లు ఈ జాబితాలో ఉన్నాయి. మార్చి ఒకటి నుంచి ఇవాళ్టి వరకు సగటున రోజుకు రూ. 100 కోట్ల మేరా పట్టుబడింది. ఇక తెలుగు రాష్ట్రాల విషయాని కొస్తే.. తెలంగాణ నుంచి రూ. 121.84 కోట్లు కాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి రూ. 125.97 కోట్లు స్వాధీనం చేసుకుంది. మరి ఎన్నికలు పూర్తి అయ్యేనాటికి ఈ లెక్క ఈ రేంజ్‌లో ఉంటుందో చూడాలి.

## బీజేపీకి వరుస షాక్ లు
## ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న కీలక నేతలు

మొదటి పేజి తరువాయి



రోజుకో కీలక నేత బీజేపీని వీడుతూ ఉండడంతో రాష్ట్ర నాయకత్వం అప్రమత్తమై..... నేతలు చేజారకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తుంది. బీజేపీ నేతలు సమయం చూసుకుని ఒక్కొక్కరుగా పార్టీ మారుతుండడంతో చాప కింద నీరులా పార్టీ పరిస్థితి అయిందని సామాజిక మాధ్యమాల్లో సొంత పార్టీ శ్రేణులు వ్యాఖ్యలు చేస్తున్నారు. మొన్నటి వరకు ఊపు మీద ఉన్న బీజేపీకి నేతలు సమయం చూసుకొని గుడ్ బై చెబుతూ ఉండడంతో ప్రస్తుతం తలనొప్పిగా మారింది.అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన పదిమంది అభ్యర్థులు బీజేపీని వీడారు. అందులో ప్రధానంగా శ్రీశైలం గౌడ్, పులిమామిడి రాజు, ఆరేపల్లి మోహన్, శ్రీ గణేష్, రవీంద్ర నాయక్, చలమల కృష్ణారెడ్డి, బాబు మోహన్, రతన్ పండు రంగా రెడ్డి, జలంధర్ రెడ్డి , మిథున్ రెడ్డి ఉన్నారు. ఈసారి మహబూబ్ నగర్ ఎంపీ టికెట్ ఆశించిన బీజేపీ కీలక నేత, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి సైతం కమలం పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. ఆయన చేరిన తరువాత ఆయన కుమారుడు మిథున్ రెడ్డి, రతన్ పండు రంగా రెడ్డి, జలంధర్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహబూబ్ నగర్ జిల్లాలో బీజేపీ కీలక నేతలను కాంగ్రెస్ లో చేర్చుకుని డీకే అరుణను ఒంటరిని చేయాలన్నదే కాంగ్రెస్ మాస్టర్ ప్లానట. ఈ ఎన్నికల్లో డీకే అరుణను ఎలాగైనా ఓడించాలని జితేందర్ రెడ్డి కంకణం కట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడంతో డీకే అరుణకు అన్నీ విధాలుగా చెక్ పెట్టి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా.....తెలంగాణలో బీజేపీ కనీసం 12 స్థానాల్లో గెలవాలని లక్ష్యంతో ఉంది. అయితే సరిగ్గా ఎన్నికల ముందు ఒక్కో నేత పార్టీకి గుడ్ బై చెబుతూ ఉండడం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో ఈ సమస్యకు అడ్డుకట్ట వేయాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఫోకస్ పెట్టింది. అందులో భాగంగానే అసంతృప్తి నేతలు ఎవరు? వారి సమస్యలు ఏంటి అనే దానిపై నాయకత్వం ఆరా తీస్తుంది. నేతలు చేజారకుండా వారిని బుజ్జగిస్తుంది. ఒకవైపు పార్టీ కీలక నేతలు అసంతృప్తులను బుజ్జగిస్తున్నా ఎలాంటి సత్ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికే సికింద్రాబాద్ ఉపఎన్నిక బీజేపీ అభ్యర్థిగా భావించిన శ్రీ గణేష్ ఉన్నపళంగా కాంగ్రెస్ లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. శ్రీ గణేష్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అక్కడ బీజేపీ అభ్యర్థి కరవయ్యారు. ఇలా అనేక పార్లమెంట్ సెగ్మెంట్లలో బీజేపీకి ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. దీంతో బీజేపీ వ్యూహం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# పదే..పది'కీ'లకం..!

అమరావతి: మే 13న పోలింగ్ జరగనుంది. 11తో ప్రచారం ముగియనుంది. ఈ నేపథ్యంలో మే రెండు నుంచి మూడు పార్టీలు ఉమ్మడిగానే సభలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వంటి వారి సభలకు మూడు పార్టీల నాయకులు హాజరుకావాలని నిర్ణయించారు. తద్వారా ఎన్డీఏకు ఒక ఊపు తేవాలని వ్యూహరచన చేస్తున్నారు. చంద్రబాబు నివాసంలో మూడు పార్టీల నేతలు సమావేశం నిర్వహించారు. ప్రచార పర్వం పై చర్చలు జరిపారు. ఈ 15 రోజులపాటు ఎవరికి వారే ప్రచారం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.ఏపీలో ప్రచార పర్వాన్ని కొత్త పుంతలు తొక్కించాలని కూటమి పక్షాలు నిర్ణయించాయి. 2014 ఎన్నికల్లో తిరుపతి నుంచి విశాఖ వరకు వరుసగా భారీ బహిరంగ సభల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. చంద్రబాబుతో పాటు పవన్ వేదికలు పంచుకున్నారు. అప్పట్లో ఎన్డీఏకు ఒక ఊపు రావడానికి ఈ సభలు దోహదపడ్డాయి. అయితే ఈ ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకోవడం ద్వారా అదే ఊపు తేవాలని చంద్రబాబు భావించారు. కానీ చిలకలూరిపేట సభ తర్వాత ప్రధాని మోదీ కనిపించలేదు. బిజెపి అగ్ర నాయకత్వం కూడా ఏపీ పై దృష్టి పెట్టలేదు. అయితే దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండడంతో.. మొదటి మూడు విడతల్లో పోలింగ్ జరిగే రాష్ట్రాలపైనే బిజెపి అగ్ర నేతలు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఇప్పుడు నాలుగో విడత పోలింగ్ జరగనున్న తెలుగు రాష్ట్రాలపై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. ఓ పది రోజులపాటు భారీ బహిరంగ సభలతో ఎలక్షన్ ఫీవర్ తెప్పించి.. ఎన్డీఏకు ఒక ఊపు తేవాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.చంద్రబాబు నివాసంలో మూడు పార్టీల నేతలు సమావేశం నిర్వహించారు. ప్రచార పర్వం పై చర్చలు జరిపారు. ఈ 15 రోజులపాటు ఎవరికి వారే ప్రచారం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. మధ్యలో మాత్రం ఉమ్మడి ప్రచార సభలు



పార్టీ చేస్తున్న నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రకారం చేస్తున్నారు.మధ్యలో చంద్రబాబుతో పాటు వేదికలు పంచుకుంటున్నారు. వీరితో పురందేశ్వరి జత కలుస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఉభయగోదావరి జిల్లాలో జరుగుతున్న ఉమ్మడి ప్రచార సభలకు ప్రజాస్పందన వస్తోంది. అందుకే దానిని కొనసాగించాలని డిసైడ్ అయ్యారు.పది రోజులు పాటు ఉమ్మడి ప్రచారం అత్యంత కీలకంగా భావిస్తున్నారు. ఎన్నికల స్ట్రాటజీని మార్చేది ఆ పది రోజులే నన్న నిర్ణయానికి వచ్చారు. అటు క్షేత్రస్థాయిలో

ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నారు. మే 1 నుంచి 11 వరకు మాత్రం ఉమ్మడి ప్రచార సభలతో హోరెత్తించాలని చూస్తున్నారు. ఈ విషయంలో స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోనున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రజాగళం యాత్ర చేపడుతున్నారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. అటు పవన్ సైతంజనసేన

పర్యటనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఉదయం పూట ఆన్లైన్, మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఉమ్మడి ప్రచారం చేసుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. మొత్తానికైతే మేలో ఆ పది రోజులు కీలకంగా భావిస్తున్నారు.

# ఎన్నికల ప్రచారాలు ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు

మొదటి పేజి తరువాయి

వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలకు ఒక్కో సభకు పది లక్షల మంది హాజరయ్యారని ప్రచారం జరిగింది.వందలు, వేల మంది ప్రయాణానికి సరిపోయే రోడ్ల మీద వేల సంఖ్యలో వాహనాలు వచ్చే బలప్రదర్శన కోసం వచ్చేస్తున్నాయి. హంగు, ఆర్భాటంతో రాజకీయ పార్టీలు చేస్తున్న యాత్రలు సామాన్య జనానికి నరకం చూపిస్తున్నాయి. ఇక జాతీయ రహదారులపై జరుగుతున్న యాత్రలతో రోడ్ల మీద ప్రయాణాలు అంటేనే ప్రజలు హడలిపోవాల్సి వస్తోంది.శనివారం సాయంత్రం నంబూరు, మంగళగిరి, తాడేపల్లి మీదుగా సిఎం జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర.. తాడేపల్లిలో కృష్ణా వారధిపైకి వచ్చింది. వారధి వరకు ఆరు లేన్లతో ఉండే చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి, వారధిపై డబుల్ లేన్‌గా మారిపోతుంది.సిఎం జగన్ వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు, వందలాది వాహనాలతో ర్యాలీగా విజయవాడలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమం గంటపాటు సాగింది. సిఎం కాన్వాయ్ హైవే దాటుకుని విజయవాడ రోడ్లలోకి వెళ్లినా తర్వాత కూడా జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్లియర్ కాలేదు. విజయవాడ వారధి నుంచి గుంటూరు వరకు దాదాపు 30కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలిచిపోయాయి. సిక్స్‌లేన్ మీద ప్రయాణించిన వాహనాలు మెల్లగా ముందుకు సాగుతూ విజయవాడలోకి రావడానికి దాదాపు రెండున్నర గంటల సమయం పట్టింది.



రాజకీయ ప్రదర్శనలు, ర్యాలీల సమయంలో వివిఐపి మూమెంట్ పెడుతున్న శ్రద్ధలో పదో వంతు కూడా పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఉంచడం లేదు. ట్రాఫిక్ నెమ్మదించిన సమయంలో ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు బ్రేక్ డౌన్ అయితే ఇక జనం పని అయిపోయినట్టే. ఆ వాహనాలను క్లియర్ చేయడానికి క్రేన్లు వారధి సమీపంలో మాత్రమే ఉంటాయి. ట్రాఫిక్ దాటుకుని అవి స్పాట్‌కు చేరాలంటే గంటల సమయం పడుతోంది. తరచూ ఈ సమస్య తలెత్తుతోంది.సోమవారం సిఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభించిన తర్వాత కోల్‌కత్తా జాతీయ రహదారిపై గన్నవరం సమీపంలో వాహనాలు నిలిచిపోయాయి. సిఎం బస్సు యాత్ర సాగే రూట్ మ్యాప్ విషయంలో పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నా వాటిపై ప్రజలకు మాత్రం అవగాహన కల్పించడం లేదు. ట్రాఫిక్ మళ్లింపులు, భారీ వాహనాల నియంత్రణ, వాహనదారులకు అవగాహన లేకపోవడంతో ఎన్నికల ర్యాలీలు జరిగే రోడ్లపైకి వెళ్లిన వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి.

గంటల తరబడి వృధాగా ఇంధనం ఖర్చు చేయాల్సి వస్తోంది. చిన్నాచితక వాహనాలు, గూడ్స్ క్యారియర్లు ఇంధనం పూర్తిగా ఖర్చై రోడ్డు మీద ఆగిపోతున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఎన్నికల ర్యాలీలు, రోడ్ షోల విషయంలో పార్టీలను నియంత్రించలేని పోలీసులు కనీసం ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వడంలో కూడా విఫలం అవుతున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలన వినియోగించుకోవడంలో ఏపీ పోలీసులు పూర్తిగా విఫలం అయ్యారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ట్రాఫిక్ అప్డేట్స్ విషయంలో ఎఫ్ ఎం రేడియోలు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తారు. ఏపీలో ఆర్టీజిఎస్, విపత్తుల నిర్వహణ శాఖల ద్వారా మొబైల్ అప్డేట్స్ చేసే అవకాశం ఉన్నా వాటిని వినియోగించుకోవడంలో మాత్రం విఫలం అవుతున్నారు.

# న్యాయం కోసం కొంగు చాచి అడుగుతున్నాం.. మాపై దయ చూపండి''

మొదటి పేజి తరువాయి

వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరి వైఎస్ విమలమ్మ కౌంటర్ ఇచ్చారు. జగన్ కు అనుకూలంగా మాట్లాడారు.. షర్మిల, సునీత కుటుంబం పరువు తీస్తున్నారంటూ ఆరోపించారు. విమలమ్మ అలా మాట్లాడారో లేదో.. సోమవారం సునీత సంచలన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు కు సంబంధించి కీలక విషయాలు వెల్లడించారు..'ఈ హత్య కేసులో సిబిఐ చేయాల్సింది చాలా ఉంది. న్యాయం కోసం ఐదు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాను. ఈ కేసులో సిబిఐ పై రాజకీయ ఒత్తిడి ఉంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో నేను ఇన్ని దృశ్యాలు చూపించాను. ఇవన్నీ చూసిన తర్వాత ఎవరైనా వివేకానంద రెడ్డి గుండెపోటుతో చనిపోయారని భావిస్తారా? హత్య జరిగిన రోజు రాత్రి, తర్వాత రోజు ఉదయం కాల్ డేటా తో పాటు గూగుల్ టేక్ అవుట్ , ఐపిడిఆర్ డేటా చూస్తే మీకే అర్థమవుతుంది. ఇవన్నీ మా నాన్న హత్యకు గురయ్యారని చెబుతున్నాయి" అంటూ సునీత వ్యాఖ్యానించారు.ఈ కేసులో ఏ -1 ఎర్ర గంగిరెడ్డి, ఏ-2 సునీల్ యాదవ్, ఏ-3 ఉమాశంకర్ రెడ్డి, ఏ-4 దస్తగిరిని సిబిఐ పేర్కొన్నది. ఎర్ర గంగిరెడ్డి కి, ఉమా శంకర్ రెడ్డి తో అవినాష్ రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అవినాష్ రెడ్డి తో సునీల్ యాదవ్ తమ్ముడు కిరణ్ యాదవ్ దిగిన ఫోటోలు కూడా ఉన్నాయి. వివేకానంద రెడ్డి దగ్గర పీఏగా పనిచేసిన కృష్ణారెడ్డి అవినాష్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఈ కేసులో సిబిఐ ఏ-3 గా పేర్కొన్న శివశంకర్ రెడ్డికి, కృష్ణారెడ్డికి మధ్య ఫోన్ సంభాషణలు జరిగాయి. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తున్నప్పటికీ అవినాష్ మాత్రం వాళ్ళు ఎవరో తెలియదని చెబుతున్నారు. ఫోటోలు, ఫోన్ డేటా చూస్తే అవినాష్ రెడ్డి చెబుతోంది మొత్తం అబద్ధమని తెలుస్తోంది. కడప జిల్లాలో వివేకానంద రెడ్డి బలమైన నాయకుడు. ఆయన బతికి ఉండగా ఆ స్థాయికి చేరుకోవడం అవినాష్ రెడ్డికి సాధ్యం కాదు కాబట్టి అసూయ పడ్డారు. హత్య జరుగుతున్న సమయంలో అవినాష్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి ఫోన్ మాట్లాడుకున్నారని" సునీత స్పష్టం చేశారు."మా నాన్న వివేకానంద రెడ్డి విమలమ్మకు స్వయానా సోదరుడు. అలాంటి వ్యక్తి చనిపోతే విమలమ్మ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. కడపలో మేము చేసిన వ్యాఖ్యల పట్ల ఆమె విమర్శలు చేశారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసినప్పుడు విమలమ్మ ఎందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు?. నా తండ్రి హత్య కేసు విషయంలో నాకు న్యాయం జరిగేందుకు ఎవరితోనైనా మాట్లాడతాను. చివరికి సీఎం జగన్ తో సహా మాట్లాడేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. గతంలో దీనికి సంబంధించి చాలాసార్లు జగన్ తో మాట్లాడాను. ఇప్పుడు ఆయన అపాయింట్మెంట్ దొరకడం లేదు. దీనికోసం చాలాసార్లు లేఖలు కూడా రాశాను." అని సునీత పేర్కొన్నారు.కాగా, వివేకానంద రెడ్డి హత్యకు కొద్ది రోజుల ముందు.. ఒక సభలో వేదికపై అవినాష్ రెడ్డి ఏదో చెబుతున్నప్పటికీ వివేకానంద రెడ్డి పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఆ దృశ్యాలను సునిత ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో ప్రదర్శించారు.. అంతేకాదు వివేకానంద రెడ్డి ఇంటి సమీపంలో ఉమా శంకర్ రెడ్డి పరుగులు తీసిన దృశ్యాలు, హత్య అనంతరం సాక్షి పత్రిక, చానల్లో వచ్చిన వార్తల క్లిప్పింగులు, వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలను సునీత ప్రముఖంగా ప్రస్తావించారు.."మా నాన్న హత్య జరిగినప్పుడు నేను ఒంటరిని. న్యాయం కోసం ఐదు సంవత్సరాలు నుంచి పోరాడుతున్నాను. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల నుంచి నాకు మద్దతు లభిస్తోంది. వారికి అసలు విషయాలు తెలియాలనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశానని" సునీత ఈ సందర్భంగా ప్రకటించారు.

# రాయితోనే దాడి చేసారు కానీ...!!

విజయవాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై రాయితోనే దాడి చేశారని విజయవాడ సీపీ కాంతిరాణా నిర్ధారించారు. అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించిన తర్వాత నిర్ధారణకు వచ్చినట్టు చెప్పారు. దాడి చేసిందెవరో ఇంకా గుర్తించలేదని సీపీ స్పష్టం చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో నిందితుడిని గుర్తించెందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.శనివారం రాత్రి 8.04 గంటలకు సిఎం జగన్‌పై దాడి జరిగిందని సీపీ చెప్పారు. 24 సీసీ ఫుటేజీలను పరిశీలించిన తర్వాత రాయితో దాడి చేసినట్టు నిర్ధారణకు వచ్చినట్టు చెప్పారు. ముఖ్యమంత్రికి తగిలిన తర్వాత అదే రాయి పక్కన ఉన్న వెల్లంపల్లికి తగిలిందని వివరించారు. ఈ కేసు దర్యాప్తు కోసం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.ఎన్టీఆర్ జిల్లాలో సిఎం బస్సు యాత్ర 22కిలోమీటర్ల మేర బస్సుయాత్ర కొనసాగిందని, మొత్తం 1480 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారని చెప్పారు. బస్సు యాత్ర వెంబడి మొత్తం 40 రోప్ పార్టీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ట్రాఫిక్, ఏపీఎస్పీ టీమ్స్, డాగ్ స్క్వాడ్స్, యాక్సిస్ కంట్రోల్ సిబ్బంది కూడా పనిచేశారన్నారు.బస్సు యాత్రకు అడ్డంకులు ఉన్న చోట వీలైనన్ని చోట్ల కరెంట్ నిలిపివేస్తారని వివరణ ఇచ్చారు. సెక్యూరిటీ, సేఫ్టీ కోసం రూఫ్ టాప్ వీఐపీ ప్రోగ్రామ్ ఉన్నచోట కరెంట్ సరఫరా నిలిపివేస్తారని, బస్సుయాత్ర డాబా కొట్లు దాటి వివేకానంద స్కూల్ వద్దకు వచ్చేసరికి ఒక వ్యక్తి బలంగా రాయి విసిరాడని సీపీ చెప్పారు.రాయి సీఎం కంటిపై తగిలిన తర్వాత వెల్లంపల్లి కంటికి తగిలిందని, కేసు దర్యాప్తు కోసం గతంలో పనిచేసిన అధికారులతో కలిపి టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆ సమయంలో అక్కడ ఎవరెవరు ఉన్నారో సెల్ ఫోన్స్ డేటా పరిశీలించామని చెప్పారు. 50మందికి పైగా అనుమానితులను విచారించామని, అతి తొందర్లోనే కచ్చితంగా నిందితుడిని పట్టుకుంటామని చెప్పారు.రాయి విసిరింది ఎవరో తెలుసుకోడానికి ప్రయత్నిస్తున్నట్టు సీపీ కాంతిరాణా చెప్పారు. ఈ కేసులో బలమైన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. అతి త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు. విజయవాడలో 22కి.మీల పొడవున సిఎం రోడ్ షో జరిగిందని భద్రత కోసం 1400మంది సిబ్బందిని వినియోగించినట్టు చెప్పారు. ర్యాలీ సింగనగర్‌లోకి ప్రవేశించిన తర్వాత డాబా కొట్ల సెంటర్‌లోకే వెళ్లే సమయంలో దాదాపు 4-5వేల మంది ప్రజలు ఉన్నారని, ఘటనా స్థలంలో ఐదారు వేలమంది గుమిగూడి ఉన్నారని చెప్పారు.ముఖ్యమంత్రి జగన్ మీద రాయితోనే దాడి జరిగిందని, ఎయిర్ గన్‌తో చేసిన దాడి కాకపోవచ్చన్నారు. రాయిని దేనితో విసిరారనే దానిపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం తమ వద్ద 2మెగా పిక్సెల్ ఎవిడెన్స్ మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని చెప్పారు. కేసును త్వరలోనే చేధిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌పై దాడి వ్యవహారంలో దర్యాప్తు నుంచి విజయవాడ సీపీని తప్పించాలని టీడీపీ నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దాడి తర్వాత సెక్యూరిటీ సిబ్బంది కిందకు ఒంగితే, సిఎం మాత్రం నిలబడి ఉన్నారని, ఇదంతా పద్ధతి ప్రకారం జరిగిందన్నారు.

# ముఖ్యమంత్రిని హెచ్చరిస్తున్నా... రైతుకు బోనస్ ఇవ్వండి...
## మేం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయం

ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మనం దెబ్బతిన్నామని కేసీఆర్ అన్నారు. మనం ఉన్నప్పుడు రైతులు ధీమాగా ఉండేవారన్నారు. రైతుల ఖాతాల్లో రైతుబంధులు పడేవని, ఇరవై నాలుగు గంటలు నీళ్ళిచ్చామన్నారు. నేను కడుపులో పెట్టుకొని కాపాడిన రైతులు ఈరోజు ఆగం అవుతున్నారన్నారు. పంట బోనస్‌కు అందరం కలిసి కొట్లాడుదామన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపు

తాము అధికారంలోకి వస్తే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పి ఇప్పుడు దానిని అమలు చేయడం లేదని, వాయిదా వేసిందని విమర్శించారు. మహిళలకు రూ.2500తో పాటు ఏ హామీని నెరవేరలేదన్నారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తీసుకు వచ్చామని, అధికారంలోకి వచ్చాక తెలంగాణను అభివృద్ధి చేశామన్నారు. రైతుబంధు తీసుకువచ్చామన్నారు. తాము అధికారంలోకి వస్తే పంటకు బోనస్ ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి



చెప్పాలని పిలుపునిచ్చారు. రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని, బోనస్ ఇవ్వాలని, వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే సిద్దిపేట రైతులు ఈ పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారని గుర్తు చేశారు. రైతుబంధు ఏది? అని అడిగితే ఈ లిల్లీపుట్ గాళ్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యల గురించి అడిగితే పేగులు తీసి మెడలో వేసుకుంటాం... పండబెట్టి తొక్కుతాం... బాడీ మీద చెడ్డీలేకుండా చేస్తామంటూ అగౌరవంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

## శ్రీరామనవమి కి ముస్తాబైన ఆలయాలు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో **(గౌతమ్ న్యూస్ ):** శ్రీరామనవమిని పురస్కరించుకొని ఈనెల 17న శ్రీరాముడు జన్మించిన రోజు భక్తులు భక్తిశ్రద్ధల మధ్య శ్రీరామనవమి జరుపుకోవడానికి ఆలయాలను ముస్తాబ్ చేశారు, ఎక్కడ చూసినా శ్రీ రామ మందిరాలలో రంగురంగుల కాంతులతో ఆలయాలను అందంగా చక్కగా తీర్చిదిద్దారు, త్రేతాయుగంలో దశరథ మహారాజ్ కౌసల్యులకు శ్రీరాముడు జన్మించిన దినం పునర్వాస నక్షత్రం కర్కట లగ్నం లో సరిగ్గా అభిజిత్ ముహూ ర్తం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీరాముడు జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి, ఉన్నారు వాస నక్షత్రాల చైత్ర శుద్ధ నవమి రోజు దేశవ్యాప్తంగా హిందువులంతా ఘనంగా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు జరుపుకోవడం వస్తుంది, జ్యోతిష్య శాస్త్ర పరిశోధనల ప్రకారం 5114 జన్మించి ఉండవచ్చు అని భావిస్తున్నారు, అజ్ఞానుభావుడైన శ్రీరాముడికి అందాల సీతమ్మకు శ్రీరామనవమి రోజు వివాహం జరిగినట్లు పురాణాలు చెబుతున్నాయి, ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజు సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా శ్రీరామ నామంతో మారుమవుతాయి, ఇందుకోసం శ్రీరాముని భక్తులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు,

## అంగన్వాడి కేంద్రంలో ఈసీసీఈ ప్రోగ్రాం....!!





మహబూబాబాద్ బ్యూరో**(గౌతమ్ న్యూస్ ):** మరిపెడ మండల పరిధిలోని ఉల్లేపల్లి సెక్టర్ లచ్చ తండా, తండ ధర్మారం జి.పి. అంగన్వాడి సెంటర్లో మంగళవారం ఈసీసీఈ ప్రోగ్రాం ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ. సి. డి. ఎస్. ప్రాజెక్టు ఆఫీసర్ శిరీష, సూపర్ వైజర్ పద్మ విచ్చేశారు. ప్రాజెక్టు ఆఫీసర్ శిరీష మాట్లాడుతూ. బాలుల మొదటి విద్యా దశ అంగన్వాడి కేంద్రం నుంచి ప్రారంభం అవుతుందని బాలలకి వివిధ పాఠ్యపుస్తకాలు, ఆటబొమ్మలపై అవగాహన కల్పించమన్నారు. అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసే పౌష్టికాహారం కొరకు ప్రతిరోజు బాలులని అంగన్వాడి కేంద్రానికి పంపాలని కోరారు. బాలుల అభివృద్ధి, ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శాంతి, సుశీల, లీలాబాయి, నాగచంద్ర, పద్మ, ఏ.ఎన్.ఎం. రాములమ్మ, మరియు ఆయాలు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి రోజున రాములవారికి పానకం, వడపప్పు



టేకులపల్లి**(గౌతమ్ న్యూస్ ):** శ్రీరామనవమి రోజే రాముడి పుట్టినరోజు. ఈ పవిత్రమైన రోజున రామభక్తులు సీతారాముల కళ్యాణాన్ని తిలకించి, శ్రీరామచంద్రమూర్తిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ సందర్భంగా శ్రీరామునికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించి పూజిస్తారు. అయితే ఈ పండుగ రోజున శ్రీరాముడికి నైవేద్యంగా పానకం, వడపప్పు ప్రత్యేకంగా తయారుచేస్తారు. వాటిని నైవేద్యంగా ఎందుకు సమర్పిస్తారో తెలుసుకుందాం. శ్రీరామచంద్రుడికి బెల్లం అంటే చాలా ఇష్టమని పండితులు చెబుతున్నారు. ఆధ్యాత్మిక రామాయణం ప్రకారం, రాముడు వనవాస సమయంలో, రాముడు, సీత , లక్ష్మణులు పండ్లు, విత్తనాలు, మూలికలతో పానకం తయారు చేశారు. ఆయనకు ఋషులు వడపప్పు సమర్పించినట్లు కూడా కథనాలు ఉన్నాయి.

### సంస్కృతి ప్రాముఖ్యత:

శ్రీరామ నవమి రోజున, భక్తులు సంప్రదాయబద్ధంగా పానకం, వడప్పలను తయారు చేసి, వాటిని స్వామికి సమర్పించి, ఆపై వాటిని ప్రసాదంగా తీసుకుంటారు. సామాజిక సమానత్వం, సహకారాన్ని ప్రోత్సహించడం ఈ పండుగ యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటి.

పానకం: వేసవిలో చేసే శ్రీరామనవమిలో పానకం తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. యాలకులలో ఉండే ఔషధ గుణాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

వడపప్పు : ఇందులో ఉండే ప్రోటీన్, ఫైబర్ పీచు పదార్థాలకు మూలం. పప్పు తినడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

## శ్రీరామనవమి పండుగ వెనుక ఉన్న ఆసక్తికర శాస్త్రీయ కారణాలు



టేకులపల్లి **(గౌతమ్ న్యూస్ ):** దేవుళ్లలో శ్రీరాముడి స్థానం వేరు. ఎందుకంటే నిత్యం సత్యమే పలుకుతాడు. హిందూ మతానికి చెందిన వారే కాకుండా అన్ని మతాల వారికి శ్రీరామచంద్రుడి గురించి తెలుసు. భక్తులు అమితమైన భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. హిందూ క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది చైత్రమాసం నవమి తిథి రోజున శ్రీరామనవమి పండుగ జరుపుకోనున్నారు. ఏప్రిల్ 16 మంగళవారం మధ్యాహ్నం 1.23 గంటల నుంచి తిథి ప్రారంభం అవుతుంది. ఏప్రిల్ 17వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3.14 గంటలకు తిథి ముగుస్తుంది. ఈ శ్రీరామనవమి పండుగ వెనుక ఆసక్తికర శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. అవేంటో ఇక్కడ ఇక్కడ తెలుసుకుందాం.. రామ నామం అనేది పవిత్రమైన నామం. దీనిని ఉచ్చరిస్తే చాలు. రామ నామాన్ని ఒక్క సారి ఉచ్చరించడం వల్ల ఇతర దేవుళ్ల పేర్లను వెయ్యి సార్లు ఉచ్చరించిన ఫలితం దక్కుతుందని శివుడు చెప్పాడు. రామనామ బలంతో బోయ వాడు వాల్మీకిగా మారి రామాయణం అనే గొప్ప గ్రంథాన్ని రచించాడు. ఎండాకాలం మొదలయ్యే ముందు శ్రీరామనవమి పండుగ జరుగుతుంది. నీటి కొరత, అధిక వేడి వంటి సమస్యలు ఈ సమయంలో మనుషుల్ని బాగా ఇబ్బంది పెడతాయి. అలాంటి సమయంలో, రామనామాన్ని జపిస్తూ వేడుకలో పాల్గొనడం వల్ల ప్రజలు ప్రశాంతతను పొందుతారు. ఈ రోజున అనేక మంది భక్తులు ఉపవాసం ఉంటారు. రానున్న రోజుల్లో కరువును తట్టుకునేందుకు ఈ ఆచారం ఉపయోగపడనుంది. ఈ పండుగ రోజున చేసే ఉపవాసం రోగనిరోధక శక్తిని కూడా బలపరుస్తుంది. దాని వలన ఎలాంటి వ్యాధులు రావని శాస్త్రీయ నిపుణులు చెబుతున్నారు.

# కనీస వసతులకు కూడా నోచుకోని ఉపాధి హామీ కూలీలు




నల్లబెల్లి మండల**(గౌతమ్ న్యూస్ ):** ప్రభుత్వం ఉపాధి కూలీల వలసలు నిరోధించడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించడం లేదు. ప్రతి ఎండ కాలంలో వడదెబ్బతో ఉమ్మడి జిల్లాలో 15 మంది వరకు కూలీలు మృతి చెందుతున్నారు అనేకమంది తీవ్ర అస్వస్థకు గురవుతున్నారు ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడమే ప్రధాన కారణం ఏప్రిల్ మొదటి వారం నుంచి ఉమ్మడి జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ పైగానే నమోదవుతుంది రానున్న రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరగవచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు అయినా ఉపాధి పనులు చేపట్టే ప్రాంతాల్లో కూలీలకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదు నీడనిచ్చే పట్టాలు ప్రాథమిక చికిత్స కిట్లు కష్టానికి చెల్లించే భత్యం ఏమీ లేకపోవడంతో కూలీలు ఆవేదన చెందుతున్నారు జిల్లాలో సుమారుగా 7.96 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి నేటి ద్వారా 20 లక్షల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఉపాధి కూలీలు అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి భోజనం చేయడానికి గతంలో ప్రభుత్వం టెంట్లు పంపిణీ చేసింది వీటిని ఫీల్డ్ అసిస్టెంట్లు నిత్యం పని ప్రదేశానికి తీసుకు వెళ్లేవారు రెండేళ్ల క్రితం ప్రభుత్వం వీరిని తొలగించి తిరిగి విధుల్లోకి తీసుకుంది గతంలోని గూడారాలు ఎక్కడ ఉన్నాయో ఇప్పటికీ తెలియని పరిస్థితి నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి పట్టాలు రావడం లేదు కూలీలు గత్యంతరం లేక కాసేపైనా సేద తీరేందుకు సమీప చెట్లను ఆశ్రయిస్తున్నారు చెట్లు కూడా లేని చోట కండువాలు కప్పుకుంటున్నారు వృద్ధులు చిన్నపిల్లల తల్లులు వేడి తట్టుకోలేక అవస్థ పడుతున్నారు పిల్లల్ని వెంట తీసుకువెళ్లే వారి పరిస్థితి మరి దయనీయంగా ఉంది గతంలో సమకూర్చిన టెంట్లు పనికిరాకుండా పోయాయి మళ్ళీ కొత్త వాటి కొనుగోలుపై ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు కూలీలకు వడదెబ్బ తగలకుండా గూడారాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉపాధి కూలీల సౌకర్యార్థం మెడికల్ కిట్లు ఇచ్చేవారు చిన్న చిన్న గాయాలైనప్పుడు ఎండ వేడి వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ ఏర్పడినప్పుడు ప్రథమ చికిత్స చేయడానికి వీటిని ఉపయోగించేవారు. ఇందులో అయోడిన్ సీసా, బ్యాండేజ్ ,కాటన్ , ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు కొన్ని రకాల మాత్రలు ఉండేవి .ఆ తర్వాత వీటి సరఫరా మరిచారు పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గాయమైతే ప్రథమ చికిత్స కోసం స్థానిక పీహెచ్సీలకు వెళ్లాల్సి వస్తుంది అవి లేని చోట్ల ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు ఏడాదికి సుమారు 500 మంది గాయపడుతున్నారు గతంలో తాగునీటి వసతి కల్పించేవారు ఇందుకోసం ప్రత్యేకంగా కూలీని నియమించేవారు ఆ తర్వాత ఈ పద్ధతిని మార్చేశారు ఇప్పుడు కూలీలు ఇంటి నుండే నీళ్లను ప్లాస్టిక్ బాటిల్లో తెచ్చుకుంటున్నారు పనిముట్లు ఇవ్వడం లేదు ఉపాధి హామీ పని పరికరాల పంపిణీ ఎప్పుడో మర్చిపోయారు రాష్ట్ర ఆవిర్భావానికి ముందు కూలీలకు గడ్డపార పారా కట్టెలు ఇచ్చారు 2014 నుంచి వీటి ఊసే లేకుండా పోయింది .పనిముట్లు అందించకపోవడం వల్ల కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు కూలీలే పనిముట్లు తెచ్చుకునేందుకు గాను తట్ట గడ్డపారలకు ఆరు రూపాయలు కూలీలోనే చెల్లిస్తున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీరికి తగిన సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుచున్నారు..

## చెక్ పోస్ట్ లు,డైనమిక్ చెక్ పోస్ట్ లలో ముమ్మర తనిఖీలు చేయాలి

**– జిల్లా ఎస్పీ కె.వి.మురళీక్రిష్ణ ఐపీఎస్**




అనకాపల్లి, **(గౌతమ్ న్యూస్ ):** జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మురళీక్రిష్ణ ఐపీఎస్ నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించి, దర్యాప్తు లో ఉన్న సాధారణ, తీవ్రమైన మరియు ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సి.ఆర్.పి.సి. కేసులు, గంజాయి కేసులు మరియు మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..చెక్ పోస్ట్ లు, డైనమిక్ చెక్ పోస్ట్ లలో ముమ్మర తనిఖీలు చేసి డబ్బు, మద్యం ఇతర ఉచిత కానుకలు సీజ్ చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, పోలీస్ అధికారులు సమాచారంను సేకరించి, ప్రత్యేక కార్యాచరణతో వివిధ శాఖల సమన్వయంతో దాడులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. రాజకీయ నాయకుల ఎన్నికల బహిరంగ సభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ, బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి ఎటువంటి దుందుడుకు చర్యలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. 2024 సం.,లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ ఏప్రిల్, 18 నుండి 25వ తేదీ వరకు జరగనున్నందున, ఎన్నికల నియమావళి ప్రకారం బందోబస్తు ఏర్పాట్లను చేసుకుంటూ అభ్యర్థి యొక్క 3 వాహనాలు మాత్రమే నామినేషన్ సమయంలో రిటర్నింగ్ కార్యాలయం లోనికి అనుమతించాలని, అభ్యర్థి సహా 5 గురు వ్యక్తులు మాత్రమే రిటర్నింగ్ అధికారి ఛాంబర్ లోనికి అనుమతించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు, ఫేక్ న్యూస్ లను వ్యాప్తి చేసే వారిపై కేసులు నమోదు చేసి, పటిష్టమైన దర్యాప్తు నిర్వహించి ఈ ఆయా కేసుల్లో నిందితులకు శిక్ష పడే విధంగా డాక్యుమెంటరీ, టెక్నికల్ సాక్ష్యధారాలను సేకరించి నిందితులకు శిక్ష పడేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఎన్.బి.డబ్ల్యూ అమలుచేసి నేరస్తులను గుర్తించి, గంజాయి అక్రమ రవాణా చేసే వారి పై చర్యలు చేపట్టాలన్నారు. మరియు రౌడీ షీటర్లు, చెడునడత కలవారి వివరాలు సేకరించి బౌండవర్లు చేయించాలని, గ్రామాల్లో తరచు సందర్శించి గ్రామస్తులకు స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మునగపాక మద్యం కేసులో భారీ ఎత్తున పట్టుకున్న 7,050 లీటర్ల గోవా మద్యం ను దీని విలువ సుమారు 50 లక్షలకు పైగా విలువ కలిగిన మద్యం ను ఒక కంటైనర్ తో పట్టుకున్న అధికారులకు, సిబ్బందికి అలాగే రోలుగుంట 590 కేజీ గంజాయి సుమారు 30 లక్షల విలువైన గంజాయి ని మరియు నిందితులను పట్టుకున్న కేసులో ప్రతిభ కనబరిచిన అధికారులకు సిబ్బందికి ( పై రెండు కేసులలో 25 మంది కి) ప్రశంసా పత్రాలు, నగదు చెక్కులతో ఎస్పీ కె.వి.మురళీక్రిష్ణ ఐపీఎస్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ జి.ఆర్.ఆర్.మోహన్, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇనస్పెక్టర్ లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు మరియు కుమారస్వామి, సతీష్ మరియు సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, శ్రీనివాస్ మరియు జిల్లాలోని ఇతర సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరాముడు ఆదర్శనీయుడు...

హక్కుల కంటే బాధ్యత గొప్పదన్నది రామతత్వం! కష్టంలో కలిసి నడవాలన్నది సీతాతత్వం...
శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపిన.
మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డ భాగ్యరాజ్....
బుడ్డ స్వర్ణలతభాగ్యరాజు తాజామాజీ సర్పంచ్....



మెదక్ ప్రతినిధి,**(గౌతమ్ న్యూస్ ):** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. శ్రీరామ నవమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు... " హక్కుల కంటే బాధ్యత గొప్పదన్నది రామతత్వం! కష్టంలో కలిసి నడవాలన్నది సీతాతత్వం.. " శ్రీరాముడు కష్టాల్లో మనో నిబ్బరం కోల్పోకుండా ముందుకు సాగి విజయం సాధించారు అని, శ్రీరామున్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు నడవాలన్నారు. మానవ అవతారమూర్తులైన సీతారాములు ధర్మసంస్థాపనకు నిలువుటద్దంగా నిలిచారని స్పష్టం చేశారు. శ్రీరాముని అనుగ్రహముతో అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాదించాలని...ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ఆనందం తో పాడి పంటలతో వర్ధిల్లాలని భగవంతున్నీ ప్రార్థిస్తున్నానాని అన్నారు. శ్రీ సీతా రామచంద్ర స్వామి కళ్యాణోత్సవాన్ని వేడుకగా జరుపుకోవాలని. ప్రజలందరు ఆనందోత్సాహాల మధ్య సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

## వైభవంగా రేణుక మాతా అభిషేకం....



మెదక్ **(గౌతమ్ న్యూస్ ):** రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో అందరు చల్లగా ఉండాలని రాచర్ల సంధ్య ప్రవీణ్,పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్ ( ఎంపిటిసి ) గౌడ్, హన్ మాన్ సింగ్ దంపతులు కోరుకున్నారు . అమ్మను నమ్ముకుని చేసిన పనులు సత్ఫలితాలని స్తాయని పేర్కొన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవము అనంతరం 16 వ మంగళవారం నాడు శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో రాచర్ల సంధ్య ప్రవీణ్ పఠాన్ చెరువు,పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్( ఎంపీటీసీ ), హన్ మాన్ సింగ్ కూకట్ పల్లి ,దంపతులు చే శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక,అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా చల్లూరి కృష్ణ శర్మ, సాగరికల మంత్రోచ్ఛహరణల మధ్య ఘనంగా





జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో , ఎంపీడీఓ లక్ష్మి నర్సిములు, సూపరిండెంట్ విట్టల్ నాయక్, ఏపీఓ మైపాల్ రెడ్డి,రామకృష్ణ గౌడ్, దుర్గా గౌడ్, సంగమేశ్వర్, ప్రభాకర్,దేవన్న గారి శేఖర్, కృష్ణమూర్తి, భాస్కర్ ,మాజీ ఉప సర్పంచ్ చెన్నయ్య, మహేశ్వర్ రెడ్డి,రామాగౌడ్,పాపగౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,అరుణ్ గౌడ్, చక్రదర్ గౌడ్ ,కిష్టయ్య ,సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజిఎస్ వర్కర్స్ ను కలిసిన మలసాల భరత్ కుమార్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజిఎస్ )లో పనిచేస్తున్న వారిని మర్యాదపూర్వకంగా కలిసిన భరత్ ..



అనకాపల్లి **(గౌతమ్ న్యూస్ ):** అనకాపల్లి నియోజకవర్గ అసెంబ్లీ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారిని మర్యాదపురం కలవడం జరిగింది. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ %చీ=జు+ూ% వర్కర్స్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని అనకాపల్లి ని అభివృద్ధి చేస్తానని మే 13 న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ఓటును ఫ్యాను గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు... ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వెస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు,అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందా, వైస్ ఎంపీపీ వీల్లూరి సూర్య కుమారి శేఖర్, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, పి, గాంధీ, సి హెచ్ చిన్న, పీలా బుజ్జి, సూరిశెట్టి శ్రీను,కొణతాల శివాజీ,ఎంపీటీసీలుఅశోక్,పన్నీరు చంటి, పంచదారల కన్నారావు,పడాల గణపతి,బుదిరెడ్డి దేవుడు,కోలపర్తి శ్రీను, ఆడారి ప్రసాద్, ఆడారి లక్ష్మణరావు మరియు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు పాల్గొన్నారు...

## శ్రీరామనవమి సందర్భంగా

### క్రీడల ( క్రికెట్, వాలీబాల్ ) పోటీలను ప్రారంభించారు

సీనియర్ రాజకీయ నాయకులు సారేపల్లి శేఖర్

అన్నపురెడ్డిపల్లి /చంద్రుగొండ**(గౌతమ్ న్యూస్ ):** క్రీడలతో శరీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందనిసీనియర్ రాజకీయ నాయకులు సారేపల్లి శేఖర్ అన్నారు. మంగళవారం అయ్యన్న పాలెం గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా క్రీడల (క్రికెట్, వాలీబాల్) పోటీలను ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సారేపల్లి శేఖర్ మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపొటములు సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమిని గెలుపుకు పునాదిగా వేసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాలోత్ భోజ్యనాయక్, కేశ బోయిన నరసింహారావు, చాపల మడుగు రామరాజు, ప్రసాద్, మనోహర్, క్రీడాకారులు వెంకటేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.





# అంగన్ వాడీ కేంద్రాలలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలి





కొత్తగూడెం (పాల్వంచ.) (**గౌతమ్ న్యూస్** ): పాల్వంచ మండలంలో బీజేపీ పార్టీ మహిళ మోర్చ పట్టణ అధ్యక్షురాలు నందిగం వెంకరమణ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రాలలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చెప్పట్టాలని పాల్వంచ సిడిపిఓ కార్యాలయం లో ఫిర్యాదు చెయ్యడం జరిగినది. ఫిర్యాదు అనంతరం బీజేపీ పార్టీ మహిళ మోర్చ పట్టణ అధ్యక్షురాలు నందిగం వెంకటరమణ మాట్లాడుతు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం - మండలం లోని అంగన్వాడీ కేంద్రాల ల్లో నీరు పేద గర్భిణీ స్త్రీ లకు మరియు నీరు పేద పిల్లలకు ఇచ్చే పోషకాహారం కోడి గుడ్లు సమయానికి రావడం లేదు. ముఖ్యంగా పేద పిల్లలకు, గర్భిణీ స్త్రీ లకు అంగన్ వాడీ కేంద్రాల లో పెట్టె భోజనం లో కూడ నాణ్యత ఉండటం లేదు అదేవిధంగా గర్భిణీ స్త్రీ లకు చిన్న పిల్లలకు అంగన్ వాడీ కేంద్ర లలో ఇచ్చే కోడి గుడ్లు చాల చిన్నవి గా ఉంటున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలకు కూరగాయలు కోడి గుడ్లు సప్లయ్ చేసే కాంట్రాక్టర్ కావాలనే ఉద్దేశపూర్వకంగా చిన్న సైజు లో ఉండే కోడి గుడ్లు సప్లై చేస్తున్నారు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పేద గర్భిణీ స్త్రీ, చిన్న పిల్లల కోసం వారికీ పౌష్టిక ఆహారం అందించాలని అంగన్ వాడీ కేంద్రాలలో పిండి,భోజనం,కోడి గుడ్లు,పాలు అందిస్తుంటే మధ్యలో దళారీ వ్యవస్థ వాటిని దోచుకొని నాణ్యత లేని ఆహారం, చిన్న సైజు కోడి గుడ్లు ఇస్తున్నారు కావున పాల్వంచ లోని అన్ని అంగన్ వాడీ కేంద్ర లలో సమయానికి గర్భిణీ స్త్రీ లకు చిన్న పిల్ల లకు ఇచ్చే ఆహారం ఇవ్వాలని అదేవిధంగా కోడి గుడ్ల విషయం లో కూడ విచారణ జరిపి పేద గర్భిణీ స్త్రీ మరియు పేద చిన్న పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్న దళారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము లేని యడల బీజేపీ పార్టీ మహిళ మోర్చ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలియచేస్తున్నాం ఈ కార్యక్రమంలో నిమ్మల నాగలక్ష్మి, బానోత్ అనురాధ,గార్లపాటి మంగ,యక్షిత లు పాల్గొన్నారు

# అక్రమంగా ఇసుక తరలింపు..

అడుగంటుతున్న భూగర్భ జలాలు....

పట్టించుకోని సంబంధిత అధికారులు..



డోర్నకల్ /మరిపెడ రూరల్ (**గౌతమ్ న్యూస్** ): మరిపెడ మండలం భూక్యతండ గ్రామపంచాయతీ పరిధిలోని తేజవత్ తండా సమీపంలోని ఆకేరు వాగు డంపింగ్ నుంచి కొందరు వ్యక్తులు నిత్యం పదుల సంఖ్యలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. చుట్టూర గ్రామాలైన వీరారం విస్సంపల్లి, ఉల్లేపల్లి, మరిపెడ బంగ్లా, ఎల్లంపేట తదితర గ్రామాలతో పాటు గిరిజన తండాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ. 5000 వేల చొప్పున తీసుకుంటూ రెండు ట్రాక్టర్ల ద్వారా నిత్యం ఇసుకను తరలిస్తున్నారు. ఇందుకు కొందరు అధికారుల అండతోనే ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. గత రెండు నెలలుగా ఈ అక్రమ ఇసుక దందా మూడు పువ్వులు ఆరుకాయలు కొనసాగిస్తూ లక్షల రూపాయలు దండుకున్నట్లు తెలుస్తుంది. ఇసుక తరలించే



ట్రాక్టర్లకు రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా లేకపోవడంతో వీరి దందాకు అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుంది. ఇద్దరు వ్యక్తులు రెండు నెలల నుంచి ఈ దందాకు తెరలేపినట్లుగా పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వీరి ట్రాక్టర్లు సీజ్ చేయడంతో పాటు, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆకేరు వాగు పరివాహక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఒలంపియాడ్ పరీక్షల్లో శ్రీ చైతన్య స్టూడెంట్ల ప్రభంజనం!!



నాగర్ కర్నూల్ వనపర్తి హీరో (**గౌతమ్ న్యూస్** ): వనపర్తి పట్టణ సమీపంలోని చిట్యాల రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ స్టూడెంట్లు ఇటీవల జాతీయ స్థాయి లో ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో సత్తా చాటారు. వనపర్తి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బ్రాంచ్ నుంచి మొత్తం 158 మంది స్టూడెంట్లు ఈ టాలెంట్ పరీక్షలో పాల్గొనగా 132 మంది విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చి వివిధ స్థాయిల్లో బహుమతులను సాధించారు. వారిలో ఆడెం మనస్వీ యాదవ్, గ్రాండ్ ప్రైజ్ (లెనెవో ల్యాప్ టాప్), బి.కార్తికేయ, ద్వితీయ బహుమతి ( స్మార్ట్ వాచ్ ), వి. సంజన తృతీయ బహుమతి ( స్మార్ట్ వాచ్ ) లతో ఇతర బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్ లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఒలంపియాడ్ విన్నర్స్ కు ప్రత్యేక బహుమతులతో పాటు గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య టెక్నో స్కూల్ చైర్మన్ మాట్లాడుతూ తమ స్కూళ్లల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వారిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రైమరీ ఎడ్యుకేషన్ స్థాయిలోనే పోటీపరీక్షలను రాసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రాథమిక విద్య స్థాయిలోనే స్టూడెంట్లకు వివిధ రకాల పోటీ పరీక్షలను నిర్వహిస్తూ భవిష్యత్తు పోటీ పరీక్షలైనా ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్, ఎంబీబీఎస్ తదితర ఎంట్రెన్స్ లలో విజయం సాధించేందుకు ఇక్కడే పునాదులు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లెంపాటి శ్రీ విద్య, ఏజీఎం భాస్కర్ రెడ్డి, కో ఆర్డినేటర్ మధు, డీన్ గోపి, సీ బ్యాచ్ ఇంచార్జ్ ప్రతిమ, ప్రైమరీ సెక్షన్ ఇంచార్జ్ దీపిక, పాఠశాల టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# నందిగామ బారసోసియేషన్ నూతన కార్యవర్గం, మచిలీపట్నంలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీమతి అరుణాసారిక మర్యాదపూర్వకంగా కలిసిరు



నందిగామ (**గౌతమ్ న్యూస్** ): కార్యవర్గం నూతన పరిచయం చేసుకొని , నందిగామ బారసోసియేషన్ మరియు నందిగామ కోర్టు పనుల గురించి, పలు అంశాలపై జిల్లా జడ్జి చర్చించడం జరిగినది, ఆ అంశాలపై పీడీజే సానుకూలంగా స్పందించినారు. ఈ సమావేశంలో శ్రీ నంద్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షులు, శ్రీ కురగంటి కృష్ణంరాజుఉపాధ్యక్షులు, శ్రీ అద్దంకి మణి బాబు సెక్రటరీ,శ్రీ ఎక్కిరాల హనుమంతరావు జాయింట్ సెక్రెటరీ, శ్రీ చాట్రగడ్డ రవికుమార్ ట్రెజరర్, శ్రీ ఆనందం విజయభాస్కర్ లైబ్రేరియన్, స్పోర్ట్స్ మెంబర్ గుగులోతు రామారావు సీనియర్ న్యాయవాదిదాదా హుస్సేన్ ,యువ న్యాయవాది శ్రీముళ్ళపాటి అశోక్ పాల్గొన్నారు



# జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఐపీఎస్., ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది ఏప్రిల్ 15న మద్యం, ఇసుక, గంజాయి, కోడిపందాలు మరియు జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు

అనకాపల్లి (**గౌతమ్ న్యూస్** ): చీడికాడ మండలం, వరాహపురం గ్రామ సమీపంలో ఎస్సై జి.నారాయణరావు కు రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో రాగా పోలీసులను చూసి తప్పించుకునే క్రమంలో ఒక నిందితుడు తో పాటు ఒక జువనైల్ పట్టుబడ్డారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 8 కేజీల గంజాయి లభ్యమయ్యింది. అక్రమ రవాణా కు పాల్పడుతున్న నిందితుడిని మధ్యవర్తులు సమక్షంలో అరెస్టు చేసి, ఒక జువనైల్ ను అబ్జర్వేషన్ హోం కు తరలించి, గంజాయిని, రెండు ద్విచక్ర వాహనం, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న చీడికాడ పోలీసులు. కోడి







పందాలు, జూదం తదితర లు అరికట్టేందుకు రావికమతం మండలం, కొత్తకోట గ్రామ సమీపంలో పోలీసులు పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఒక కేసు నమోదు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రూ.1,250/- నగదు, 3 ద్విచక్ర వాహనాల ను స్వాధీనం చేసుకున్న కొత్తకోట పోలీసులు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 10 గురుపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎం.వి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 210 కేసులు నమోదు చేసి, ఈ-చలానా గా రూ.33,565/- లు విధించారు. ప్రజలకు దిశా??యాప్ పట్ల అవగాహన కల్పించి, 04 మందితో యాప్ డౌన్లోడ్ చేయించారు. 6,03,745 మంది తో యాప్ ను డౌన్లోడ్ చేయించగా, 2,13,888 మందితో రిజిస్ట్రేషన్ చేయించారు. జిల్లా పోలీసులు, సెబ్ అధికారులు దాడి చేసి, 36 కేసులు నమోదు చేసి, 33 మంది నిందితులను అదుపులోనికి తీసుకుని, 75 లీటర్ల అక్రమ మద్యం, 90 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, 1000 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసిన పోలీసులు. ఎస్పీ ఆదేశాలతో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, పోలింగు కేంద్రాలను సందర్శించి, గ్రామస్తులతో సమావేశమయ్యి ఎన్నికలకు సంబంధించి గ్రామస్తులకు అవగాహన కల్పించడం, ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# గడప గడపకు ఉత్సాహంగా సాగిన భరత్ కుమార్ ఎన్నికల ప్రచారం

## సంక్షేమం కావాలంటే జగనన్న ప్రభుత్వమే రావాలి

## అనకాపల్లి మండలం తుమ్మపాలలో భరత్ కు మహిళలు హరతులు పట్టారు



అనకాపల్లి (**గౌతమ్ న్యూస్** ): ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ మంగళవారం అనకాపల్లి మండలం తుమ్మపాలలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వెస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ నేతృత్వంలో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు ముందుగా గంగాలమ్మ పుట్టని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు గ్రామంలో ప్రజల నుంచి ఆదరణ లభిస్తుంది పెద్ద ఎత్తున మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు దారి పొడవునా మహిళలు భరత్ కు హారతులు పట్టారు ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాన్ని అందజేసి ప్రజలతో మమేకమై వారి యోగక్షేమాలను తెలుసుకొని ఎన్నికల్లో తనకు ఓటు వేయమని అభ్యర్థించారు గ్రామంలో మహిళల సైతం భరత్ కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జై కొడుతా ముందుకు సాగారు స్థానికుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది జగన్మోహన్ రెడ్డి అందించిన పథకాలకి ధన్యవాదాలు తెలియజేస్తూ ఎన్నికల్లో తామంతా వైస్సార్సీపీ కి ఓటు వేస్తామంటూ భరోసా ఇచ్చారు వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగిస్తూ విద్యావంతుడైన తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపిస్తే నిత్యం ప్రజలతో అందుబాటులో ఉంటానని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం వైసీపీ తోనే సాధ్యం అన్నారు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు మే 13 న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ రెండు ఓట్లును ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు... ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు,అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందా, వైస్ ఎంపీపీ వీల్లూరి సూర్య కుమారి శేఖర్, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, పి, గాంధీ, సి హెచ్ చిన్న, పీలా బుజ్జి, సూరిశెట్టి శ్రీను,కొణతాల శివాజీ , ఎంపీటీసీలుఅశోక్, పన్నీరు చంటి, పంచదారల కన్నారావు,పడాల గణపతి, బుదిరెడ్డి దేవుడు,కోలపర్తి శ్రీను, ఆడారి ప్రసాద్, ఆడారి లక్ష్మణరావు మరియు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు పాల్గొన్నారు...

# నందిగామ బార్ అసోసియేషన్ హాలులో

## ఘనంగా కార్యవర్గాన్ని సన్మానించిన శ్రీ తుర్లపాటి కోటేశ్వరరావు

నందిగామ (**గౌతమ్ న్యూస్** ): 2024 - 2025 నందిగామ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ది 16 - 4 - 2024 వ తేదీన నందిగామ బార్ అసోసియేషన్ హాలులో ఘనంగా కార్యవర్గాన్ని సన్మానించిన శ్రీ తుర్లపాటి కోటేశ్వరరావు ( టికేర్ ) రిటైర్డ్ హెచ్ ఓ డి ఇంగ్లీష్ మరియు ప్రిన్సిపల్ కెవిఆర్ కళాశాల. సన్మాన గ్రహీతలు శ్రీ నంద్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షులు, శ్రీ అద్దంకి మణి బాబు సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీ ఎక్కి రాల హనుమంతరావు , శ్రీ చాట్రాగడ్డ రవికుమార్ ట్రెజరర్, లైబ్రేరియన్ ఆనందం విజయభాస్కర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ నెంబర్ గూగులోత్ రామారావు లేడీ రిప్రజెంటేటివ్ శ్రీమతి కూర గంటి ప్రవీణ

# వై ఎస్ జగన్మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసిన వీరులపాడు మండల జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య





నందిగామ (**గౌతమ్ న్యూస్** ): నిన్న కేసరపల్లి మేమంతా సిద్ధం యాత్ర మొదలవుతున్న సందర్భంగా భస ప్రాంగణానికి చేరుకొని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసిన వీరులపాడు మండల జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య ముఖ్యమంత్రి సైతం స్పందించి కీర్తి సౌజన్య ఆశీర్వదించడం జరిగింది.

# దేవరాపల్లిలో టిడిపి పార్టీకి గట్టి షాక్

## డిప్యూటీ సిఎం ముత్యాలనాయుడు సమక్షంలో టిడిపి పార్టీ నుండి వైసీపీలో చేరిన 25 కుటుంబాలు



అనకాపల్లి(**గౌతమ్ న్యూస్** ): టిడిపి పార్టీకి మండలంలోని దేవరాపల్లి గ్రామానికి చెందిన 25 కుటుంబాలు, టిడిపి పార్టీ తమ్ముళ్లు ఆ పార్టీకి షాక్ ఇచ్చారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సారథ్యంలో మండల కేంద్రంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని, సంక్షేమ, అభివృద్ధి, అరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాత సిఎం జగన్ నాయకత్వంలో దేవరాపల్లిని సమిష్టిగా అభివృధి చేసుకుంటామని నూతనంగా చేరిన వారు వాపోయారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు గండి పడాల అప్పలరాజు మండల కన్వీనర్ కె.వి.రమణ లలిత నాయుడు వరదపురెడ్డి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో వారితో కలసి భవిష్యత్ కు బాటలు వేస్తున్న వైసిపి పార్టీ అడుగుజాడలలో నడుస్తమాని ఇరిబల్లి అప్పలనాయుడు, కొల్లి రమణ, గాలి రాంబాబు, గాలి దేముళ్ళు,గాలి బంగారమ్మ, చిటికె రెడ్డి చెల్లాం నాయుడు, చిటికె రెడ్డి పోతురాజు, మంత్రి సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా వేసి సదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బూరె బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికిన

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్** ): భద్రాద్రి : భద్రాచలంలోని ఐటీసీ విశ్రాంతి భవనానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి పుష్ప గుచ్చాన్ని అందించి స్వాగతం పలికిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్, సమాచార, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర చికిత్స కొరకు అంబులెన్సులు అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా బెడ్లు కేటాయించినట్లు చెప్పారు. అన్ని అత్యవసర చికిత్స కేంద్రాల్లో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని భక్తులు ఏదేని అస్వస్థకు గురైతే తక్షణమే సమీపంలోని అత్యవసర చికిత్స కేంద్రానికి తరలించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఉప వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, భద్రాచలం ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# కొల్చారం మండల వ్యాప్తంగా....

## కెసిఆర్ సభకు భారీగా తరలిన బిఆర్ ఎస్ పార్టీ నాయకులు...





మెదక్ ప్రతినిధి,(**గౌతమ్ న్యూస్** ): కొల్చారం మండలం నుండి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు కొల్చారం మండలం నుండి బి ఆర్ఎస్ పార్టీ నాయకులు భారీగా తరలి వెళ్లారు. కొల్చారం మండలం టిఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు కోనాపురం తుంకలపల్లి సంతోష్ రావు ఆధ్వర్యంలో కోనాపూర్ బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బహిరంగ సభకు తరలి వెళ్లారు. కొల్చారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి చిన్నగనాపూర్, రంగంపేట్ , పోతంశెట్టిపల్లి, సంగాయిపేట్, పైతర, వై మాదాపూర్ , కొల్చారం, మండల వ్యాప్తంగా బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ సభ కార్యక్రమంలో కొల్చారం మండల యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు, మాజీ సర్పంచ్ కన్నారం రమేష్ , మాజీ ఉప సర్పంచ్ మహంకాళి నర్సింలు, తుంకలపల్లి వినోద్ కుమార్, మేతరి గంగ రాములు , మోత్కు ప్రసాద్ , జంగం భద్రప్ప, మహంకాళి శేఖర్, మహంకాళి లక్ష్మయ్య, ఎర్ర నాగేష్, మోత్కు ప్రసాద్, బండి అశోక్, తుంకలపల్లి రాజు, దొడ్ల నాగేష్, మోత్కు శంకర్, సాకలి భాగయ్య, కొడకంటి మురళి గౌడ్, సాకలి బిక్షపతి, సుమారు కోనపురం గ్రామం నుండి 300 మంది టిఆర్ఎస్ కార్యకర్తలు బహిరంగ సభ పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పరివంతం గ్రామం నుండి జెడ్పిటిసి మేఘమా సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ కార్యకర్తలు కార్యకర్తలు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్ గౌడ్, టిఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.



## వివిధ పార్టీల నుంచి కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరిక

కొత్తగూడెం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసుకుందాం.

కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం : వివిధ పార్టీల నుంచి సుజాతనగర్ మండలం, కోమటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం, శేషగిరిభవన్ నందు జగిరిన సుజాతనగర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా వీరికి కూనంనేని పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు, ప్రాధమిక సభ్యత్వాన్ని అందజేసిన అనంతరం ఆయనమాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిసిన అనతికాలంలో నియోజకవర్గంలో వివిధ పథకాల క్రింద మంజూరైన నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తిచేశామని, ఇంకా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. భవిషతులు మరిన్ని అభిరుద్ధి పనులు చేపడతామని, ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చిన తన దృష్టికి తేవాలన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు అనుబంధ ప్రజా సంఘాల్లో భాద్యత తీసుకొని సమస్యల పరిస్కారంకోసం కృషి చేయాలనీ సూచించారు. కార్యక్రమంలో సుజాతనగర్ మండల కార్యదర్శి భూక్యా దస్రు, నాయకులు వాసిరెడ్డి మురళి, కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, భూక్యా శ్రీను, కోర్ర శ్రీనివాస్, కేశవరావు, దండు సురేష్, మంగ్యా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



టేకులపల్లి (**గౌతమ్ న్యూస్ ):** ఉపాధిహామీ కూలీల సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం టేకులపల్లి మండలం బోడు పంచాయితీ పరిధిలోని వివిధ గ్రామాల ఉపాధిహామీ కూలీలను భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐ ఎఫ్ టి యు) జిల్లా నాయకులు డి.ప్రసాద్, అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లానాయకులు ఎట్టి నరసింహారావు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో జీవనం కొరకు ఉపాధి పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, అనేక రకాల సమస్యలతో కూలీలను ఇబ్బంది పె డుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు750 రూపాయల కూలి ఇవ్వాలని,పని ప్రదేశంలో మంచినీరు, టెంటు,వైద్య సదుపాయం కల్పించాలని,పలుగు పార,తట్టలు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజులకు తగ్గకుండా పని కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని, ప్రభుత్వ ఈ కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పునెం లక్ష్మయ్య, ఈసాల లాలాయ్య, పూనెం రామచంద్రు, ఎట్టి సురేష్, బాలరాజు, సీతమ్మ, యశోద, సారమ్మ, బాలమ్మ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## అంతా సన్నద్ధమే మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం



అనకాపల్లి (**గౌతమ్ న్యూస్ ):** సిఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రకు నాయకులు కార్యకర్తల సారథ్యం లో బ్రహ్మరథం పట్టి , అంతా సన్నదమై విజయవంతం చేయాలని తారువ లో మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు అధ్వర్యంలో స్థానిక నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ నెల 20 న జిల్లాలో ప్రవేశించనున్న బస్సు యాత్ర అనంతరం చోడవరం లో మధ్యాహ్న 3 గంటలకు మేము సిద్ధం బహిరంగ సభను జయప్రదం చేసేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ మండల ముఖ్య నాయకలు, అన్నీ గ్రామల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాన్ని ఆదుకోండి

ఈ చిన్న పాప కాలుకు ఆపరేషన్ ఖర్చుకు సహాయం చేయండి..

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్..



చిట్యాల(**గౌతమ్ న్యూస్ ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేంద్రంలో బ్రతుకుతెరువు కోసం వలస వచ్చి ఎల్బీనగర్లో కిరాయికి ఉంటూ వృత్తి రీత్యా పెయింటర్ గా పనిచేస్తూ జీవితం హ్యాపీగా సాగిపోతున్నతరుణంలో అనుకోని సంఘటనతో కాజీపేట నరేష్ సుమలత దంపతుల కూతురైన పాప అక్షయ దీపావళి రోజున టపా కాయలు కాలుస్తుండగా పాపకు రెండు కాళ్లు కాలిపోయి తీవ్రంగా గాయపడగా ఒక కాలు ఆపరేషన్ చేయించి మరో కాలు ఆపరేషన్ చేయించడం కొరకు ఆర్థిక స్తోమత లేక పాప మంచానికే పరిమితం అయిపోయిందని తెలుసుకొని ఆ కుటుంబాన్ని సందర్శించి పాప ఆరోగ్యాన్ని తెలుసుకున్నారు ఈ సందర్భంగా మారపల్లి మల్లేష్ మాట్లాడుతూ దీపావళి రోజున టప కాయలు కాలుస్తుండగా పాపకు రెండు కాళు కాలిపోయినాయని ఒక కాలు ఆపరేషన్ చేయించినారని మరో కారు ఆపరేషన్ చేయించడం కొరకు ఆర్థిక స్తోమత లేక పాప మంచానికే పరిమితం అయిపోయినదని ఆమె నడవలేక పోతున్నది ఆడుతూ పాడుతూ తిరగాల్సిన పాప మంచానికి పరిమితం కావడం వలన తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆర్థిక స్థోమత లేక మా పాపను మంచిగా చేసుకోలేని పరిస్థితి లేదని బాధపడుతూ సొంత ఊరు జూబ్లీ నగర్ రేగొండ మండలం నుండి వలస వచ్చి భూపాలపల్లిలో నివాసం ఉన్నామని వృత్తి రీత్యా పెయింటర్ పని చేసుకుంటున్నారని ఇది నా కుటుంబం పోషణ కోసం మాత్రమే సరిపోతుందని పాపకు మెరుగైన వైద్యం అందించాలంటే మూడు లక్షల దాకా ఖర్చవుతుందని అన్నారు దయామయులైన స్వచ్ఛంద సంస్థలు మానవతావాదులు మేధావులు ఉద్యోగులు స్పందించి పాప కాలు ఆపరేషన్ కోసం సహాయం చేసి ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పక్షాన మీ అందరికీ విజ్ఞప్తి చేస్తా ఉన్నానని తెలిపారు నరేష్ ఫోన్ పే నెంబర్ 99 633 68 628 తో సిన విధంగా సహాయం చేసి ఆ యొక్క కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుకుంటున్నాను అని విజ్ఞప్తి చేశారు.

## మాజీ ఉప సర్పంచ్ గజ్జి రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి

టిఆర్ఎస్ పార్టీ నుండి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి





మల్లపూర్(**గౌతమ్ న్యూస్ ):** ఈరోజు హైదరాబాద్ గాంధీ భవన్ లో బిజెపి కోరుట్ల కాంసెన్సీ ఇంచార్జ్ జేన్ వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి జాయిన్ అయినా పాత దామరాజు పల్లి టిఆర్ఎస్ పార్టీ మాజీ ఉప సర్పంచ్ గజ్జి రాజారెడ్డి పటేల్.. మున్నూరు కాపు సంఘ పెద్దమనిషి కంటే హన్మాండ్లు సమల్ల రాజు నేత వీరు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ గౌడ్ గారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు తద అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొమిరెడ్డి కరంచంద్ కొమిరెడ్డి విజయ్ ఆజాద్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు

## వడదెబ్బతో ఉపాధి కూలి వెంకటమ్మ మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే కూనంనేని.

ఉపాధి పనులవద్ద వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి : కూనంనేని.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్సి (**గౌతమ్ న్యూస్ ):** చుంచుపల్లి : వడదెబ్బకు గురై చుంచుపల్లి మండలం, పెనుబల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి, గిరిజన మహిళా బూరుగు వెంకటమ్మ (55) మంగళవారం మృతవాత పడింది. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పెనుబల్లి గ్రామంలోని వెంకటమ్మ గృహాన్ని సందర్శించి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వేసవి యెండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోందని, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. అధికారులు పనులు జరిగే ప్రాంతాల్లో వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని, వారికి కావాల్సిన రెస్టు షెల్టర్లు, టెంట్లు, త్రాగునీరు, ఓఆర్ఎస్, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు, జరిగిన సంఘటనను ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మృతురాలి కుటుంబ కుటుంబానికి ప్రభుత్వం రూ. 20లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, ఉపాధి అధికారులు పనులు జరిగే క్షేత్రాలను సందర్శించి పనులను, రక్షణచర్యలను పర్యవేక్షించాలని కోరారు. జిల్లా కలెక్టరుతో తోపాటు సంబంధిత జిల్లా అధికారులు ఉపాధి పనులపై దృష్టి సారించి కూలీలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలకు ఆదేశించాలని కోరారు. నివాళులర్పించినవారిలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి రెడ్డి శ్రీను, నర్సింహారావు, భూలక్ష్మి, భద్రమ్మ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్.






భద్రాద్రి(**గౌతమ్ న్యూస్ ):** బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాలలో బాధ్యతగా విధులు నిర్వహించాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ శ్రీరామనవమి సందర్భంగా మన జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి బందోబస్తు విధులకు హాజరయ్యే సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమకు కేటాయించిన విధులను గురించి వారికి స్పష్టంగా వివరించడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులకు జిల్లా ఎస్పీ కొన్ని సూచనలు చేశారు. రామనవమికి హాజరైన పోలీసు అధికారులు,సిబ్బంది తమ కేటాయించిన ప్రదేశాలలో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తెలియజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ సమయస్ఫూర్తితో నడుచుకోవాలని తెలియజేశారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్ భద్రాచలం ఏఎస్పి పరతోష్ పంకజ్ ఐపిఎస్,ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయబాబు, ట్రైనీ ఐపిఎస్ విక్రాంత్ సింగ్ మరియు పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్లమీద రైతులు మొక్కజొన్నలు ఎండబెట్టడం వలన పలుచోట్ల యాక్సిడెంట్లు అవుతున్నాయి



నర్సంపేట(**గౌతమ్ న్యూస్ ):** నేక్కొండ మండల పరిధిలో ఉన్నటువంటి ఆర్.బి.ఐ రోడ్ల పైన మొక్కజొన్న ఎండబెట్టడం వలన పలుచోట్ల యాక్సిడెంట్లు అవ్వడం జరుగుతున్నాయి సాయి రెడ్డి పల్లి గ్రామం నుండి రెడ్లవాడ వెళ్లే దారిలో ఆర్-బి రోడ్డు పైన రైతులు పోసిన మొక్కజొన్న ధాన్యాన్ని తీసివేయుట గురించి స్థానిక నెక్కొండ మండల ఎంఆర్ఓ గారికి "తెలంగాణ గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు " మాలోతు. వెంకన్న నాయక్ రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. మాలోత్ .వెంకన్న నాయక్ మాట్లాడుతూ గత సంవత్సరం ఎబి తండా గ్రామ పంచాయతీకి చెందినటువంటి మాలోత్ .రమేష్. తండ్రి: మంచా అనే వ్యక్తి నెక్కొండ నుండి పర్వతగిరి వెళ్లే దారిలో రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని రోడ్డు పైన



ఆరాపోయడం వలన మాలోత్ . రమేష్ బైక్ పైన వెళ్తుండగా ధాన్యం పోసిన స్థలం వద్ద రాయిని గుద్దుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ బాధాకరమైన ఘటన ఏ కుటుంబాలలో కూడా జరగకూడదని స్థానిక ఎమ్మార్వో సార్ ని కలిసి మాలోత్. వెంకన్న నాయక్ వివరించడం జరిగింది. ట్రైబల్ ఆర్గనైజేషన్ మండల నాయకులు భూక్యా . సురేష్ నాయక్ మరియు లంబడి ఐక్యవేదిక వరంగల్ జిల్లా అధ్యక్షులు మాలోత్ . దేవేందర్ నాయక్ మరియు మాలోతు.నితీష్ నాయక్ మరియు శివనాయక్ మరియు శ్రీనివాస్ నాయక్ రోడ్లమీద మొక్కజొన్నలు ఎండబెట్టే వారిపై తగు చర్యలు తీసుకోవాలని పై అధికారులకు తెలియపరుస్తున్నాము

# నేడు మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్ (గౌతమ్ న్యూస్ ) : రాష్టంలో ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరగకూడదనే ఉద్దేశంతో మద్యం దుకాణాలు మూసివేయిస్తుంటారు. ఈ క్రమంలోనే తాజగా శ్రీరామనవమిని పురస్క రించుకొని హైదరాబాద్ జంట నగరాల్లో ఒకరోజు మద్యం దుకాణాలు బంద్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రేపు 17వ తేదీ బుధవారం మద్యం దుకాణాలు బంద్ కావాల్సిందే అంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు హైదరా బాద్ సీపీ ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎవరైనా మద్యం దుకాణాలు తెరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూ డదనే ఉద్దేశంతో.. ఏప్రిల్ 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఏప్రిల్ 18వ తేదీ ఉదయం 6 గంటల వరకు హైదరాబాద్ జంట నగరాల్లో ఉన్న వైన్స్, కల్లు కాంపౌండ్లు, బార్లు, బార్ అండ్ రెస్టారెంట్లు అన్నీ మూతపడనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కి గౌడ్ తల్లి అనసూయమ్మ కన్నుమూత పలువురు నేతలు నివాళీలు



హైదరాబాద్ (గౌతమ్ న్యూస్ ) : కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ తల్లి అనసూయమ్మ సోమవారం సాయంత్రం కన్నుమూశారు. వయసు మీదపడడంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆమె అనారోగ్య పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయిందని వైద్యులు తెలిపారు. అనసూయమ్మ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజ నర్సింహ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి సీతక్క, మాజీ ఎంపి కెవిపి రామచంద్రారావుతో పలువురు నాయకులు సంతాపం తెలిపారు. కాంగ్రెస్ ఎంఎల్ఏ కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి ఎంపి అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ ఇంటికి వెళ్లి ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లాపై ఐజీ రంగనాథ్ స్పెషల్ ఫోకస్



భూపాలపల్లి (గౌతమ్ న్యూస్ ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖలో జరుగుతున్న సంఘటనలపై మల్టీ జోన్ 1 ఐజి రంగనాథ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. పోలీసుల పనితీరు పై వస్తున్న ఆరోపణలు తన దృష్టికి వెళ్లిన వెంటనే తక్షణమే స్పందిస్తూ బాధ్యులపై శాఖ పరమైన చర్యలకు అదేశిస్తున్నారు. ఇటీవల మొగుళ్లపల్లిలో ఓ రౌడి షీటర్ జన్మదిన వేడు కలు ఠాణాలో జరుపగా వెంటనే స్పందించి సంబం ధిత ఎస్సై పై శాఖాపరమైన చర్యలు చేపట్టి ఆసిఫాబాద్ జిల్లాకి బదిలి చేశారు. తాజాగా సోమవారం మహా దేవపూర్ లో జరిగిన ఘట నపై స్పందించి సంబంధిత ఎస్సై ప్రసాద్ ను విఆర్ కు బదిలీ చేయగా , హెడ్ కానిస్టేబుల్ సోయం శ్రీనివాస్ ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా స్టేషన్ పరిధిలో వున్న మరో 7గురి ఒక హెడ్ కానిస్టేబుల్ పాటు మరో ఆరుగురి సిబ్బంది పై బదిలి వేటు వేశారు. దీంతో జిల్లా లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిలో అలజడి మొదలైంది. ఐజి తీసుకుంటున్న శాఖ పరమైన చర్యలతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హెలికాప్టర్లలో పోలింగ్ సిబ్బంది తరలింపు



చత్తీస్ గడ్ (గౌతమ్ న్యూస్ ) : తొలి దశ లోక్‌సభ ఎన్ని కలకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సిద్ధమైంది.ఆ రాష్ట్రంలో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు బీజాపూర్, నారాయణ్ పూర్ నుంచి హెలికాప్టర్లలో సిబ్బందిని తరలిస్తున్నారు. చత్తీస్‌ఘడ్‌లో మొత్తం 11 లోక్‌సభ స్థానాలున్నాయి. అయితే ఏప్రిల్ 19న కేవలం బస్తర్ నియోజకవర్గంలో మాత్రమే పోలింగ్ జరగనున్నది.

## జీలం నదిలో పడవ బోల్తా నలుగురు మృతి



జమ్మూ కాశ్మీర్(**గౌతమ్ న్యూస్ ):** జమ్ము కాశ్మీర్‌లోని జీలం నదిలో విద్యార్థులు కూలీలు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందినట్లు అధి కారులు గుర్తించారు. గుండ్‌బాల్ బట్వారా ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇక గల్లంతైన వారి మృతదేహాల కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నదిలో గాలింపు చర్యలు చేపట్టాయి. మరో వైపు కశ్మీర్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జీలం నది ?ఉధృతంగా ప్రవహిస్తుం డడంతో సాధారణ జనజీవనం స్తంభించి పోయింది. అయితే గుండ్‌బాల్‌ను శ్రీనగర్‌ను కలిపే బ్రిడ్జి గత దశాబ్ద కాలంగా నిర్మాణంలో ఉందని, దీంతో స్థానిక ప్రజలు నదిని దాటాలంటే పడవలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు వాపోతున్నారు.

## బాసర కాలేజీలో మరో విద్యార్థి ఆత్మహత్య



నిర్మల్ జిల్లా(**గౌతమ్ న్యూస్ ):** నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీల మంగళవారం ఉదయం మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. పీయూసీ సెకండ్ ఇయర్ చదువుతున్న అర్వింద్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసు కున్నాడు. హాస్టల్‌లో అర్వింద్ ఉరేసుకుని సూసైడ్ చేసుకున్నాడు. మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. మృతుడి స్వస్థలం సిద్ధిపేట జిల్లా బండారుపల్లిగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహిళ ఎస్ ఐ



ఆసిఫాబాద్ (**గౌతమ్ న్యూస్ ):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓమహిళా ఎస్ఐ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఆసిఫాబాద్ ఎస్ఐ రాజ్య లక్ష్మి ఓ కేసు విషయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమ వారం సాయంత్రం అదుపు లోకి తీసుకున్నారు. ఓ ప్రమాదం కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి, వాహనం రిలీజ్ చేసేందుకు ఆమె రూ. 25 వేలు లంచం డిమాండ్ చేశారు. డిమాండ్ చేసిన 25 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో వలపన్ని పట్టుకున్న అధికారులు ఆమెను విచారిస్తున్నారు.

గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక



# ఆందోల్ ప్రజా ఆశీర్వాద సభలో..తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్

మళ్లా వొచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వ మే

లీల్లీపుట్ గాళ్లు రాష్ట్రాన్ని ఆగం చేశారు

అంబేద్కర్ గారిని అవమాన పరిస్తే ఉరుకుందామా.?

కాంగ్రెస్ కు 2 సీట్లు కూడా రావు

ఎవరికి ఎవరు బీ టీమో ఆలోచించాలి..

మోదీ తో రేవంత్ దోస్తీ

ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియదు

తెలంగాణ కు బిజెపోల్లు ఎం చేశారు

నాకు రాజకీయ జీవితం ఇచ్చిన మీ రుణం తీర్చుకోలేనిది

వెంకట్రామరెడ్డి, గాలి అనిల్ కుమార్ లను ఆశీర్వదించాలి






నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్ ):** ప్రాణాలు అడ్డు పెట్టి, సాధించుకొన్న తెలంగాణ ను 10 ఏళ్ళలో బంగారు తునక చేస్తే.. ఎన్నో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వొచ్చిన.. లిల్లీ పుట్ గాళ్లు తెలంగాణ ను ఆగం చేశారని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు..ఆందోల్ నియోజకవర్గంలోని చౌటకూర్ మండలంలోని సుల్తాన్ పూర్ చౌరస్తాలో జరిగిన మెదక్ – జహీరాబాద్ ల పార్లమెంటు నియోజకవర్గ స్థాయి ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన మాట్లాడారు..కొందరు బీఆర్ఎస్ కు ఓట్లు ఎందుకు, సీట్లు ఎందుకు అంటున్నారు.. ..ఇప్పుడే కావాలి బీఆర్ఎస్ కు ఓట్లు, సీట్లు..ఆనాడు కరీంనగర్ లో మీరు ఆశీర్వదిస్తేనే కదా, తెలంగాణ కోసం ఢిల్లీ లో కొట్లాడి సాధించుకున్నామని గుర్తు చేశారు..కొన్ని సార్లు ఎంత మంచి చేసినా, ఫలితాలు వేరుగా వొస్తాయి.. గీ లిల్లీ పుట్ గాళ్లకు కూడా అధికారం అలానే వొచ్చింది...సరే 5 ఏళ్ళు .మంచి పనులు చేయాలని కోరుకున్నాం..కానీ రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే మధ్యలోనే ప్రభుత్వం పోయేలా ఉందన్నారు..బద్ధ శత్రువు మోదీ తో రేవంత్ దోస్తీ చేస్తున్నారని, ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందో తెలియదన్నారు.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు రెండు సీట్లు కూడా రావని, సర్వేలో ర్ రావడంతో రేవంత్ ఆగమాగం అవుతున్నారన్నారు..అంబెద్కర్ స్పూర్తితో .ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ తెచ్చుకున్నామని, జ్ఞాపకంగా.125 ఫీట్ల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకున్నామన్నారు..గత ఏదాది అంబెద్కర్ జయంతి వేడుకలు బ్రహ్మాండంగా చేసుకున్నామని, ఈ ఏడాది అంబెద్కర్ విగ్రహానికి కనీసం పూల దండ కూడా వేయలేదన్నారు. అందుకే అంటున్నా....లిల్లీ ఫుట్ గాళ్ళు అని, రాజ్యాంగ నిర్మాతకు అంత అవమానం చేస్తారా, అహంకారమా అని ప్రశ్నించారు .మేము విగ్రహాలు ఏర్పాటు చేశామని పగ పట్టారా, మరి ..సెక్రటేరియట్ కు అంబేద్కర్ పేరు పెట్టాం, కదా అందులోకి ఎందుకు వెళ్తున్నారు..యాదాద్రి కొత్తగా కట్టుకున్నాం, కదా ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు.. విగ్రహాల మీద రాజకేయాలు చేయడం సిగ్గు చేటన్నారు.....అంబేద్కర్ ను అవమానిస్తే, దళిత బంధు నిలిపివేస్తే ఉరుకుందామా, నిలదీయాలన్నారు..ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వారు ఆలోచించాలి..మిమ్మల్ని అదుకోలేదా, ఇంక్రిమెంట్ ఇవ్వలేదా, పీఆర్సీ ఇవ్వలేదా ఒక్కసారి ఆలోచించాలన్నారు..

### కాంగ్రెస్ హయాంలో

సింగూరు నీళ్లు హైదరాబాద్ కు తాగునీటి కోసం ఇచ్చారని, .పంటలు .ఎండిపోతే బాధ పడ్డా పట్టించుకోలేదు కదా, మనం అధికారంలోకి రాగానే హరీశ్ రావు ఆధ్వర్యంలో చకచకా కాలువలు తవ్వి కాళేశ్వరం నుండి నీళ్ళు తెచ్చుకుని సింగూరు నీళ్లు మనమే వినియోగించుకున్నాం కదా అని గుర్తు చేశారు..సంగమేశ్వర, బసవేశ్వర రెండు లిఫ్టులు పెట్టుకొని రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించుకోవాలని మనం ప్రారంభించుకుంటే ఎందుకు కోల్డ్ స్టోరేజ్ లో పెట్టారని ప్రశ్నించారు, 9 ఏళ్లలో కరెంటు పోయిందా, నేడు ఎందుకు పోతుంది.

### కాంగ్రెస్ దోఖా చేసింది

...డిసెంబర్9 న 2 లక్షల ఋణమాఫీ,మహాలక్ష్మి ద్వారా 2500 పింఛన్, రైతు భరోసా ఇలా ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు నేడు మోసం చేశారన్నారు.. 15 ఏళ్ళు కోట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. 10 ఏళ్లలో ఎంతో అభివృద్ధి చేసుకున్నాం, .రైతులను కండ్లలో పెట్టి కాపాడు కున్నాం. నేడు రైతులు గోస పడుతున్నారన్నారు...రైతుబంధు లేదు, 500 బోనస్ లేదు, కరెంటు లేదు, మోటార్లు కాలిపోతున్నాయి, ట్రాన్ఫార్మర్స్ పేలిపోతున్నాయన్నారు... సిద్దిపేట లో హరీశ్ మొదలు పెట్టిన 2పోస్ట్ కార్డు ఉద్యమం రాష్ట్రం మొత్తం రైతులు .ఋణమాపీ, పంట నష్టం, 500 బోనస్, రైతు భరోసా మీద పోస్ట్ కార్డు ఉద్యమం



చేయాలన్నారు.. ఒక మంత్రి రైతుబంధు ఇవ్వాలి అంటే చెప్పుతో కొడుతా అంటారు, పేగులు మెడలో వేసుకుంటా అంటారు. ఇక .పోలీసులు బీఆర్ఎస్



బొమ్మలు పీకేస్తున్నారు..జాగ్రత్త..మీ పని మీరు చేసుకోర్రీ, మా ప్రభుత్వం గ్యారంటీగా అధికారంలోకి వొస్తాము..అప్పుడు మీ గతి ఏందో అర్థం చేసుకోండి, సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని పెద్దపల్లి జిల్లాకు చెందిన సల్వాజి మాధవ రావు ను జైల్లో పెట్టారు..డీజీపీ ప్రత్యేక దర్యాప్తు చేసి విచారించాలి..లేదంటే కోర్టు తలుపు తడుతామని హెచ్చరించారు....నేను ఎమ్మెల్యే గా, మంత్రిగా, ముఖ్యమంత్రి గా పనిచేశా..ఇంత దుర్మార్గం ఎన్నడూ చూడలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో .. వరి కోతలు ఉంటే, నేడు కరెంటు కోతలు, పంటలు ఎండిపోతున్నాయని..రైతులు గోస పడుతున్నారన్నారు...ఎన్నికల కమీషన్ అడ్డ పడదు మేము అడ్డుకొమని, బాండ్లు ఇచ్చి వడ్లకు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. .కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలి అంటే ఎంపీ ఎన్నికల్లో ఘన విజయం అంధించాలన్నారు .. 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఒక్క మంచి పని చేయలేదన్నారు..ఒక్క మెడికల్ , నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయలేదని, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని అలాంటి పార్టీకి ఓట్లు వేయద్దన్నారు.. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామరెడ్డి గతంలో కలెక్టర్ గా పనిచేశాడని, అభివృద్ధి లో కీలక పాత్ర పోషించాడన్నారు..ఆయనకు డబ్బులు అక్కర్లేదని, ప్రజా సేవకోసమే వస్తున్నారని అశీర్వదించాలని కోరారు .తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన గాలి అనిల్ కుమార్ కు జహీరాబాద్ ప్రజలు జై కొట్టాలని పిలుపునిచ్చారు..నేను రాజకీయంగా ఎంతో ఎత్తు ఎదగడానికి, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణా తెచ్చుకోవడానికి జీవితం ఇచ్చిన..మెతుకు సీమ గడ్డ కు ..ఎన్ని జన్మలు ఎత్తినా రుణం తీర్చుకోలేమన్నారు..హరీష్ నాయకత్వం లో అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు బీఆర్ఎస్ కు జై కొట్టారని, నేడు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీస్సులు అందించాలని కోరారు

### బోనస్ ఇస్తావా..బొంద పెట్టమంటావా

### ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలి

### మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీశ్ రావు

వడ్ల కు 500 బోనస్ ఇవ్వని కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో బొంద పెట్టాలని మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పిలుపునిచ్చారు....కేవలం 4 మాసాల్లో కాంగ్రెస్ పాలన అంటే ప్రజల్లో విసుగొచ్చిందన్నారు.. వద్దురో నాయనా కాంగ్రెస్ పాలన..అంటూ ప్రజలు మాట్లాడుకుంటున్నారన్నారు...కాంగ్రెస్ రాగానే...మంచినీళ్లు వొస్తా లేవు, ఆసరా పింఛన్ నెల కట్ చేశారు..రుణ మాపీ లేదు, రైతు భరోసా ఇస్తా లేరని, మహాలక్ష్మి ద్వారా 2500 పింఛన్ లేదని, నిరుద్యోగ భృతి లేదని, కళ్యాణ లక్ష్మీ పథకంలో తులం బంగారం లేదని, విద్యార్థినులకు స్కూటీ లు ఇస్తా మని డోఖా చేశారన్నారు..పైన పేర్కొన్న పథకాలు వొచ్చిన వారు కాంగ్రెస్ కు ఓటు వేయాలన్నారు.. రాని వారు బీఆర్ ఎస్ కు వేయాలన్నారు..మహా లక్ష్మీ పథకంలో 1.40 కోట్ల మందికి మోసం చేశారన్నారు..రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ లతో ప్రారంభించిన 6 గ్యారంటీలకు 120 రోజులైనా అమలు చేయలేదన్నారు.. మోసం చేసిన కాంగ్రెస్ నాయకులకు సురుకు పెట్టాలని, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు..ప్రజాపాలన అని ఒక్కరోజు ప్రజలకు అందుబాటులో ఉండి, తర్వాత పాలన మరిచిపోయి బీఆర్ఎస్ పార్టీల వెంట పడుతున్నారన్నారు..ఎన్ని కుట్రలు చేసినా..బీఆర్ఎస్ గెలుపు అపలేరన్నారు..10 ఏళ్లలో బీజేపీ ఒక్క మంచి పని చేశారా, అని అడుగడుగునా నిలదీయాలన్నారు.. పథకాలు లేవు కనుకనే చిత్ర పటాలు పంచుతున్నారన్నారు..తెలంగాణ కు ఒక్క మెడికల్, నర్సింగ్ కళాశాల ఇవ్వలేరని, పెట్రోల్, డీజిల్ , గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచారన్నారు...

### 4 మాసాల్లో కాంగ్రెస్ వైఫల్యం..

### మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కేవలం నాలుగు మాసాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల్లో చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధమైనారని మాజీమంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.. రైతు భరోసా ఇవ్వడానికి పంట సాగు చేసిన తర్వాత ఇస్తామని ఒక మంత్రి చెబుతున్నాడని ఇది నమ్మేదెలా అని ప్రశ్నించారు. ఇచ్చిన మాటను నిలుపు కున్న ఘనత ఒక్క కేసీఆర్ కే దక్కుతుందన్నారు..తమ ప్రభుత్వ హయాంలో

### 75 లక్షల మందికి రైతుబంధు ఇవ్వడం జరిగిందన్నారు..

### ఆకట్టుకున్న దేశపతి ప్రసంగం

### కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సభలో పాడిన పాటలు ఆకట్టుకున్నాయి..

గోవిందా హరి గోవిందా, కాంగ్రెస్ వొస్తే గోవిందా..రైతు బంధు గోవిందా, రైతు బీమా గోవిందా, , కళ్యాణ లక్ష్మి గోవిందా, కరెంటు గోవిందా, కాంగ్రెస్ అంటే గోవిందా, నిండా మునుగూడే గోవిందా, అని పాట పాడి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు..బడేమియా చోటే మియా బంధమేందిరో, మోదీ, రేవంత్ మధ్యలో ఉన్న మతలబు ఏందిరో..అని వివరించారు.గుజరాత్ మోడల్ అంటూ రేవంత్ మాట్లాడటం లో ఉన్న మతలబు ఏందో చెప్పాలన్నారు

## కాంగ్రెస్ పార్టీలో చేరిన కడవెండి గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు..



దేవరుప్పుల (గౌతమ్ న్యూస్ ) : దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టికి చెందిన నాయకులు పాలకుర్తి మండలకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి యశస్వినిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ పోతిరెడ్డి లీనా రెడ్డి,నాయకులు తోటకూరి పాండుకృష్ణ,ఎస్సిసెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు,తుమ్మ రాజారెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ బాష్పాక బిక్షపతి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ పంతం అచ్చయ్య,ఎర్రంరెడ్డి నరేందర్ రెడ్డి,సోషల్ మీడియా డిస్టిక్ కోఆర్డినేటర్ మాసంపల్లి సాత్విక్,పసునూరి సుధాకర్, మార్నాని శీను,మాసంపల్లి భాస్కర్, మైనాల భాస్కర్, ధర గాని శ్రీనివాసు, భాషిపాక యాదగిరి, బోనగిరి భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ గూటికి ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్



**ఆదిలాబాద్ జిల్లా(గౌతమ్ న్యూస్ ): ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ కమలం గూటిని వీడి మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో ఆయన బీజేపీ పార్టీలో చేరారు. నిన్న మొన్నటి వరకు బీజేపీ ఎన్నికల ప్రచారంలో తిరిగిన జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ ఇవాళ బీఆర్ఎస్ కార్యని ర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు పలువురు మాజీ సర్పంచులు, కొమరం భీమ్ మనవడు కొమరం సోనేరావు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.**

## వందల కోట్ల ఆస్తి వదిలి సన్యాసం స్వికరించిన దంపతులు




గుజరాత్ **(గౌతమ్ న్యూస్ ):** రూ.200 కోట్ల ఆస్తిని దానం చేసి.. భార్యతో కలిసి సన్యాసం స్వీకరించిన వ్యాపారవేత్త వందల కోట్ల సంపదలున్న వారికి సంతోషాన్ని ఇవ్వలేదు. తమ ఇద్దరు పిల్లలు రెండేళ్ల కిందటే చిన్నతనంలోనే సన్యాసం స్వీకరించారు. వారి భవిష్యత్తు కోసం సంపదలు కూడబెడితే.. పిల్లలు మాత్రం భౌతిక సుఖం వదిలిపెట్టాలని నిర్ణ యించుకున్నారు. దీంతో ఆ దంపతులు కూడా తమ బిడ్డలను అనుసరించాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆస్తులను దానం చేసి.. సన్యాసులుగా మారిపోయారు గుజరాత్‌లోని సంపన్న జైన కుటుంబానికి చెందిన దంపతులు. ఈ నెల 22న వారు దేశయాత్రకు బయలుదేరుతారు.

## ఎండాకాలం ఆరోగ్యం మీద శ్రద్ధ చూపండి

ఈ ఎండా కాలం లో కాస్త ఆరోగ్యం మీద శ్రద్ధ పెడదాం .లేకపోతే పరిణామాలు తప్పవు అంటున్నారు. ఆరోగ్య నిపుణులు. ఎండ దెబ్బకు హార్ట్ ఎటాక్ వస్తుందా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ఏడాది ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఎండాకాలం మొదలైన రోజు నుంచే.. భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. జనాన్ని అల్లాడిస్తున్నాడు. దీంతో వడగాలులు కూడా విపరీతంగా వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు డాక్టర్లు. ఎండదెబ్బకి గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు. హార్ట్ పెషంట్లు, ఆరోగ్యంగా ఉన్న వాళ్ల ప్రతి ఒక్కరు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మరి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

### ఎండ దెబ్బకు గుండెపోటు..

ఎండాకాలంలో వీచే ఈ వడగాలుల వల్ల.. గుండెకు సంబంధించి వ్యాధులు వస్తాయని గతంలో చాలా స్టడీస్‌లో తేలినట్లు నిపుణులు చెప్తున్నారు. 2015 ? 2020 మధ్య చైనాలో సంభవించిన హార్ట్ ఎటాక్ మరణాలకు ఎండ దెబ్బ కారణం అని తేల్చినట్లు డాక్టర్లు చెప్పారు. పెద్ద వయసు వాళ్లు మాత్రమే కాకుండా.. చిన్న వయసులో కూడా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయినట్లు స్టడీస్ చెప్తున్నాయి.

### ఎండ దెబ్బకు, హార్ట్ ఎటాక్‌కు లింక్?

ఎండదెబ్బ తగిలితే హార్ట్ ఎటాక్ ఎలా వస్తుందనే అనుమానాలు, దానికి దీనికి లింక్ ఎలా అనే ప్రశ్నలు చాలా మందిలో తలెత్తుతున్న నేపథ్యంలో రిసెర్చ్ లు ఈ విధంగా చెప్తున్నాయి. శరీరాన్ని ఆయిల్ మెషిన్ తో పోల్చారు డాక్టర్లు. హీట్ వేవ్ టైంలో అది ఎక్కువగా పనిచేస్తుంది అని చెప్పారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తట్టుకోవాలంటే.. గుండె మామూలు కంటే ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. రక్త ప్రసరణ కావాలంటే.. చాలా ఇబ్బందులు తలెత్తుతాయి. ముఖ్యంగా స్కిన్ విషయంలో.. చమటను బయటికి పంపేందుకు హార్ట్ ఎక్కువగా పనిచేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఎండాకాలంలో ఎక్కువగా చమట పట్టడం వల్ల.. ఫ్లూయిడ్స్ లాస్ అవుతాం. దీంతో రక్తం చిక్కబడి.. పంప్ చేయడం కష్టం అవుతుంది. దీనివల్ల హార్ట్ మీద ఒత్తిడి ఎక్కువై సరిగ్గా పనిచేయదు అని చెప్తున్నారు డాక్టర్లు. ఈ ఎక్స్



ట్రా వర్క్ లోడ్ వల్ల హార్ట్ ఎటాక్ రావడం, హార్ట్ ఫెయిల్ అవ్వడం లాంటివి జరుగుతాయట.

### పెద్దవాళ్లు జాగ్రత్తగా ఉండాలి..

ఈ ఎండలకు ఏ వయసు వారైనా ఎండ దెబ్బ బారిన పడతారు. అయితే, పెద్దవాళ్లు ముఖ్యం 70 ఏళ్లు పైబడిన వాళ్లు ఇంకా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు డాక్టర్లు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవాళ్లు, డయాబెటిస్, లంగ్స్ ప్రాబ్లమ్స్ ఉన్నవారు ఇంకా జాగ్రత్త వహించాలని, వాళ్లకి రిస్క్ ఇంకా ఎక్కువగా ఉంటుందని సూచిస్తున్నారు. ఎండలో పనిచేసేవాళ్లు, హార్డ్ వర్క్ చేసేవాళ్లు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. అధికంగా చెమట పట్టడం, వాంతులు, వీక్ నెస్, నీరసం లాంటి లక్షణాలు ఉంటే.. కచ్చితంగా వెంటనే డాక్టర్ ని సంప్రదించాలని సూచిస్తున్నారు హెల్త్ నిపుణులు.

### ఎండ దెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఎండదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు డాక్టర్లు. గుండెకి సంబంధించి కూడా జాగ్రత్తలు పాటించాలని అంటున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలే పెద్ద పెద్ద ప్రమాదాల బారి నుంచి మనల్ని రక్షిస్తాయి. మరి ఏ జాగ్రత్తలు తీసుకోవాలంటే? బాడీని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవాలి. దాహం వెయ్యకపోయినా.. తగినన్ని నీళ్లు కచ్చితంగా తాగాలి. ఎలక్ట్రోలైట్ రిచ్ ఫ్లూయిడ్స్ కూడా హెల్ప్ అవుతాయి. ఎండలో ఎక్కువగా తిరగకపోవడం మంచిది. 10 గంటల నుంచి 4 గంటల వరకు ఇండోర్ లో ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. ఎండాకాలానికి తగ్గట్లుగా డ్రెస్ చేసుకోవాలి. లైట్ వెయిట్, లైట్ కలర్, కాటన్ డ్రెస్సులు వేసుకుంటే బెటర్. మెడికేషన్ లో ఉన్నవాళ్లు సమ్మర్ కి తగ్గట్లుగా ఎడ్జస్ట్మెంట్స్ చేసుకోవాలి. డాక్టర్ ని సంప్రదించి మార్పులు చేసుకుంటే మంచిది. ఇంట్లో వాళ్లు, చుట్టుపక్కల వాళ్లను కూడా గమనిస్తూ ఉండాలి. బయట పనులు చేసుకునేవాళ్ల జాగ్రత్త చూసుకుంటే వాళ్లకు మంచి చేసిన వాళ్లు అవుతాం. మానసిక, శారీరక ఆరోగ్యానికి సంబంధించి.. ఎలాంటి సందేహాలున్నా మీరు తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలి

## మనో విజ్ఞానశాస్త్రం లో కందాల రామయ్య కు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం

హన్మకొండ (గౌతమ్ న్యూస్ ) : హనుమకొండ నివాసి మరియు ములుగు జిల్లా, ములుగు మండలం లోని అబ్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందాల రామయ్య ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి మనో విజ్ఞాన శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగ సంచాలకులు: ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ సైకాలజీ విభాగ అధిపతి ఆచార్య వల్లూరి రామచంద్రం పర్యవేక్షణలో ' ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించే విధానాలపై ఉద్వేగ ప్రజ్ఞ, వృత్తి పరమైన ఒత్తిడి మరియు మూర్తిమత్వం అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. తన పరిశోధనలో భాగంగా ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన వాడిగా విస్తృత పరిశోధనలు చేసి జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని మరియు జర్నల్స్ పరిశోధనా పత్రాలు ప్రచురించారు. ఉపాధ్యాయుడి గా 25 సంవత్సారాలు సుదీర్ఘ అనుభవం కలిగిన కందాల రామయ్య , పాఠ్య పుస్తక రచయితగా , జాతీయ స్థాయిలో %ు% రాష్ట్ర స్థాయిలో రీసోర్స్ పర్సన్ గా విద్యా శాఖకు ఎనలేని సేవలు అందిస్తూనే, నిత్య విద్యార్థిగా , నిరంతర పరిశోధకుడిగా ఉన్నత విద్యను కొనసాగిస్తూనే, తాను పనిచేసిన పాఠశాలలో పిల్లల విద్యాభివృద్ధికి మరియు పాఠశాల అభివృద్ధికీ కృషి



చేస్తూ 2022 సంవత్సరం లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ముగారి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా దూరవిద్యా కేంద్రం కాకతీయ యూనివర్సిటీ సంచాలకులు %ు% మనోవిజ్ఞాన శాస్త్ర అధిపతి ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఉస్మానియా యూనివర్సిటీ విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర ఆచార్యులు డాక్టర్ అనుపమ, డాక్టర్ స్వాతి మరియు డాక్టర్ పారిపల్లి శంకర్ మరియు జిల్లా విద్యా శాఖాధికారి %+% పానిని, ప్రధానోపాధ్యాయులు %+%.భాస్కర్, మరియు ఉపాధ్యాయులు కందాల రామయ్యని అభినందించారు. ఈ పరిశోధనలో సహకరించిన పర్యవేక్షకులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు మరియు బంధుమిత్రుల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. భవిష్యత్తులో విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం లో మరిన్ని వినూత్న పరిశోధనలు చేస్తూ విద్యా రంగ అభివృద్ధికి తాను మరింతగా కృషి చేస్తానని రామయ్య తెలిపారు.

## ఖానాపురం పీహెచ్ సీని సందర్శించిన జిల్లా వైద్యాధికారి



ఖానాపురం (గౌతమ్ న్యూస్ ) : వరంగల్ జిల్లా ఖానాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం సందర్శించారు. ప్రతి మంగళ వారం జరిగే ఆరోగ్యం మహిళా కార్యక్రమాన్ని , అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాలతో పాటు మండలంలో ఏ ఒక్కరు కూడా వడదెబ్బకు గురికాకుండా చూడాలని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ,అన్ని సబ్ సెంటర్లలో ఓఆర్ ఎస్ ప్యాకెట్స్, ఆశా కార్యకర్తల వద్ద అంగన్ వాడీ సెంటర్ లలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద తప్పనిసరిగా ఓఆర్ ఎస్ ప్యాకెట్స్ పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎండ వేడిమి తీవ్రంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ జ్యోతి ,గ్రామీణ ప్రాంత వైద్యులు డాక్టర్ రుచిత, డాక్టర్ కల్పన ,డాక్టర్ రాకేష్ , వైద్య సిబ్బంది స్టాఫ్ నర్స్ మంగమ్మ హెల్త్ సూపర్వైజర్ దేవిక హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, రాంప్రసాద్ రెడ్డి ,ఏఎన్ఎంలు విజయ రాణి, సుజాత ,జ్యోతి, రమాదేవి భార్గవి ,జ్యోతి, రమ్య ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



### కురవి వీరభద్రస్వామి వారిని దర్శించుకున్న
## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కురవి (గౌతమ్ న్యూస్ ) : కురవి వీరభద్ర స్వామి వారిని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితులు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా కార్యాలయంలో అగ్నిప్రమాదం



న్యూ ఢిల్లీ (**గౌతమ్ న్యూస్** ): కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం హెూం శాఖ ఆఫీస్‌లో మంటలు చెలరేగినట్లు సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కార్యాలయంలోని కంప్యూ టర్లు, పత్రాలు, ఫైళ్లు, జిరా క్స్ మిషన్‌కు మంటలు అంటుకుని కాలి బూడిదై నట్లు గుర్తించారు. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఆఫీస్‌లో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అక్కడ లేరని అధికారులు వెల్లడించారు. కొందరు సీనియర్ అధికారులు ఉన్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 9.20 గంటలకు ఆఫీస్‌లో అగ్నిప్రమాదం సంభవించి నట్లు వివరించారు. నార్త్ బ్లాక్‌లోని ఐసీ డివిజన్‌లోని రెండో ఫ్లోర్‌లో ఈ మంటలు చెలరేగినట్లు పేర్కొన్నారు. అమిత్ షా ఆఫీస్‌లో ఫైర్ యాక్సిడెంట్ అయిందని అధికారులు ఇచ్చిన సమాచారంతో వెంటనే అగ్నిమాపక శాఖ అధికారు లు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. 7 ఫైర్ ఇంజన్ల సాయంతో ఎగిసి పడిన మంటలను అదుపు చేసినట్లు ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ ఘటనలో జిరాక్స్ మెషిన్, కొన్ని కంప్యూటర్లు, మరి కొన్న పత్రాలు అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. ప్రమాద సమయంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా భవనంలో లేరని.. పలు వురు సీనియర్ అధికారులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చు కున్నారు.

## ఇల్లంతకుంట రాములోరి కళ్యాణానికి సర్వం సిద్ధం



కరీంనగర్ జిల్లా(**గౌతమ్ న్యూస్** ): అపర భద్రాద్రిగా పేరు గాంచిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇల్లందకుంట లో స్వయం బుగా వెలిసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్, పోలీస్ కమిషనర్ స్వామి వారి కళ్యాణానికి పట్టువ స్త్రాలు, ముత్యాల తలంబ్రా లు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

## గల్ఫ్ కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (గౌతమ్ న్యూస్ ) : ఉపాధి కోసం గల్ఫ్ దేశాలతో పాటు విదేశాలకు వెళ్తున్న టువంటి తెలంగాణ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. బంజారా హిల్స్ లోని తాజ్ డెక్కన్ హెూటల్ లో గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో ఈరోజు సమావేశం అయ్యారు రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%%. ఎన్నికల తరువాత గల్ఫ్ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకురాబో తుందని చెప్పారు. తెలంగాణ గల్ఫ్, ఓవర్సిస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేసి ఇందులో ఐఏఎస్ అధికారితో పాటు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17లోపు ఈ వ్యవ స్థను పకడ్బందీగా ఏర్పాటు చేసే విధంగా తానే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు రేవంత్ రెడ్డి. ఓవర్సీస్ కార్మికుల కోసం ఫిలిఫ్ఫిన్, కేరళలో మంచి విధానం ఉందన్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానం పై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గల్ఫ్ కార్మికులు మరణించినట్టయితే రూ.5లక్షలు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించామని.. రాబోయే రోజుల్లో రైతు బీమా మాదిరిగానే బీమా సౌకర్యం ఏర్పాటు చేస్తామ న్నారు.

## కొమ్మాల జాతర హుండీ ఆదాయం లెక్కింపు



గీసుగొండ (గౌతమ్ న్యూస్ ) : గీసుగొండ మండలం లోని కొమ్మాల జాతర హుండీ ఆదాయం లెక్కింపు గత సంవత్సరం 47,80,651 కాగా,ఈ సంవత్సరం 54,24,862 ల ఆదాయం వచ్చినట్లు ఈ ఓ శేషగిరి,ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు తెలిపారు.కొమ్మాల జాతరను విజయవంతం చేసిన ఈవో శేషగిరికి ప్రధాన పూజారి రామాచారికి జిల్లా కాంగ్రెస్ నాయకులు సాయిలి ప్రభాకర్, చాడ కొమరారెడ్డిలు సన్మానం చేశారు. జాతరను విజయవంతం చేసిన పోలీసు అధికారులకు, కరెంట్ డిపార్ట్మెంట్ అధికారులకు, పంచాయతీ రాజ్ అధికారులకు, హెల్త్ డిపార్ట్మెంట్ వారికి, అన్ని డిపార్ట్మెంట్ల వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత తొమ్మిది ఏళ్ల టిఆర్ఎస్ పరిపాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు అలాంటిది ప్రధానంగా ఎన్నడు లేని విదంగా గెలిచిన రెండు నెలలకే స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కోటి 30 లక్షలతో భక్తులకు రోడ్లు,టాయిలెట్స్ మంచినీటి వసతులు, వివిధ పనులు ఏర్పాటు చేయడం వలన, ఎప్పటికప్పుడు జాతరపై ఎమ్మెల్యే దృష్టి పెట్టి విజయవంతం చేశారు. భక్తులు సంతోషంతో సకల సౌకర్యాలతో భగవంతుని దర్శనం చేసుకొని సంతోషంగా హర్షం వ్యక్తం చేస్తు జాతర ఆధాయం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పెరిగిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్ నాయక్, కమిటీ డైరెక్టర్లు కందికొండ రాజు, లద్దియ రాజు, చెవుల నాయక్, వీరేందర్, మండల నరేష్, యార రాజిరెడ్డి, శ్రీనాథ్ తదితర డైరెక్టర్లు పాల్గొన్నారు.



# కె.జి బేసిన్‌లో మనది న్యాయమైన హక్కు

కృష్ణ-గోదావరి బేసిన్ మన రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో వ్యాపించి ఉన్నది. ఒ.యన్.జి.సి ఆస్తులన్నింట్లోకి అత్యంత ఎక్కువ ఉత్పాదకత కలిగిన వాటిలో కె.జి. బేసిన్ ముఖ్యమైనది. ఇంతటి సంపద్వంతమైన కె.జి. బేసిన్ నిల్వలు ముంగిట్లో వున్నా ఆంధ్ర ప్రజలకు అందుబాటులో లేకపోవడమే విషాదం. కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన సముద్ర గర్భం నుండి 2024, జనవరి 7న ముడిచమురు ఉత్పత్తి ప్రారంభమవటమే తాజా పరిణామం. కృష్ణ-గోదావరి బేసిన్‌లో సహజ వాయువుతో పాటుగా చమురు ఉత్పత్తి విలువ కొన్ని లక్షల కోట్లకు మించి ఉంటుందని అంచనా. 21వ శతాబ్దంలో సంపన్న శక్తివంతమైన దేశమంటే చమురు, సహజ వాయువు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని అర్థం. ఆంధ్ర తీరంలో వున్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చబోతున్నాయి. దీనివలన ఆంధ్ర ప్రాంత ప్రజలు సర్వతోముఖాభివృద్ధిని సాధించవచ్చు. కానీ బడా కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యానికి కేంద్ర పాలకులు లొంగిపోవటం వలన ఆంధ్రప్రజలు సంపదలకు దూరమయ్యారు. కేంద ప్రభుత్వ వివక్ష వలన ఆంధ్ర రాష్ట్రం మరింత నష్టపోతున్నది. కేవలం విద్యుత్ ఉత్పాదనలోనేకాక ఎరువుల తయారీలో కూడా సహజ వాయువు ఎంతగానో ఉపయోగపడుతుంది. దాంతోపాటు చౌకగా లభించే గ్యాస్ ఆధారిత విద్యుత్తును అందించటం ద్వారా సిమెంట్, సెరామిక్, రసాయనిక, అల్యూమినియం, స్టీల్ ప్లాంట్, ఫ్యాబ్రికేషన్ పరిశ్రమలలో ఖరీదైన విద్యుత్ మీద ఆధారపడటం తగ్గుతుంది. విశాఖ ఉక్కు కర్మాగారానికి గ్యాస్ సరఫరా చేస్తే సంవత్సరానికి రూ.1200 కోట్లకు మించి ఖర్చు తగ్గుతుందని 2010లోనే అంచనా వేశారు. కె.జి.బేసిన్ గ్యాస్ న్యాయమైన ధరకు చాలినంత లభిస్తే కాకినాడ నుండి విశాఖపట్నం వరకు కాలుష్య రహిత రసాయనిక పరిశ్రమల కారిడార్‌ను నెలకొల్పవచ్చు. కె.జి బేసిన్‌లో రోజుకి కొన్ని మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిక్షేపాలు కనుగొన్నారు. కేవలం ఒక్క ఎం.ఎం.ఎస్.సి.ఎం.డి యూనిట్ గ్యాస్, సుమారు రూ.1000 కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడిని ఆకర్షించగలదని నిపుణుల అంచనా. అంటే కె.జి బేసిన్ గ్యాస్‌లో సగాన్ని ఉపయోగించుకున్నా మనం లక్ష కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించవచ్చు. లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కలిగించవచ్చు. రవాణా రంగంలో బస్సులకు, లారీలకు, కార్లకు, ఆటోలకు సిఎన్‌జి గ్యాస్ వాడకం వల్ల ఖర్చు తగ్గటమే కాకుండా కాలుష్యం నుండి పర్యావరణాన్ని కూడా రక్షించుకోవచ్చు. గృహ అవసరాలకు గ్యాస్ పైపుల ద్వారా అతి చౌకగా వంటగ్యాస్ అందించవచ్చు. దీని మూలంగా గ్యాస్ సిలిండర్లపై ప్రభుత్వ సబ్సిడీ భారం తగ్గుతుంది. ప్రస్తుతం వెయ్యి రూపాయలకు పైగా ఖరీదవుతున్న వంట గ్యాస్ సిలిండర్‌కు సమానమైన గ్యాస్‌ను పైపులైన్ ద్వారా వంద రూపాయలకే ఇవ్వవచ్చు. అలానే లీటర్ పెట్రోలును పది రూపాయలకే వాహనదారులకు అందించవచ్చు. సహజ వనరులన్నీ 1990 వరకు ప్రభుత్వ అధీనంలో వుండేవి. ప్రభుత్వ రంగ సంస్థలైన 'ఆయిల్ అండ్ నేచరల్ గ్యా స్ కార్పోరేషన్' (ఒఎన్‌జిసి), 'ఆయిల్ ఇండియా కార్పోరేషన్' (ఐఒఎల్) సహజ వాయువును, చమురును అన్వేషించి, వెలికితీసి ఉత్పత్తి చేసేవి. మరో ప్రభుత్వరంగ సంస్థ గ్యాస్ అధారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జిఎఐఎల్) పైపుల ద్వారా రవాణా చేసి అమ్మకాలు సాగించేది. విదేశీ సంస్థల భాగస్వామ్యం కొంత వున్నా ఈ సంస్థలన్నీ ప్రభుత్వ నియంత్రణలో ఉండేవి. ఆ తర్వాత క్రమంలో ప్రభుత్వంతో పనులు చేయించుకోవటంలో మెలకువలు తెలిసిన రిలయన్స్ లాంటి బడా కార్పొరేట్ సంస్థలు రంగప్రవేశం చేశాయి. ఇవి ప్రభుత్వ సంస్థలను రద్దు చేయకుండానే వాటి పునాదిని ఉపయోగించుకుని విపరీతమైన లాభాలను గడించాయి. సహజ వాయువు, చమురు నిక్షేపాలు మన ముంగిట్లో అంటే కె.జి.బేసిన్‌లో పుష్కలంగా ఉన్నా ఆ వనరులను ఉపయోగించుకోలేని దుస్థితిలో మనం ఉన్నాం. దీనికి ప్రధాన కారణం కె.జి.బేసిన్ గ్యాస్ సంపద రాష్ట్ర సరిహద్దులు దాటి తరలిపోవడం. సహజ న్యాయ సూత్రాల ప్రకారం



కె.జి.బేసిన్‌లో లభ్యమయ్యే సహజ వాయువు మన రాష్ట్ర అవసరాలు తీరిన తర్వాతనే మన సరిహద్దులు దాటిపోవాలి. సహజ వనరుల యాజమాన్యం, నియంత్రణ ఆ ప్రాంత ప్రజలందరి ప్రయోజనాలను న్యాయమైన రీతిలో కాపాడేటట్లుగా రాజ్య వ్యవస్థ వ్యవహరించాలని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు చెప్తున్నాయి. సహజ న్యాయానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బేసిన్‌లో లభ్యమవుతున్న సహజ వాయువు మన సరిహద్దులు దాటి 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రలకు తరలిపోతున్నది. 45.50 శాతం గ్యాస్‌ను గుజరాత్‌కు తరలిస్తున్నారు. 24 శాతం మహారాష్ట్రలోని పరిశ్రమలకు ఇచ్చేస్తున్నారు. మిగిలిన దాన్ని ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాలకు 1.2 శాతాన్ని మాత్రమే కేటాయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్పోరేట్ అనుకూల విధానాలు, రాష్ట్ర ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం, పటిష్టమైన ప్రజా పోరాటాలు సాగని ఫలితంగా మన సహజ సంపద తరలిపోతున్నది. కె.జి.బేసిన్‌లో సహజవాయువు ధరను నిర్ణయించటం ఒక ప్రహసనంగా మారింది. రిలయన్స్ కంపెనీ ప్రవేశించే వరకూ గెయిల్ సంస్థ ల్యాంకో పరిశ్రమకు యూనిట్ ఒకటికి 1.97 డాలర్లకు సరఫరా చేస్తున్నది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌కు కె.జి.బేసిన్ నుండి ఒక యూనిట్ గ్యాస్‌ను 2.97 డాలర్లకు సరఫరా చేస్తానని రిలయన్స్ కంపెనీ అగ్రిమెంట్ కుదుర్చుకున్నది. తదనంతరం ప్లేట్ ఫిరాయించి 4.3 డాలర్లకైతేనే గ్యాస్ ఇస్తామన్నది. ఇంత ఎక్కువ ధరలు నిర్ణయించటానికి శాస్త్రీయ ఆధారాలు లేవని, ఆ ధరకు గ్యాస్ కొనుగోలు చేస్తే ఎరువులు, విద్యుత్ ఉత్పత్తి, తదితర పరిశ్రమలకు భారం అధికమవుతుందన్న నాటి కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి జైపాల్ రెడ్డిని ఆ శాఖ నుండి తప్పించేశారు. ధర పెంచటం అన్యాయమన్న కేంద్ర కార్యదర్శుల కమిటీ నిర్ణయాన్ని ఆమోదించలేదు. రంగరాజన్ అధ్యక్షతనగల ప్రధాన ఆర్థిక సలహా మండలి నిర్ణయాన్ని ఒప్పుకోలేదు. ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం ఒక మంత్రుల కమిటీని నియమించింది. ఆ కమిటీ ఏదో ఘనకార్యం చేసినట్లుగా నటించి రిలయన్స్ కోరిన 4.33 డాలర్ల ధరను 4.2 డాలర్లకు తగ్గించింది. కొండను తవ్వి ఎలుకను పట్టటం అంటే ఇదే! ఆలస్యంగానైనా మేల్కొన్న నాటి ఆంధ రాష్ట్ర ప్రభుత్వం కె.జి.బేసిన్ లోని సహజ సంపదలో మన రాష్ట్రానికి న్యాయ సమ్మతమైన వాటా లభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరితే రిలయన్స్ కంపెనీతో మాట్లాడుకోమంది. ఉన్న నిల్వలు మాకే సరిపోవు కాబట్టి కొత్తగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్క యూనిట్ సహజ వాయువును కూడా సరఫరా చేయలేనని తేల్చి చెప్పింది. ఫలితంగా మన రాష్ట్రంలో అప్పటికే ప్రైవేట్ రంగంలో నెలకొల్పిన గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పాదన కేంద్రాలకు గ్యాస్ సరఫరా అసాధ్యమైంది. ఈ పరిస్థితులలో నాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి కేంద్రానికి కొన్ని సూచనలు చేస్తూ 29 లేఖలు రాశారు. న్యాయబద్ధమైన సూచనలలో ఏ ఒక్కదానిని కూడా కేంద్ర ప్రభుత్వ మంత్రుల కమిటీ పరిగణనలోకి తీసుకొనలేదు. ఈ విధానం హక్కులను నిరాకరించటమే గాక అణిచివేయటం కాదా! పన్నెండవ ఆర్థిక సంఘం కూడా ఏ ప్రాంతంలో దొరికే సహజ వనరులపైన ఆ ప్రాంతానికి వినియోగ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. పార్లమెంటు స్టాండింగ్ కమిటీ 2013 అక్టోబర్ రిపోర్టులో, సహజ వనరులు ఉత్పత్తి అవుతున్న రాష్ట్రానికి కనీసం 50 శాతం గ్యాస్‌తో పాటు రాయల్టీని కూడా ఇవ్వాలని సిఫారసు చేసింది. సముద్ర అంతర్భాగం నుండి గ్యాస్ తీసినా, భూమి నుండి తీసినా రాష్ట్రానికి వాటా వుండాల్సిందేనని పార్లమెంటు కమిటీ తేల్చిచెప్పింది. మన రాష్ట్రంలో లభ్యమయ్యే సహజ వనరులలో కొంత భాగాన్ని మాత్రమే మన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం డిమాండ్ చేస్తున్న అత్యంత హేతుబద్ధమైన, న్యాయమైన ఈ డిమాండ్ ను కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించటం అంటే ఫెడరలిజాన్ని నిరాకరించటమే, కార్పోరేట్ కంపెనీలకు ప్రత్యక్షంగా వత్తాసు పలకటమే! భూమి లోపల కొన్ని లక్షల సంవత్సరాల పరిణామాల ఫలితంగా సహజ వాయువు, చమురు ఏర్పడుతుంది. ప్రజలు సముద్రపు ఆటుపోట్లను, అల్ప పీడనాలను, వాయు గుండాలను, ఉప్పెనలను, సునామీలు, పంట పొలాలలో గ్యాస్ బ్లోఅవుట్లు లాంటి కష్టాలను ఎదుర్కొంటూ జీవిస్తున్నారు. మన గ్రామాల నుండి మన పొలాల నుండి గ్యాస్‌ను పైపుల ద్వారా గుజరాత్‌కు తీసుకెళ్తూ మనకు ఒక్క కేజీ గ్యాస్ కూడా ఇవ్వరట. మన రాష్ట్రంలో లభించే సహజ వనరులను దోచుకుని రిలయన్స్ వంటి బడా కార్పొరేట్ సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవటాన్ని, మన ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మనం వ్యతిరేకించాలి. లేనిపక్షంలో మనం భవిష్యత్ తరాల ముందు దోషులుగా నిలబడవలసి వస్తుంది. నిజానికి ఇది ప్రభుత్వ, ప్రజా ప్రతినిధుల బాధ్యత. అయితే ఇప్పటివరకు మన ప్రజా ప్రతినిధులు స్పందించాల్సిన రీతిలో స్పందించని ఫలితంగా ప్రజాఉద్యమాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా రాజీలేని సమైక్య ఉద్యమాన్ని నిర్వహించవలసిన అవసరం నేడు ఏర్పడింది. కె.జి.బేసిన్లో లభించే సహజ వనరులపై మన ప్రాథమిక హక్కును సాధించుకోవటానికి పోరాట దీక్షతో కలసికట్టుగా ముందడుగు వేద్దాం!

# గృహ వినిమయ వ్యయ గణాంకాలు - మోడీ ప్రభుత్వ వక్రబుద్ధి

పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడటంతో ఆగమేఘాల మీద 2022-23 గృహ వినియోగ వ్యయ సర్వే నివేదికను నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం విడుదల చేసింది. అది కూడా పూర్తి నివేదిక కాదు. కేవలం 27 పేజీల సంక్షిప్త 'వాస్తవ నివేదిక' (ఫ్యాక్ట్ షీట్) పేర ప్రకటించారు. 2023-24 రెండో సర్వే ఇంకా కొనసాగుతున్నది. ఇది పూర్తయిన తరువాత రెండు సర్వేల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా పరిగణలోకి తీసుకొని సంపూర్ణ నివేదికను విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాదిలో ఇది సాధ్యపడదు. నూతన వినియోగ ధరల సూచీని నిర్ధారించటానికి అవసరమైన ప్రాథమిక పున:పరిశీలన, మార్కెట్ సర్వే, వస్తువులకు తగిన వెయిటేజ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇవన్నీ ఇంకా జరగక ముందే సంక్షిప్త నివేదికతో ప్రభుత్వం హడావుడి చేస్తున్నది. తప్పుడు ప్రచారానికి పూనుకుంటూ ప్రజలను మోసగిస్తున్నది. పదకొండేళ్ల సుదీర్ఘ విరామం తరువాత సరేంద్ర మోడీ ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో నిర్వహించిన గృహ వినియోగ వ్యయ సర్వే గణాంకాలను విడుదల చేసింది. వాస్తవంగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి దేశంలో ప్రజల వినిమయ స్థితిగతులను తెలుసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ ద్వారా సర్వే నిర్వహిస్తుంది. భారతదేశంలో ఆదాయ సర్వేలు లేనందున ఈ వినిమయ గణాంకాల ద్వారానే ఆదాయ ధోరణులు తెలుసుకోవటానికి కూడా దీనిని ఉపయోగి స్తున్నారు. అంటే ఒక కుటుంబం నెలకి ఎంత ఖర్చు చేస్తుందో ఈ సంఖ్యల నుండి ఎంత ఆదాయం సంపాదిస్తున్నారో సుమారుగా అంచన వేయవచ్చు. దీనికి ముందు 2017-18 కాలంలో నిర్వహించిన గృహ వినిమయ వ్యయం సర్వేను విడుదల చేయకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం తొక్కి పెట్టింది. 2016లో పెద్ద నోట్ల రద్దు, 2017లో ప్రవేశపెట్టిన జిఎస్టీ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవటంతో దేశ ప్రజలపై తీవ్ర ప్రభావం పడి వారి కుటుంబ వినియోగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ వాస్తవాలు సర్వేలో నిరూపణై బహిర్గతం కావడంతో మోడీ ప్రభుత్వం భగ్గుమన్నది. దీంతో సర్వే డేటా సక్రంగా లేదనే సాకు చెప్పి సర్వే ఫలితాలను విడుదల చేయకుండా కప్పిపుచ్చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 2,61,746 కుటుంబాల నుండి 2022-23 సర్వే నిర్వహించింది. ఇందులో 8723 గ్రామాల నుండి 1,50,514 కుటుంబాలు, 6115 పట్టణాల నుండి 1,06,732 కుటుంబాలు ఉన్నాయి. సర్వే వివరాలను పరిశీలిస్తే 2011-22లో గ్రామీణ ప్రాంతాల్లో తలసరి వినియోగం రూ.1430 ఉంటే, 2022-23 నాటికి రూ.3773కు చేరింది. పట్టణ ప్రాంతాల్లో ఇదే కాలంలో తలసరి వినియోగం చూస్తే సగటు తలసరి వినియోగం రూ.2630 నుండి రూ.6459కి పెరిగింది. 2011-12 నాటి ధరల సూచీ ప్రకారం చూస్తే సగటు తలసరి వినిమయ వ్యయం గ్రామీణ ప్రాంతంలో రూ.1430 నుంచి రూ.2008కి అంటే వార్షిక వృద్ధి రేటు 4 శాతం, పట్టణ ప్రాంతాలల్లో రూ.2630 నుంచి రూ.3510కి అంటే ఏడాదికి 3 శాతం వృద్ధి రేటుగా నమోదయ్యింది. సామాజిక తరగతుల వారీగా చూస్తే గిరిజనులలో నెలవారీ సగటు వినియోగ వ్యయం 2022-23లో గ్రామీణ ప్రాంతంలో రూ.3016, దళితుల్లో రూ.3474, ఓబిసిల్లో రూ.3848, ఇతరుల్లో రూ.1392గా ఉన్నట్లు సర్వే నివేదిక పేర్కొన్నది. అలాగే పట్టణ ప్రాంతాల్లో గిరిజనుల్లో రూ.5414, దళితుల్లో రూ.5307, ఓబిసిల్లో రూ.6177, ఇతరుల్లో రూ.7333 నెలవారీ సగటు వినిమయ వ్యయం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనులు, దళితులు దేశ సగటు వ్యయం కంటే వారి వినిమయం చాలా తక్కువగా ఉంది, ఓబిసిల్లో సగటు కంటే కొంచెం ఎక్కువగా కన్పిస్తున్నది. అదే పట్టణ ప్రాంతాల్లో అయితే గిరిజన, దళిత, ఓబిసి మూడు తరగతులు దేశ సగటు వినిమయం కన్నా అథమ స్థితిలో ఉన్నారు. ఈ తరగతులకు అగ్ర వర్ణాలకు మధ్య వినియోగ వ్యయంలో చాలా వ్యత్యాసం కనిపిస్తున్నది. సర్వే నివేదిక మరొక అంశాన్ని కూడా నిర్ధారించింది. పేద-ధనికుల మధ్య వినిమయ అంతరాలను కూడా గణించింది. దేశ జనాభాలో అట్టడుగు 5శాతం నిరుపేదలు సగటున నెలకి గ్రామీణ ప్రాంతంలో రూ.1373 ఖర్చు చేస్తుంటే, అదే పైనున్న



5 శాతం ధనికులు నెలకు సగటున తలసరి రూ.10,501 ఖర్చు చేస్తున్నారు. అదే పట్టణ ప్రాంతాల్లో కింది స్థాయి పేదలు రూ.2001 ఖర్చు చేస్తుంటే పైస్థాయిలోని 5 శాతం ధనికులు నెలకి సగటున తలసరి రూ.20,824 ఖర్చు చేస్తున్నారు. రోజువారీగా చూస్తే కింది స్థాయి. పేదలు రోజుకి సగటున రూ.46, పట్టణ ప్రాంతాల్లో రూ.67 ఖర్చు చేస్తుంటే, ధనవంతులు గ్రామాల్లో రోజుకి రూ.350, పట్టణ ప్రాంతాల్లో రూ.700 ఖర్చు చేస్తున్నారు. స్థూలంగా గ్రామీణ ప్రాంతంలో 8 రెట్లు, పట్టణ ప్రాంతాలో 10 రెట్లు పేదల కంటే ధనికులు ఎక్కువగా వినిమయం చేస్తున్నారు. ప్రజల మధ్య వినిమయ అంతరాలు ఎంత తీవ్రస్థాయిలో ఉన్నయో అర్థం చేసుకోవచ్చు. వివిధ వినిమయ తరగతుల వారీగా వ్యయాన్ని పరిశీలిస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 70 శాతం ప్రజలు సగటు వినిమయం కంటే వెనుకబడి ఉన్నారు. ఈసారి ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి ప్రజలకు అందుతున్న వాటి విలువను కూడా ప్రత్యేకంగా లెక్కగట్టి వినియోగ వ్యయంలో కలిపారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా తలసరి నెలకు 5 కిలోల చొప్పున అందుతున్న బియ్యం లేదా గోధుమలు, స్కూలు యూనిఫామ్‌లు, లాప్టాప్‌లు, సైకిళ్లు, మొబైళ్ల తదితర వాటినన్నింటిని పరిగణలోకి తీసుకొని విడుదల చేసిన ఫలితాలు చూస్తే కళ్లు తెరిపిస్తాయి. వీటి విలువను కూడా పరిగణలోకి తీసుకుంటే ప్రతి వ్యక్తి నెలకు అదనంగా రూ.87 ఖర్చు చేస్తున్నట్లు తేల్చారు. వివిధ ఖర్చులను చూస్తే ఆహారం మీద పెడుతున్న ఖర్చు ఈ పదేళ్ళల్లో తగ్గినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గడిచిన 11 ఏళ్ళలో ఆహారంపై ఖర్చు గ్రామీణ ప్రాంతంలో 46 శాతం, పట్టణ ప్రాంతంలో 39 శాతానికి తగ్గింది. తొలిసారిగా ప్రజలు ఆహారంపై చేసే వ్యయం 50 శాతం లోపుకు పడిపోయింది. అలాగే ఆహారేతరాలపై పెట్టే వ్యయం గ్రామీణ ప్రాంతంలో 54 శాతం, పట్టణ ప్రాంతంలో 61 శాతానికి పెరిగింది. దీనిని కూడా ప్రభుత్వం తన ఘనకార్యంగా చెపుకుంటున్నది. వాస్తవంగా సర్వే కాలానికి ముందే ఆహార వస్తువుల ధరలు, రిటైల్డ్ ద్రవ్యోల్బణం బాగా పెరిగింది. దీనివల్ల ఆహార వస్తువులపై వినిమయం తగ్గిండొచ్చు. అలాగే విద్య, వైద్యం, రవాణా, ఇంటి అద్దెలు వంటి కొన్ని ముఖ్యమైన వాటిపై అదనంగా ఖర్చు చేయాల్సిన అనివార్య పరిస్థితి ప్రభుత్వం సృష్టించింది. 2022-23 ప్రజల వినిమయ వ్యయంలో దేశంలో ఆంధ్ర రాష్ట్ర స్థానాన్ని చూస్తే గ్రామీణ ప్రాంత వ్యయంలో 15వ స్థానంలోను, పట్టణ ప్రాంతంలో 17వ స్థానంలో ఉంది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఈ అంకెలను చూపి అభివృద్ధి ప్రకటనలు గుప్పిస్తున్నది. ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయని, ప్రజల వినియోగ వ్యయం పెరుగుదలే ఇందుకు తార్కాణమని ఊదరగొడుతున్నది. ప్రజల మధ్య ఆదాయ అంతరాలు కూడా తగ్గుముఖం పట్టాయనే ప్రచారానికి కూడా ఈ నివేదికను వాడుకుంటున్నది. వాస్తవంగా ఈ సర్వేని 2011-12 సర్వేతో పోల్చి విశ్లేషణ చేయడం సరైంది కాదు. ఎందుకంటే గత సర్వే కేవలం ఒక ప్రశ్నావళి ద్వారానే కుటుంబాల నుండి సమాచారాన్ని సేకరించింది. 2022-23 సర్వేలో 4 ప్రత్యేక ప్రశ్నావళుల ద్వారా మూడుసార్లు ఇళ్ల నుండి సమాచారం తీసుకున్నారు. ఈ సర్వేలో గ్రామీణ ప్రాంతాలను ఎక్కువ భాగం జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను ఎంపిక చేశారు. అలాగే భూమిని కూడా ప్రామాణికంగా ఎంచుకున్నారు. పట్టణ ప్రాంతంలోనైతే 10 లక్షల పైబడి, 10 లక్షల లోపు విలువ గల కారు యజమాని కుటుంబాలను కూడా ప్రత్యేకంగా సర్వేలో తీసుకున్నారు. అలాగే గతంలో సర్వేలో ఉండి, ప్రస్తుతం ప్రజల వినియోగంలో లేని వస్తువులను సర్వే నుండి తొలగించి, కొత్త వినిమయ వస్తువులను ఈ సర్వేలో చేర్చారు. ఫలితంగా సర్వే వస్తువుల సంఖ్య 347 నుండి 405కి పెరిగాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా లెక్కించి వినిమయ ఖర్చులో కలిపారు. గతంలో ఇది లేదు. ఈ సర్వే ధరల పెరుగుదలను, రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకోలేదు. కోవిడ్ రెండేళ్ల కాలంలో ప్రజల ఆదాయ వ్యయాలు దారుణంగా పడిపోయాయి. ఆ తరువాత కాలంలో నెమ్మదిగా కోలుకొని సర్వే కాలం నాటికి కొంత వినిమయాన్ని పెంచుకున్నారు. దీనివల్ల ప్రజల వ్యయంలో ఒక్కసారిగా పెరుగుదల మనకి కన్పిస్తుంది. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని తొక్కిపెట్టి ప్రజల వినిమయం పెరిగినట్లు చూపిస్తున్నది. ఈ సర్వే గణాంకాలను చూపి దేశంలో పేదరికం 5 శాతం లోపుకి తగ్గిపోయిందనే ప్రచారానికి కూడా ఒడిగట్టింది. నీతి ఆయోగ్ సిఇఓ ద్వారా ప్రచారంలో పెట్టింది. దీంతో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వం విడుదల చేసిన 27 పేజీల వాస్తవ నివేదికలో పేదరికం తగ్గిందని ఎక్కడా ప్రస్తావించలేదు. పైపెచ్చు ప్రభుత్వం పేదరికం తగ్గిందని చూపిస్తున్న మదింపు లెక్కలు కూడా పూర్తిగా అశాస్త్రీయమైనవి. ఇందుకు ఎటువంటి ప్రతిపాదిక లేదు. దేశంలో పేదరిక గీతకు సంబంధించి టెండూల్కర్ కమిటీ లేదా ప్రణాళికా సంఘం చేసిన సిఫార్సులకు లేదా ఇప్పటి వరకు దేశ పేదరికం లెక్కలకు సంబంధించి అనుసరిస్తూ వస్తున్న విధానానికి ఇది పూర్తిగా విరుద్ధమైనది. భారతదేశంలో 2011 నుండి పేదరిక లెక్కలు విడుదల చేయడం లేదు. ప్రణాళికా సంఘం రద్దయిన తరువాత ఉనికిలోకి వచ్చిన నీతి ఆయోగ్ కూడా దారిద్ర్య రేఖకు ఎలాంటి కొలమానాలను రూపొందించలేదు. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన లెక్కల ప్రకారం 11 శాతం మంది అంటే 18.9 కోట్ల మంది ప్రజలు భారత దేశంలో ఆకలితో అలమటిస్తున్నారని పేర్కొన్నది. అలాగే ప్రపంచ ఆకలి సూచిలో 125 దేశాల్లో భారత్‌దేశం 111వ స్థానంలో ఉంది. ప్రతి నలుగురు భారతీయుల్లో ముగ్గురు అతి తక్కువ ఆహారం తీసుకుంటున్నట్లు చెప్పింది. అంతేగాక గ్రామీణ ప్రాంతంలో రోజుకి 2200 క్యాలరీలు, పట్టణ ప్రాంతంలో రోజుకి 2100 క్యాలరీలు ఆహారం పొందాలంటే ప్రస్తుత ధరల ప్రకారం మదింపు చేస్తే దేశంలో 58 శాతం పేదరికంలో మగ్గుతున్నట్లు తెలుస్తున్నది. నయా ఉదారవాద కాలంలో దేశంలో పోషకాహార పేదరికం బాగా పెరిగిందని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కుటుంబ ఆరోగ్య సర్వే కూడా 15-49 వయస్సు గల మహిళల్లో రక్తహీనత 2015-16లో 53 శాతం నుండి 2019-20కి 58 శాతానికి పెరిగిందని తేల్చి చెప్పింది. ఈ కఠోర వాస్తవాలన్నింటిని మరుగున పెట్టి 2022-23 కుటుంబ వినిమయ సర్వే సంక్షిప్త నివేదికను తమ స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుంటూ దేశాన్ని మోసం చేస్తున్నది. 2021లో పూర్తి చేయాల్సిన జనాభా లెక్కలను కూడా ప్రారంభించకుండా అనేక వివాదాలను సృష్టించి వాయిదా వేస్తూ వస్తున్నది. ఈ సర్వే జరిగితే మోడీ పదేళ్ళ అభివృద్ధి బండారం బట్టబయలౌతుంది.

## టీతో గోమూత్రం.. భోజనంతో ఆవుపేడ..
# దీదీ వివాదాస్పద వ్యాఖ్యలు



: ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే దేశ ప్రజలు ఏం తినాలి, ఏం తాగాలనేది కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. "ప్రజల స్వేచ్ఛను హరించడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిగా మారింది. ఈసారి గెలిస్తే రోజూ ఉదయం టీతో పాటు గోమూత్రాన్ని తాగమంటారేమో.. మధ్యాహ్న భోజనంతో పాటు ఆవుపేడను తినమంటారేమో" అని దీదీ సెటైర్స్ వేశారు. బెంగాల్‌లోని కూచ్ బెహార్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 17న రామ నవమి సందర్భంగా అల్లర్లను ప్రేరేపించడానికి బీజేపీ యత్నిస్తోందని మమత ఆరోపించారు. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతమైన ముర్షిదాబాద్‌లో డీఐజీ మార్పు వెనుక బీజేపీ హస్తం ఉందని చెప్పారు. ముర్షిదాబాద్, మాల్దాలలో ఒకవేళ అల్లర్లు జరిగితే ఆ బాధ్యతను ఎన్నికల కమిషనే తీసుకోవాలని దీదీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్కచోట అల్లర్లు జరిగినా తాను 55 రోజుల పాటు ఈసీ కార్యాలయం వెలుపల నిరాహార దీక్ష చేస్తానని తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. "దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడాలంటే బీజేపీని అధికారం నుంచి తరిమికొట్టాలి. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ గెలిస్తే భవిష్యత్తులో దేశంలో ఎన్నికలు ఉండవు. వన్ లీడర్, వన్ నేషన్, వన్ భాషన్, వన్ భోజన్‌ను మోడీ కోరుకుంటున్నారు" అని తృణమూల్ సుప్రీం పేర్కొన్నారు. బెంగాల్ ఎన్నికల్లో దోస్తీ చేస్తున్న సీపీఎం, కాంగ్రెస్.. కేరళలో మాత్రం పరస్పరం కుస్తీ పడుతుండటం విచిత్రంగా ఉందని దీదీ కామెంట్ చేశారు. బీజేపీతో భాయ్ భాయ్ అన్నట్టుగా ఆ పార్టీల తీరు ఉందన్నారు.

# ఏపీ, తెలంగాణ సీఎస్ల కీలక సమావేశం




హైదరాబాద్: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో నిర్వహణపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు సమావేశమయ్యారు. హైదరాబాద్లోని సచివాలయంలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఏపీ సీఎస్ జవహర్ రెడ్డిలు సమావేశమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో మరింత సమన్వయంతో పని చేయాలని ఇరువురు సీఎస్లు నిర్ణయించారు. సరిహద్దు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమన్వయ భేటీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. పోలింగ్ ముగిసే వరకు పకడ్బందీగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అక్రమ మద్యం, డ్రగ్స్ రాకుండా సరిహద్దుల్లో అప్రమత్తం చేసినట్లు చెప్పారు. గోవా, కర్ణాటక నుంచి మద్యం రాకుండా సరిహద్దుల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువుల రవాణా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామన్నారు. శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ఇదే వాతావరణాన్ని పోలింగ్ వరకు పకడ్బందీగా కొనసాగించేందుకు ఉభయ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశం దోహదపడుతుందన్నారు. తెలంగాణ తరపున పోలీస్ శాఖ ద్వారా 36 అంతరాష్ట్ర చెక్పోస్టులు, ఆటవీ శాఖకు సంబంధించి మూడు అంతరాష్ట్ర చెక్పోస్టులు, ఎక్సైజ్శాఖ ఎనిమిది, 224 ఎన్ఫోర్స్మెంట్ బృందాలు, వాణిజ్యపన్నుల శాఖ ద్వారా ఏడు చెక్పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పటిష్టమైన గస్తీని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ సీఎస్ తెలిపారు. తెలంగాణలో తీవ్రవాద ప్రాబల్యం లేదని, ఛత్తీస్గఢ్ నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు జరుగకుండా ఇరురాష్ట్రాలు పోలీసులు, కేంద్ర బలగాలు పటిష్టమైన సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. ఏపీ సీఎస్ జవహర్రెడ్డి మాట్లాడుతూ%ఔ% ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్ సభ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నందున ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు.

# ఆ లేఖ ప్రధాని మోడీ 'ఆర్కెస్ట్రా ప్రచారం' లో భాగం



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి 21 మంది రిటైర్డ్జడ్జీలు రాసిన లేఖ ప్రధాని మోడీ ఆర్కెస్ట్రా ప్రచారంలో భాగమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. న్యాయవ్యవస్థపై ఒత్తిడి, తప్పుడు సమాచారం, బహిరంగంగా అవమానించడం ద్వారా కొన్ని వర్గాలు ఆ వ్యవస్థపై అణచివేత యత్నాలను తీవ్రతరం చేస్తున్నాయని 21 మంది రిటైర్డ్ జడ్జీలు సిజెఐకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా స్వతంత్రంగా వ్యవహరిస్తున్న న్యాయవ్యవస్థను బెదిరించడం, భయపెట్టడమని పేర్కొంది. సోమవారం ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ లేఖపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతకు బిజెపి నుండి వచ్చిన అతిపెద్ద ముప్పుగా పేర్కొన్నారు. లేఖను రాసిన వారి జాబితాలో నాలుగవ పేరును గమనిస్తే.. ఆ లేఖ లక్ష్యం, నేపథ్యం, అంతరార్థం తెలుస్తుందని అన్నారు. ఈ లేఖలో పేర్కొన్న వ్యాఖ్యలు, ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ప్రదాని మోడీపై చేసిన వ్యాఖ్యలు చూస్తే.. ఈ లేఖ ఎవరు పంపారో తెలుస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎం.ఆర్.షా ఈలేఖలో సంతకం చేసిన నాలుగవ వ్యక్తి. ఎలక్టోరల్ బాండ్స్ కుంభకోణంను దేశంలోనే అతిపెద్ద అవినీతి కుంభకోణంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని, మణిపూర్లో రాజ్యాంగ యంత్రాంగానికి విఘాతం కలుగుతోందని స్పష్టంచేసింది. దీంతో సుప్రీంకోర్టును లక్ష్యంగా చేసుకున్నారని జైరాం రమేష్ ధ్వజమెత్తారు. ఇటీవల సుప్రీంకోర్టులోని ప్రముఖ మహిళా జడ్జి నోట్లరద్దును తీవ్రంగా విమర్శించారని అన్నారు. ఇటీవల మోడీ స్నేహితులైన 600 మంది న్యాయవాదులు సిజెఐకి లేఖ రాసినట్లుగానే ఇప్పుడు కూడా మోడీ స్నేహితులైన 21 మంది మాజీ న్యాయవాదులు లేఖ రాశారని అన్నారు. ఇది న్యాయవ్యవస్థ స్వతంత్రతను బెదరించడం, భయపెట్టడమేనని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతకు అతిపెద్ద ముప్పు కాంగ్రెస్ నుండి కాదని, బిజెపి నుండి, ప్రధాని మోడీ నుండి వచ్చిందని అన్నారు.

# ఏపీలో చేపల వేటకు రెండు నెలల బ్రేక్



అమరావతి: సముద్రంలో చేపల వేటపై నేటి నుంచి నిషేధం అమలులోకి వచ్చింది. జూన్ 14 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ నేపథ్యంలో మత్స్య కారులకు రెండు నెలల పాటు విరామం లభించనుంది. మత్స్య సంపద పెరిగే కాలం కావడంతో 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటపై ఏటా ప్రభుత్వం నిషేధం అమలు చేస్తోంది. కాగా ఈ విరామం సమయంలో కుటుంబానికి రూ.10వేలు చొప్పున మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. సముద్రంలో చేపల పునరుత్పత్తి సమయం కావడంతో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బంగాళాఖాతంలో వేటకు విరామం ఇవ్వాలి. ఏటా ఏప్రిల్ 15వ నుంచి నిషేధం అమలు చేస్తున్నారు. తూర్పు తీరంలోని పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకూ సముద్రంలో చేపల వేటపై నిషేధం ఆదివారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తుంది. జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకూ (61 రోజులు) ఇది అమల్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి చేపల వేట నిషేధం అమలుకు పోలీసుల సహకారంతో మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లాలోని మత్స్యకారులు సముద్రంలో వేట ముగించుకుని తమ బోట్లతో ఒడ్డుకు చేరుకున్నారు.

# ఇరాన్‌పై ప్రతిదాడి తప్పదు




టెల్ అవీవ్, టెహ్రాన్, వాషింగ్టన్: పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది! తమ దేశంపై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ జరిపిన దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆ దేశంపై ప్రతిదాడి తప్పదని.. ఇందుకోసం 'ఆపరేషన్ ఐరన్ షీల్డ్' చేపడతామని ఇజ్రాయెల్ రక్షణ బలగాల అధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హాలేవి స్పష్టం చేశారు. నెవిటమ్ వైమానిక స్థావరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. "మా వ్యూహాత్మక సామర్థ్యాలను దెబ్బతీయాలని ఇరాన్ భావించింది. ముందెన్నడూ ఇలాంటిది చోటుచేసుకోలేదు. 'ఐరన్ షీల్డ్' ఆపరేషన్‌కు మేం సిద్ధమవుతున్నాం" అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ శనివారం రాత్రి 300కుపైగా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఏ క్షణంలోనైనా దాడి చేయొచ్చని అమెరికా నిఘా వర్గాలు కూడా అంటున్నాయి. ఇప్పుడు స్పందించకుండా మౌనం వహిస్తే భవిష్యత్తులో ఇరాన్ నుంచి మరింత ముప్పు ఏర్పడే అవకాశం ఉందని టెల్ అవీవ్ ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. ప్రతిదాడి విషయంలో తాము ఇజ్రాయెల్‌ను నిర్దేశించలేమని.. నచ్చిన నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ ఆ దేశానికి ఉందని అమెరికా తెలిపింది.

అమెరికా అండగా నిలవకపోయినా..

అగ్రరాజ్యం అండగా నిలిచినా నిలవకపోయినా.. ఇరాన్‌పై ప్రతిదాడి విషయంలో ముందుకే వెళ్లాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సహా మంత్రిమండలిలో ఎక్కువ మంది భావిస్తున్నారు. ఇదే విషయాన్ని సోమవారం అమెరికా రక్షణమంత్రి లాయిడ్ ఆస్టిన్‌కు చెప్పినట్లు సమాచారం. "మాకు దాడి చేయడం తప్ప మరో మార్గం లేదు" అని ఆస్టిన్‌తో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గలాంట్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ విషయం తేలేవరకు గాజాలోని రఫాపై ఆపరేషన్‌ను నిలిపివేయాలని నెతన్యాహు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రతిదాడికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్ హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడిపై చర్చించేందుకు అత్యవసరంగా సమావేశమైన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. సంయమనం పాటించాలని ఇరుపక్షాలకు ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ విజ్ఞప్తి చేశారు.

దాడి చేస్తామని ముందే చెప్పాం

ఇజ్రాయెల్‌పై దాడి సమాచారాన్ని అమెరికాకు 72 గంటలకు ముందే తెలిపామని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి హుసేన్ అమీర్ అబ్దుల్లా హియాన్ అన్నారు. "పౌర లక్ష్యాలను మేం గురిపెట్టలేదు. వాణిజ్య, జనసమూహ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోలేదు. ఈ దాడి ఇజ్రాయెల్‌ను శిక్షించేందుకు, మమ్మల్ని రక్షించుకునేందుకు తీసుకున్న చర్య. దీని గురించి మేం ముందుగానే అమెరికాకు సమాచారం ఇచ్చాం. మా దాడులు పరిమితంగా ఉంటాయని చెప్పాం" అని వెల్లడించారు. అయితే తమకు ఎలాంటి ముందస్తు సమాచారం అందలేదని అమెరికా పేర్కొంది. "ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. లక్ష్యాలు ఇవి అని కూడా చెప్పలేదు. దాడి ప్రారంభమైన తర్వాతే సమాచారమిచ్చారు" అని పేర్కొంది. ఇరాక్, తుర్కియే, జోర్డాన్ అధికారులు మాత్రం తమకు ముందస్తు సమాచారం ఇరాన్ నుంచి అందిందని తెలిపారు.

జోర్డానే కాదు.. సౌదీ కూడా..

ఇరాన్ దాడి సమయంలో తాము ఇజ్రాయెల్‌కు సాయం చేశామని సౌదీ అరేబియా తెలిపింది. ఇప్పటికే ఈ విషయాన్ని జోర్డాన్ బహిరంగంగానే అంగీకరించింది. శనివారం రాత్రి ఇజ్రాయెల్‌పై ఇరాన్ 300కి పైగా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. వీటిలో కొన్ని ఇరాక్ గగనతలంపై నుంచి వెళితే.. మరికొన్ని జోర్డాన్, సౌదీ గగనతలాల మీదుగా దూసుకెళ్లాయి. తమ గగనతలంపైకి వచ్చిన వాటిని తాము నేలకూల్చామని సౌదీ అరేబియా తెలిపింది.

# ఆరు గ్యారెంటీలే..'హస్తం' అస్త్రాలు..

- మహిళల ఓట్లే లక్ష్యంగా- పార్లమెంట్ ఎన్నికల్లోకి..
- చేవెళ్ల నియోజకవర్గంలో 6 లక్షల దరఖాస్తులు
- వంద రోజులు పాలన రెఫరెండంగా ప్రకటించిన సీఎం రేవంత్
- పాజిటివ్ మౌత్ టాక్ రంజిత్కు కలిసొచ్చే అవకాశం




ఆరు గ్యారంటీలనే అస్త్రంగా హస్తం పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లోకి వెళ్తోంది. రాష్ట్రంలో ఆ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చింది ఈ గ్యారంటీలే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాదాపు అన్నీ గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రణాళికలు చేసింది. చాలా పథకాలు ప్రారంభించింది. ఇలా ప్రారంభించిన వాటిల్లో ముఖ్యంగా లబ్దిదారులు మహిళలే. వీరి కేంద్రంగానే కాంగ్రెస్ పథకాలు అమలు చేస్తోంది. ఇదిలా ఉంటే ఈ పథకాలు కోసం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోనే లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. లబ్ధిపొందిన వారు.. దరఖాస్తులు చేసుకున్న వారంతా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఆరు గ్యారంటీలే తమను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తాయని కాంగ్రెస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ గెలుపు కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోం ది. ఆరు గ్యారెంటీలే లక్ష్యంగా మహిళల ఓట్లను టార్గెట్ చేసింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 'అభయ హస్తం' కింద సుమారు ఆరు లక్షల కుటుం బాలు ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కుటుంబాల్లో మహిళలు సమారు 13 లక్షల మంది ఉంటారు. వీరి ఓట్లే లక్ష్యంగా కాంగ్రెస్ నేత లు వ్యూహాలు పన్నుతున్నారు. ప్రస్తుతం మహిళల చూపు ఆరు గ్యారెంటీల వైపే ఉంది. అసెంబ్లీ ఎన్ని కల్లో కూడా ఆరుగ్యారెంటీల పథకానికి ఆకర్షితులై మహిళలు కాంగ్రెస్ ఓట్లు వేసి గెలిపించారు. అయితే కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారెంటీలలో అమలు చేసిన పథకాలలో మహిళలకు లబ్ది చేకూరేవే ఎక్కువగా ఉన్నాయి. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ. 500లకు సబ్సిడీ గ్యాస్, రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంపుతో మహిళలు కాంగ్రెస్ను ఆదరించే అవకాశాలు ఎ క్కువగా ఉన్నాయి. కుటుంబంలో మహిళలే లక్ష్యం గా కాంగ్రెస్ పథకాలను తీసుకువచ్చింది. ఇంటి బాధ్యతలు మహిళలు చూస్తారు.. వారి కష్టాలు తీర్చే ఉద్దేశంతోనే ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ తీసుకువచ్చినట్టు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. వనితలు తలుసుకుంటే.. ప్రభుత్వా న్ని కూల్చడంలోనూ.. నిలబెట్టడంలోనూ సిద్ధంగా ఉంటారని గ్రహించిన కాంగ్రెస్ మహిళ ఓటర్లను మచ్చిక చేసుకోవడంలో ఆరుగ్యారెంటీల పథకాలతో సక్సెస్ అయినట్టే తెలుస్తోంది. ఇదో జోష్లో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మహిళ ఓటర్లను తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేస్తున్నారు.

వందరోజులు పాలన రెఫరెండం

కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలననే ఈ ఎన్నికల్లో రెఫరెండం అని సీఎం రేవంత్రెడ్డి ప్రకటించారు. ఈ వందరోజుల పాలన చూసి తమ కు ఓటు వేయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ వందరోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజల్లో మంచి అభిప్రాయమే వ్యక్తం అవుతోంది. ఇదే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు కలిసివస్తుందని కాంగ్రెస్ శ్రేణులు దీమా వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్లలో రంజిత్రెడ్డి విజయానికి రాష్ట్ర ప్రభుత్వ ఆరుగ్యారెంటీల పథకాల అమలు, వంద రోజుల పాలనే ఆయుధమని కాంగ్రెస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ ' ఫ్రీ' కలిసొచ్చే అంశం

చేవెళ్ల పార్లమెంట్ అర్బన్, సెమీ అర్బన్ ప్రాం తంగా ఉంటుంది. రాష్ట్ర రాజధాని శివారు ప్రాం తాన్ని అవరించి ఉంటుంది. ఈ ప్రాంతంలో ఉం టున్న వారు ఎక్కువగా హైదరాబాద్లో ఉద్యోగాలు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్న వారు హైదరాబాద్లో నివసిస్తుంటారు. రాష్ట్రంలో ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని ఎక్కువగా వినియో గించుకుంటుంది చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలే. ఉచిత ప్రయాణం వీరికి ఎంతో ఉపయో గంగా ఉంది. వీరంతా కాంగ్రెస్కు వీరాభిమానుల య్యారు. ఎవరూ అవునన్న కాదన్నా వారు కాంగ్రెస్ వైపే మెగ్గు చూపే అవకాశం ఉంది.

# ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ: రేవంత్ రెడ్డి




హైదరాబాద్ : 'పాలమూరు బిడ్డను%ఔ% రైతుబిడ్డను%ఔ% పేదింటి బిడ్డను%ఔ% అలాంటి నేను ముఖ్యమంత్రిని అయితే ఎందుకు ఓర్వలేకపోతున్నారు? ఎప్పుడూ దొరల బిడ్డనే ముఖ్యమంత్రి కావాలా? ఆ తర్వాత మనవడు కావాలా? పాలమూరు బిడ్డ మాత్రం కావొద్దా? మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే శక్తి మాకు లేదా? కాగితాలపై సంతకం చేసే సత్తా మాకు లేదా?' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేటలో ఏర్పాటు చేసిన జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ%ఔ% కాంగ్రెస్ పార్టీలో దొరలకు టిక్కెట్లు ఇవ్వలేదని%ఔ% అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పేదలు, బీసీ కులాలకు టిక్కెట్లు ఇచ్చామన్నారు.

మాదిగలకు ప్రాధాన్యత ఇచ్చాం

అధికారంలో ఉన్నప్పుడు మాదిగలకు అన్యాయం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. మాదిగలకు తమ ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యతను ఇచ్చామన్నారు. వర్గీకరణకు పార్టీని ఒప్పించి బిల్లు పెట్టించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంద కృష్ణ మాదిగను అన్యాయంగా అరెస్ట్ చేస్తే గళమెత్తింది తానే అన్నారు. మక్తల్ నియోజకవర్గంలో ముదిరాజ్ బిడ్డకు టిక్కెట్ ఇచ్చి మనం గెలిపించుకున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ముదిరాజ్ జనాభా పది శాతం ఉందని, కానీ వారికి కేసీఆర్ ఒక్క టిక్కెట్ ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో 14 లోక్ సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ముదిరాజ్లకు మంత్రి పదవి ఇస్తామన్నారు. ముదిరాజ్లను బీసీ డీ నుంచి బీసీ సీకి మార్చాలంటే కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలన్నారు. బంగ్లా రాజకీయాలను కుర్మ, యాదవులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. యాదవ బిడ్డ అనిల్కు తాము రాజ్యసభ ఇచ్చి గౌరవించామన్నారు.

బీఆర్ఎస్తో డీకే అరుణ కుమ్మక్కయ్యారని ఆరోపణ

నారాయణపేట ప్రజలు ఎన్నో ఏళ్లుగా రైలు కూత కోసం ఎదురు చూస్తున్నారని, కానీ ఈ ప్రాంతం నుంచి గతంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఎప్పుడూ రైలు కోసం కేసీఆర్ను అడగలేదని మండిపడ్డారు. ఇక్కడి బీజేపీ నేతలు కూడా ఇదే రైలు కోసం ప్రధాని మోదీని ఎప్పుడూ కలవలేదన్నారు. పాలమూరు - రంగారెడ్డికి ఒక్క పైసా అయినా డీకే అరుణ తెచ్చారా? అని ప్రశ్నించారు. డీకే అరుణ బీఆర్ఎస్తో కుమ్మక్కై రేవంత్ రెడ్డిని ఎలాగైనా ఓడించాలని కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. రూ.600 ఉన్న సిలిండర్ను మోదీ రూ.1200కు పెంచారని ఆరోపించారు. పదేళ్ల మోదీ పాలనలో పాలమూరు ఎండిపోయిందన్నారు.

మంత్రులు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నారు

ఎన్ని కష్టాలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జెండాలు మాత్రం వదలలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ దొరలకు, పెత్తందార్లకు టిక్కెట్ ఇవ్వలేదన్నారు. పేదలకు, బీసీ కులాల వారికి అధిక ప్రాధాన్యతను ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు 35 కోట్ల మంది ఆడపడుచులు ఉచిత బస్సుల్లో ప్రయాణించారన్నారు. వంద రోజుల్లో ఎన్నో హామీలు నెరవేర్చామని పేర్కొన్నారు. 30వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మన మంత్రులు రోజుకు 18 గంటలు పని చేస్తూ కష్టపడుతున్నారన్నారు. కేసీఆర్ వందేళ్ల నాశనం చేస్తే తాము రాత్రింబవళ్లు కష్టపడి సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతలు బీఆర్ఎస్కు ఓటేశారని, ఇప్పుడు బీజేపీకి బీఆర్ఎస్ వేయాలనుకుంటున్నారని ఆరోపించారు. రెండు పార్టీలు చీకటి ఒప్పందం పెట్టుకున్నాయన్నారు. చేవెళ్ల, మల్కాజ్గిరి, సికింద్రాబాద్, జహీరాబాద్, భువనగిరి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ డమ్మీ కార్యకర్తలను పెట్టి బీజేపీకి సహకరిస్తున్నారన్నారు. తన కూతురు కవితను జైలు నుంచి విడిపించేందుకు కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవాన్నిమోదీ వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. మోదీ వద్ద బీఆర్ఎస్ను ఎందుకు తాకట్టు పెట్టారో ఆ పార్టీ కార్యకర్తలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఐదు నియోజకవర్గాల్లో బీజేపీకి ఓటు వేయాలని కేసీఆర్ చెబుతున్నారన్నారు.

ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ: రేవంత్ రెడ్డి

" కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాం. బీసీలకు జనాభా దామాషా ప్రకారం నిధులివ్వాలి. వారికి న్యాయం చేసేందుకే బీసీ కులగణనకు తీర్మానం చేశాం. భారాస ప్రభుత్వం పదేళ్లపాటు ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. కేసీఆర్ పదేళ్లలోనే వందేళ్ల విధ్వంసాన్ని సృష్టించారు. పాలమూరు బిడ్డ, పేదోడి బిడ్డ సీఎం అయితే దొరలు ఓర్వలేకపోతున్నారు. దొరలు మాత్రమే కుర్చీల్లో కూర్చోవాలా? పేద బిడ్డలు కూర్చోవద్దా? కేసీఆర్.. తర్వాత ఆయన కుమారుడు మాత్రమే సీఎం కావాలా? జైలులో ఉన్న బిడ్డను కాపాడుకునేందుకు భారాస పార్టీని మోదీకి తాకట్టుపెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల వద్ద ఉంచారు. భారాస ఓట్లన్నీ భాజపాకి మళ్లించాలని కేసీఆర్ చెబుతున్నారు. వందరోజులకే నన్ను గద్దె దించాలని కేసీఆర్ అంటున్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీని గద్దె దించాలని ఎందుకు అనడం లేదు. ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల మేర రైతు రుణమాఫీ చేస్తాం" అని రేవంత్ అన్నారు.

# సాధారణం కంటే ఎక్కువే...

– రాబోయే రుతుపవనాలపై ఐఎండీ అంచనా



న్యూఢిల్లీ : ఈ ఏడాది రుతపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సానుకూలమైన అంచనానే వెల్లడించింది. దేశంలో రుతుపవనాల కాలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతమే నమోదవుతుందని సోమవారం తన ముందస్తు అంచనాను ప్రకటించింది. ఆగస్టు-సెప్టెంబరు నాటికి లా నినా పరిస్థితులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ వివరాలను ఇక్కడ జరిగిన విలేకరులు సమావేశంలో ఐఎండీ చీఫ్ మృత్యుంజరు మహాపాత్ర వెల్లడించారు. నాలుగు నెలల (జూన్ నుంచి సెప్టెంబరు వరకు) రుతుపవనాల సీజన్లో దేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని, దీర్ఘకాల వర్షపాతం సగటు (87 సెంమీ) యొక్క సంచిత వర్షపాతం 106 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ వర్షకాలంలో హిందూమహాసముద్రంపై పరిస్థితులు మేఘాల కదలికలకు అనుకూలంగానే ఉంటాయని, ఉత్తరార్ధ గోళంలో మంచు కవచం తక్కువగానే ఉంటాయని.. ఇవన్నీ రుతుపవనాలకు సానుకూల అంశాలని చెప్పారు. ప్రస్తుతానికి హిందూ మహాసముద్రంపై ఎల్నినో పరిస్థితులు ఒక మోస్తారుగా నెలకొని ఉన్నాయని, వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి ఇది కొంచెం తగ్గుతుందని, ఆ తరువాత అంటే ఆగస్టు-సెప్టెంబరు నాటికి లా లినా పరిస్థితులు నెలకుంటాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఎల్నినో ఉంటే వేడిగాలులు, లా లినా ఉంటే ఎక్కువ వర్షాలకు అనుకూలంగా ఉంటుంది. గత ఏడాదిలో ఎల్నినో కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. దేశంలో వార్షిక వర్షపాతంలో 70 శాతం వర్షం రుతుపవనాల కారణంగానే కురుస్తుంది. దేశ వ్యవసాయ రంగానికి ఇది ఎంతో కీలకం. అలాగే, మహారాష్ట్రలోని ముంబయి, థానే, రారుగఢ్ జిల్లాల్లో రానున్న మూడు రోజుల్లో తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ మూడు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదయ్యే అవకాశ ఉందని తెలిపింది.

## భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం: అమెరికా




ఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని కలిగిన ఉన్న దేశం భారత్ అని అగ్రరాజ్యం అమెరికా పేర్కొంది. భారత్ ఎల్లప్పుడు తమకు ప్రాముఖ్యతతో కూడిన వ్యూహాత్మక భాగస్వామి అని తెలిపింది. భారత్–అమెరికా సంబంధాలపై యూఎస్ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ సోమవారం మీడియాతో మాట్లాడారు. భారత్‌లో లోక్‌సభ ఎన్నికల వేళ అమెరికా పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో తాజాగా మిల్లర్ చేసిన వ్యాఖ్యలపై ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌లో ప్రజాస్వామ్యం వెనకబాటు తనం, ప్రతిపక్షాలపై అణిచివేత దోరణికి సంబంధించి అమెరికా కీలక వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మీడియా అడిగిన ప్రశ్నకు మిల్లర్ సమాధానం చెప్పారు. 'భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. అమెరికాకు భారత్ చాలా ప్రాముఖ్యతతో కూడిన వ్యూహాత్మకమైన భాగస్వామి. ఇరు దేశాల బంధం సత్యమని నేను ఆశిస్తున్నా'అని మిల్లర్ పేర్కొన్నారు. ఇటీవల కూడా భారత సంబంధాలపై మిల్లర్ స్పందిస్తూ.. భారత్ తమకు(అమెరికా) చాలా ముఖ్యమైన భాగస్వామని పేర్కొన్న విషయం తెలిసిందే. అదేవిధంగా భారత్, అమెరికాల సంబంధాలు ఎప్పుడూ వృద్ధి చెందాలని కోరుకుంటున్నామని తెలిపింది. ఇటీవల సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈడీ అరెస్ట్, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు నిష్పక్షపాతంగా ఓటు వేయడానికి భారత్‌లో సరైన పరిస్థితులు ఉంటాయని ఆశిస్తున్నామని అమెరికా వ్యాఖానించిన విషయం తెలిసిందే. అమెరికా చేసిన వ్యాఖ్యలను భారత్ ఖండించిన సంగతి విదితమే.

## కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీకి సుప్రీం నోటీస్



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ సీఎం కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి సుప్రీం కోర్టు నోటీసు జారీ చేసింది. ఈ నెల 24వ తేదీ లోగా సమాధాన మివ్వాలని ఈడీని ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణ ఈ నెల 29వ తేదీన చేపడతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం సోమవారం పేర్కొంది. సాధ్యమైనంత త్వరగా విచారణ చేపట్టాలన్న అభిషేక్ సింఘ్వి వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధం కాదంటూ ఢిల్లీ హైకోర్టు ఈ నెల 9వ తేదీన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఇలా ఉండగా, ఈ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23వ తేదీ వరకు పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన 15 రోజుల కస్టడీ గడువు ముగియడంతో సోమవారం సీబీఐ, ఈడీ కేసుల ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా వర్చువల్‌గా విచారణ చేపట్టారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. ఇదే కేసులో బీఆర్ఎస్ నేత కె.కవిత తదితర నిందితుల కస్టడీ గడువు కూడా అదే రోజుతో ముగుస్తోందని ఆమె తెలిపారు.

## పదేళ్ల అభివృద్ధి.. ట్రైలర్ మాత్రమే



త్రిసూర్/తిరువనంతపురం/తిరునల్వేలి: గత దశాబ్దాకాలంగా ఎన్‌డీఏ పాలనా కాలంలో దేశం చవిచూసిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాకారంకానుందని ఆయన ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యతనిస్తూ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప పత్రం' విడుదల చేసిన మరుసటి రోజే ప్రధాని మోదీ ఆ హామీలను పునరుద్ఘా టించారు. కేరళలోని కున్నమ్ కులమ్, కట్టకడ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగసభల్లో మోదీ ప్రసంగించారు. రాహుల్‌గాంధీపై పరోక్ష విమర్శలు చేశారు. " కాంగ్రెస్ యువరాజుకు ఉత్తరప్రదేశ్‌లో దశాబ్దాలుగా తమ కుటుంబ గౌరవం(అమేథీ ఎంపీ స్థానం)ను కాపాడే సత్తాలేదుగానీ కేరళకు వచ్చి ఓట్లడుగుతారు. కేరళీయుల ఓట్లడిగే ఆయన సీపీఐ(ఎం) ఏలుబడిలో కరువన్నూర్ సహకార బ్యాంక్‌లో వెలుగుచూసిన కుంభకోణంపై నోరు మెదపరెందుకు? నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా రాజకీయ విభాగం సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు కాంగ్రెస్‌కు ఉంది. ఈ రెండింటి మధ్య చీకటి ఒప్పందం కుదిరింది. కోఆపరేటివ్ బ్యాంక్ స్కామ్‌కు పాల్పడి ప్రజాధనాన్ని లూటీ చేశారు. ఈ మోసంపై నేనే ఈడీ దర్యాప్తు నకు ఆదేశించా" అని అన్నారు.

లెఫ్ట్ ఉంటే అంతా లెఫ్ట్ అయినట్లే

"కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి, అధికార ఎల్‌డీఎఫ్ కూటములు కేరళలో అభివృద్ధికి ప్రతిబంధకాలుగా తయా రయ్యాయి. త్రిపుర, పశ్చిమబెంగాల్, కేరళ ఈ రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీ అధికారంలో ఉందీ అంటే అక్కడ అంతా పోయినట్లే(లెఫ్ట్ అయినట్లే). అక్కడ మంచి అనేదే జరగదు. పశ్చిమబెంగాల్, త్రిపురలో ఏం చేశారని, కొత్తగా కేరళకు చేయడానికి?' అంటూ ధ్వజమెత్తారు.

కచ్చతీవు ఉదంతాన్ని 4 దశాబ్దాలు దాచారు

తమిళనాడులోని తిరునల్వేలిలో జరిగిన సభలోనూ మోదీ ప్రసంగించారు. కచ్చ తీవు ను శ్రీలంకకు ఇచ్చేసి కాంగ్రెస్, డీఎంకే ఈ ఉదంతాన్ని 40 ఏళ్లు దాచిపెట్టాయని మోదీ ఆరోపించారు. అక్కడ తమిళ మత్స్య కారులు తరచూ అరెస్ట్ అవుతున్నారని, ఈ పాపం ఆ పార్టీలదేనన్నారు.

# మళ్లీ తీహార్ జైలుకు కవిత

- 9 రోజుల జ్యుడీషియల్ కస్టడీ- ఇది బీజేపీ కస్టడీ : కవిత
- కోర్టు ప్రాంగణంలో మాట్లాడడంపై స్పెషల్ జడ్జి సీరియస్



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మళ్లీ తీహార్ జైలుకి తరలించారు. ఇప్పటికే ఈడీ కేసులో తీహార్ జైల్లో ఉన్న ఆమెను సీబీఐ కస్టడీకి అనుమతివ్వగా సీబీఐ విచారించింది. కస్టడీ ముగియడంతో సోమవారం సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో కవితను ప్రవేశపెట్టారు. కోర్టు మళ్లీ జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈసారి సీబీఐ దాఖలు చేసిన కేసులో ఆమెకు తొమ్మిది రోజులు కస్టడీ విధిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈడీ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీ ఏప్రిల్ 23 వరకు ఉండటంతో అప్పటి వరకు ఈ కస్టడీ విధిస్తున్నట్లు తెలిపింది. తదుపరి విచారణను ఈనెల 23న చేపడతామని స్పష్టం చేసింది. సీబీఐ స్పెషల్ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజాకు సీబీఐ తరపున సీనియర్ న్యాయవాది పంకజ్ కుమార్ వాదనలు వినిపించారు. కవిత మూడు రోజుల విచారణతో పాటు, కేసు పూర్వాపరాలు, ఎవిడెన్స్, కేసు పురోగతి, ఇతర అంశాలతో మొత్తం 11 పేజీల రిమాండ్ కాపీని కోర్టుకు సమర్పించారు. జ్యుడీషియల్ కస్టడీ అప్లికేషన్లో కీలక అంశాలు పేర్కొంటూ%ొ% విచారణ సమయంలో లిక్కర్ స్కాంకు సంబంధించిన సాక్ష్యాలు, ఆధారాలను కవిత ముందు ఉంచి ప్రశ్నించిన్నట్లు తెలిపారు. కానీ కవిత విచారణకు సహకరించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శరత్ చంద్రారెడ్డి నుంచి తీసుకున్న రూ.14 కోట్ల గురించి కవితను ప్రశ్నించినట్లు తెలిపారు. అలాగే మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, బుచ్చిబాబు, విజరు నాయర్ సహా నిందితులతో జరిగిన సమావేశాల గురించి కవితను ఇంటరాగేషన్ చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కానీ నగదు బదిలీల గురించి కవిత సరైన సమాధానాలు ఇవ్వలేదని, ఉద్దేశపూర్వకంగా తమను తప్పు దోవ పట్టించే సమాధానాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం%ొ% కవితకు 9 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు విడుదల చేసింది. అనంతరం ఆమెను పోలీసులు తీహార్ జైల్ కు తరలించారు.

ఇది బీజేపీ కస్టడీ : కవిత

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం కోర్టు హాల్ నుంచి బయటకు వస్తూ%ొ% 'ఇది సీబీఐ కస్టడీ కాదు. బీజేపీ కస్టడీ. బయట బీజెపోళ్లు మాట్లాడేదే%ొ% లోపల సీబీఐ వాళ్లు అడుగుతున్నారు. రెండేండ్లుగా అడిగిందే అడుగుతున్నారు. కొత్తదేమి లేదు' అని అన్నారు.

కోర్టు ప్రాంగణంలో మాట్లాడడంపై స్పెషల్ జడ్జి సీరియస్

కవిత మీడియా స్టేట్మెంట్లపై ట్రయల్ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజా ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత బెయిల్ పిటిషన్ సందర్భంగా ఆమె న్యాయవాది మోహిత్ రావును ప్రశ్నించారు. మీడియా అడిగితే ఆమె మాట్లాడారని మోహిత్రావు కోర్టుకు నివేదించారు. దీనిపై స్పందించిన జడ్జి %ొ% 'ఆమె ఏం చెప్పాలనుకున్నా, విచారణ సమయంలో సీబీఐకి చెప్పాలి. ఇలా కోర్టు ఆవరణలో మాట్లాడటం మంచిది కాదు' అని వ్యాఖ్యానించారు. ఒకవేళ మాట్లాడాలి అనుకుంటే, కోర్టు బయట మాట్లాడాలి తప్ప, కోర్టు ఆవరణలో, కారిడార్లలో మాట్లాడవద్దని సూచించారు. ఇదే విషయాన్ని కవితకు చెప్పాలని, మోహిత్ రావుకు స్పష్టం చేశారు.

# అంబేద్కర్ దార్శనికతే మార్గం

- దేశంలో వ్యవసాయ సంక్షోభం,నిరుద్యోగానికి పరిష్కారాలు
- ఆయన విధానాలను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు : మేధావులు, సామాజికవేత్తల ఆందోళన




న్యూఢిల్లీ : మోడీ పాలనలో అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలు దేశంలోని ప్రతి రంగాన్నీ తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆ రంగాలపై ఆధారపడేవారి జీవనోపాధిని దెబ్బ తీసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇది దేశ ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలోకి వెళ్లేందుకు కారణమైందని నిపుణులు, మేధావులు అంటున్నారు. ఇలా ప్రతికూలంగా ప్రభావితమై రంగాల్లో వ్యవసాయమూ ఉన్నది. మోడీ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి నిరుద్యోగులుగా మారిన, మారుతున్న యువత కూడా కష్టాలపాలవుతున్నది. దేశంలో వ్యవసాయం సంక్షోభానికి, నిరుద్యోగ సమస్యకు మోడీ సర్కారు, అది అవలంభించిన విధానాలే కారణమని విశ్లేషకులు అంటున్నారు. దేశంలో లక్షలాది మంది రైతులు మోడీ సర్కారుపై ఆగ్రహంతో ఉన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వారు నిరసిస్తున్నారు. పంటలకు కనీస ధర హామీని అన్నదాతలు వినిపించే ప్రధాన డిమాండ్లలో ఒకటి. కానీ, మోడీ సర్కారు మాత్రం రైతన్నల మాట వినటం లేదని మేధావులు, సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఇక ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన మోడీపై నిరుద్యోగ యువత చాలా ఆగ్రహంతో ఉన్నది. మరో మూడ్రోజుల్లో దేశంలో లోక్సభ ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. అయితే, ఈ ఎన్నికల్లో అన్నదాత, యువత నుంచి బీజేపీ సర్కారుకు గట్టి ఎదురుదెబ్బ తాకనున్నదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఇలాంటి సమస్యలకు అంబేద్కర్ దార్శనికతే అసలైన పరిష్కార మార్గాలను చూపిస్తుందని నిపుణులు, మేధావులు అంటున్నారు. ఆర్థికవేత్తగా అంబేద్కర్ దృక్పథం చాలా విలువైనదనీ, పరిష్కార మార్గాలను కోరుకునేవారెవరైనా దీనిపై అధ్యయనం చేయాలని వారు సూచిస్తున్నారు. అయితే, సంఫ్ భావజాలంతో పని చేసే బీజేపీ నుంచి అది ఆశించటం అత్యాశే అవుతుందని చెప్తున్నారు. రాజ్యాంగాన్ని మార్చబోమని మోడీ హామీలు ఇస్తున్నా.. వచ్చే ఎన్నికల్లో ఒకవేళ బీజేపీ వీలైనన్ని ఎక్కువ సీట్లతో కేంద్రంలో అధికారంలో ఉంటే వివాదాస్పద సవరణలు, చట్టాలు, నిర్ణయాలు తప్పక ఉంటాయని దేశ ప్రజలను మేధావులు హెచ్చరిస్తున్నారు. 1918 నాటికి జర్నల్ ఆఫ్ ఇండియన్ ఎకానమీలో అంబేద్కర్ భారత్లోని చెల్లాచెదురుగా ఉన్న, చిన్న పొలాలలో పనిలేకుండా ఉన్న కార్మికుల సమస్యపై సున్నితంగా ప్రస్తావించారనీ, కార్మిక ఆధారిత పారిశ్రామికీకరణను ప్రతిపాదించారని గుర్తు చేస్తున్నారు. దీని ద్వారా భారతదేశ వ్యవసాయ సమస్యకు చక్కని పరిష్కారం లభిస్తుందని చెప్తున్నారు. కార్మిక ఆధారిత పారిశ్రామిక కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా.. వ్యవసాయ కార్మికులను ఆర్థికంగా పరిపుష్టం చేస్తుందని మేధావులు చెప్తున్నారు. ఈ వాదన 1954లో నోబెల్ ప్రైజ్-గెలుచుకున్న ఆర్థికవేత్త ఆర్థర్ లూయిస్ అభివృద్ధి చేసిన ద్వంద్వ రంగ నమూనాను పోలి ఉంటుందని అంటున్నారు. ఇటు నిరుద్యోగం అంశం విషయంలోనూ ఆయన ప్రతిపాదించిన ఉద్యోగాల-కేంద్రీకృత జాతీయ పారిశ్రామిక విధానం భారత్లో నిర్లక్ష్యం చేయబడిందని మేధావులు గుర్తు చేస్తున్నారు. యూఎస్, బ్రెజిల్ వంటి ఇతర దేశాల్లోని నగరాల్లో మాత్రం అంబేద్కర్ విధానం కనిపిస్తున్నదని అంటున్నారు. సామాజిక నిబంధనలు, ఆర్థిక నిర్మాణాలు శ్రమను వెలికితీయటం, వనరుల పంపిణీని ఎలా నిర్దేశిస్తాయనే దానిపై అంబేద్కర్కు లోతైన అవగాహన ఉన్నది. కుల వ్యవస్థ అనేది 'కార్మికుల విభజన' అని, కేవలం శ్రమ విభజన మాత్రమే కాదని కుల నిర్మూలనలో అంబేద్కర్ వాదనను నిపుణులు గుర్తు చేస్తున్నారు. పరిశ్రమ, వ్యవసాయం కోసం అంబేద్కర్ విధానాలు కార్మిక హక్కుల హక్కులను పరిరక్షిస్తాయని అంటున్నారు. ఆయన 1942-46 నుంచి బ్రిటిష్ వైస్రారు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో కార్మిక సభ్యునిగా పరిశ్రమ, వ్యవసాయం రెండింటిలోనూ కనీస వేతనం, తగ్గిన పని గంటలు, ప్రసూతి ప్రయోజనాలు, కార్మికుల పరిహారం, సామాజిక భద్రతా ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులను పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 'ప్రభుత్వ నియంత్రణలో సామూహిక పొలాల రూపంలో సాగు చేయబడిన భూమితో వ్యవసాయాన్ని రాష్ట్ర పరిశ్రమగా అంబేద్కర్ ఊహించారు. అణగారిన కులాలు, మహిళల స్థితిగతులను మెరుగుపరచటానికి ఆయన జీవితకాల నిబద్ధతను పరిగణనలోకి తీసుకోవడంలో ఆశ్చర్యం లేదు. ముఖ్యంగా, ఇది సాధించదగినది' అని మేధావులు, సామాజికవేత్తలు అంటున్నారు. కేరళలో మహిళల నేతృత్వంలోని కుటుంబశ్రీ వ్యవసాయ సముదాయాల విజయంలో అది స్పష్టమైందని చెప్తున్నారు. అణగారిన మహిళలకు భూమి, క్రెడిట్ను గుర్తించటం, సులభతరం చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం చురుకైన పాత్ర పోషించిందని పరిశోధనలు చెప్తున్నాయని అంటున్నారు. అట్టడుగు వర్గాలకు ఎక్కువ యాజమాన్యం, వనరుల నియంత్రణ కోసం అంబేద్కర్ వాదించారని చెప్తున్నారు. 'మన సామాజిక, ఆర్థిక జీవితంలో సమానత్వాన్ని ఎంతకాలం నిరాకరిస్తాము? మనం దానిని చాలా కాలం పాటు నిరాకరిస్తే.. మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేయటం ద్వారానే మనం అలా చేస్తాం' అని అంబేద్కర్ రాజ్యాంగ అసెంబ్లీలో చేసిన ప్రసిద్ధ ప్రసంగాన్ని రాజకీయ విశ్లేషకులు లోక్సభ ఎన్నికల నేపథ్యంలో గుర్తు చేసుకుంటున్నారు. భారత్ ప్రస్తుతం ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయినప్పటికీ.. దేశ రైతులలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. క్షీణించిన నేల, నీటి కొరత, అనిశ్చిత వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవటంలో పోరాడుతూ.. దాదాపు సగం వ్యవసాయ కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ప్రపంచ మేధావి అయిన అంబేద్కర్ ఆలోచనలను ఆది నుంచీ ప్రభుత్వాలు ఆదరించలేదనీ, ఒకవేళ ఆయన ఆశయాలనే పాటించి ఉంటే.. భారత్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు చక్కటి పరిష్కారం దొరికేదని సామాజికవేత్తలు, మేధావులు సూచిస్తున్నారు.

# వాగాడంబరత. అవాస్తవాలు

- చిత్తశుద్ధి లోపించింది
- బీజేపీ మ్యానిఫెస్టోపై కాంగ్రెస్
- ఇచ్చిన హామీలకే దిక్కులేదని ఎద్దేవా ప్రజా సమస్యల ప్రస్తావనేదని నిలదీత



న్యూఢిల్లీ :బీజేపీ ఎన్నికల ప్రణాళికపై ప్రతిపక్ష కాంగ్రెస్ వ్యంగ్యోక్తులు విసిరింది. అందులో వాగాడంబరత ఎక్కువగా ఉన్నదని, అవాస్తవాలతో నిండిపోయిందని, చిత్తశుద్ధి లోపించిందని విమర్శించింది. దానిలో లెక్కించదగిన హామీలు తక్కువగానే ఉన్నాయని తెలిపింది. బీజేపీ మ్యానిఫెస్టోను 'మోడీకీ గ్యారంటీ%ొ%జుమ్లా కీ గ్యారంటీ' (మోడీ గ్యారంటీ వాగాడంబరతకు వారంటీ) అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. గతంలో ఇచ్చిన హామీలనే మోడీ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో గుర్తు చేశారు. అందుకు డజనుకు పైగా ఉదాహరణలు చూపారు. 'రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? స్వామినాథన్ కమిషన్ ఫార్ములాకు అనుగుణంగా కనీస మద్దతు ధరలు కల్పిస్తామని చెప్పారు. ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామన్నారు. అవన్నీ ఏమయ్యాయి?' అని ఖర్గే నిలదీశారు. కాగా ప్రజలను వేధిస్తున్న నిరుద్యోగం, ధరల పెరుగుదలపై బీజేపీ ప్రణాళిక మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ప్రజల బాగోగులకు కీలకమైన అంశాలను చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని ఆయన అన్నారు. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో 76 పేజీలు ఉన్నాయని, అయితే వాటిలో 'ఉద్యోగాలు' అనే ప్రస్తావన కేవలం రెండు చోట్ల మాత్రమే కన్పించిందని కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా ష్రినాటే గుర్తు చేశారు. 'ఏడాదికి 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, అప్రెంటీస్షిప్ కోసం స్టైఫండ్గా ఏటా లక్ష రూపాయల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే బీజేపీ ప్రణాళిక మాత్రం ప్రస్తుత ఖాళీల భర్తీని మాత్రమే ప్రస్తావించింది. ఖాళీలను భర్తీ చేయకుండా అలాగే ఉంచేస్తూ గత దశాబ్ద కాలంగా ఉద్యోగాల కల్పనపై ఎందుకు ఊదరకొడుతున్నారు?' అని ఆమె ప్రశ్నించారు. వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరల అమలుపై చట్టాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వగా ఈ విషయంపై బీజేపీ మౌనం వహించింది. 2022 నాటికి అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2019లో ఇచ్చిన హామీపై కూడా మౌనాన్నే ఆశ్రయించింది. గత పది సంవత్సరాల కాలంలో కనీస మద్దతు ధరలు అసాధారణ రీతిలో పెరిగాయని మాత్రం చెప్పుకుంది. వాటిని ఎప్పటికప్పుడు పెంచుతామని హామీ ఇచ్చింది. ఉగ్రవాదంపై బీజేపీ ప్రణాళికలో చేసిన వాదనను కాంగ్రెస్ కొట్టిపారేసింది. 2014 తర్వాత ఏ ప్రధాన నగరంలోనూ చెప్పుకోదగిన ఉగ్రవాద దాడి జరగలేదని బీజేపీ చెబుతోంది. అయితే పుల్వామా సహా పలు ఉగ్రవాద దాడులను ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది. పది సంవత్సరాల మోడీ పాలనలో ఒక్క జమ్మూకాశ్మీర్లోనే 3,950 మంది ఉగ్ర దాడులకు బలయ్యారని సుప్రియ తెలిపారు. వీరిలో భద్రతా సిబ్బంది,ౌరులు ఉన్నారని అంటూ దేశంలో ఉగ్రవాదాన్ని అంతం చేశామంటూ బీజేపీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో మణిపూర్ను ప్రస్తావించకపోవడాన్ని కూడా కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈశాన్య రాష్ట్రాల గురించి ప్రస్తావించిన బీజేపీ, మణిపూర్ గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. న

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

## నాటకం.. మన చరిత్ర వారసత్వం

### (విశ్లేషణ)

తెలుగు నాటక రంగం, రంగుల వెలుగుల్లో రమ్య సన్నివేశాలు, కథల జాలంలో జీవన సత్యాలు. నవ్వులు, కన్నీళ్లు, భావోద్వేగాల తుఫాను. తెలుగు నాటక రంగం ఒక అద్భుత లోకం, ఒక అద్వితీయమైన కళ. తెలుగు నాటక రంగం ఒక గొప్ప చరిత్ర, సుసంపన్న సంప్రదాయం కలిగినది. శతాబ్దాలుగా, ఇది తెలుగు ప్రజలకు వినోదం, విద్య, సామాజిక స్పృహ అందించింది. నాటకం ఒక శక్తివంతమైన సాధనం. నాటకం సమాజంలోని ముఖ్యమైన సమస్యలను పరిశీలించడానికి మరియు చర్చించడానికి ఉపయోగించబడుతుంది. దశాబ్దాలుగా ఇది సాంఘిక సందేశాలను అందించడానికి, ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి, వినోదం పంచడానికి ఒక శక్తివంతమైన సాధనంగా ఉంది. తెలుగు నాటక రంగం ఒక గొప్ప సుసంపన్న సంప్రదాయం కలిగిన ఒక జీవకళ. ఇది సామాజిక సమస్యలను పరిశీలించడానికి నైతిక విలువలను బోధించటానికి, ప్రేక్షకులను ఆనందించడానికి ఒక శక్తివంతమైన మాధ్యమం గా ఉంది. తెలుగు నాటకం మూలాలు ప్రాచీన కాలానికి చెందినవి. యక్షగానం, భాగవతం వంటి జానపద నాటక రూపాలు శతాబ్దాలుగా ప్రజలను అలరించాయి.

**ఆధునిక రచయితల కథలతో..**

19వ శతాబ్దంలో, పాశ్చాత్య నాటక ప్రభావంతో, తెలుగు నాటకం ఒక కొత్త మలుపు తిరిగింది. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి ప్రముఖ రచయితలు ఆధునిక తెలుగు నాటకానికి పునాదులు వేశారు. వారి రచనలు సామాజిక సంస్కరణలకు పిలుపునిచ్చాయి. తెలుగు నాటకానికి కొత్త దిశను చూపించాయి. నేడు, తెలుగు నాటక రంగం చాలా వైవిధ్యంగా ఉంది. ప్రయోగాత్మక నాటకాల నుండి వీధి నాటకాల వరకు, అనేక రకాల నాటకాలు ప్రదర్శించబడుతున్నాయి. నేడు సినిమా, టెలివిజన్ వంటి ఇతర మీడియా ద్వారా కూడా ప్రజలను చేరుకుంటోంది. 20, 21 శతాబ్దాల్లో తెలుగు నాటక రంగం మరింత వైరుధ్యవంతంగా మారింది. రాజకీయ నాటకాలు హాస్య నాటకాలు సామాజిక నాటకాలు అంటే అనేక రకాల నాటకాలు వెలుగు చూశాయి. గుర్రం జస్టిస్, బాలాజీ, శివ కామేశ్వరరావు, వంటి ప్రముఖ నాటక రచయితలు, నటులు ఈ కాలంలో తెలుగు నాటక రంగానికి ప్రాణప్రదమైన సహకారం అందించారు. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, తిరుపతి వేంకట కవులు, పి ఎస్ ఆర్ అప్పారావు, వి.వి.ఎస్. రాజు, గిరీష్ కర్నాడ్ వంటి నాటక రచయితలు మా యవ్వనం, కన్యాశుల్కం, సత్య హరిశ్చంద్ర, నాటకం, మయూర భంగం, కురుక్షేత్రం, మిణుమిణుకులు, హైదరాబాద్ నవాబులు వంటి ప్రముఖ నాటకాలు అందించారు.

**తొలి నాటకకర్త..**

మరీ ముఖ్యంగా కందుకూరి వీరేశ లింగం పంతులు, ఉపాధ్యాయుడిగా, రచయితగా, సంఘసంస్కర్తగా, నాటక రచయితగా వివిధ పాత్రలో రాణించారు. తెలుగులో మొదటి నవల రాజశేఖర్ చరిత్ర రచయితగా ప్రసిద్ధి చెందారు. ఆంధ్ర పత్రిక అనే మొదటి తెలుగు వార్తాపత్రికను స్థాపించి, స్త్రీ విద్య వితంతు వివాహాలు బాలిక వివాహ నిరోధం వంటి సామాజిక సంస్కరణలకు కృషి చేశారు. హిందూ సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను కుల దురాచారాలను నిర్మూలించడానికి అనేక నాటకాలను రచించి మరీ ముఖ్యంగా తెలుగు నాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి పథంలో నడిపించిన మహనీయుడు. తెలుగు సాహిత్యానికి, తెలుగు నాటక రంగానికి అద్భుతమైన సేవలను అందించి సమాజంపై చెరగని ముద్రవేశారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించడం జరిగింది.

**నాటక కళలను ప్రోత్సహించండి..**

ప్రస్తుత పరిస్థితుల్లో నేడు తెలుగు నాటక రంగం కొత్త సవాలను ఎదుర్కొంటుంది. టెలివిజన్, యూట్యూబ్ ఛానల్స్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్, సినిమా వంటి ఇతర వినోద మాధ్యమాల పెరుగుదల వల్ల నాటక రంగ ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. అయితే ఇంకా చాలామంది నాటక కళాకారులు ఈ కళను జీవంగా ఉంచటానికి కృషి చేస్తున్నారు. చిన్న నాటక సంస్థలు ప్రయోగాత్మక నాటకాలను ప్రదర్శిస్తున్నాయి, యువ నాటక రచయితలు కొత్త కథలను అన్వేషిస్తున్నారు. ప్రభుత్వం కూడా నాటక కలలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటుంది. తెలుగు నాటక రంగం తెలుగు సంస్కృతిలో ఒక అద్వితీయమైన అంశం. నాటక రంగం ఒక శక్తివంతమైన సాధనం కూడా. ఈ గొప్ప వారసత్వాన్ని కాపాడుకోవడానికి మరియు ముందుకు తీసుకు వెళ్ళడానికి రాజకీయ మరియు సినిమా రంగాలు కలిసి నాటక రంగాన్ని ప్రోత్సహించాలి.తెలుగు నాటక రంగం, మరింత అభివృద్ధి చెందాలి, ప్రపంచ వేదికలపై, తెలుగు నాటకం జెండా ఎగరాలి. కళాకారులకు మద్దతు, ప్రేక్షకుల ఆదరణ తెలుగు నాటక రంగ సువర్ణ యుగాన్ని మళ్లీ సృష్టించాలని కోరుకుందాం.

# మండుటెండల మరణాలను ఆపలేమా?



దక్షిణాసియాలోని దేశాల్లో భారతదేశం మండు టెండల మరణాల్లో అగ్రస్థానంలో ఉందని వచ్చిన ఒక అంతర్జాతీయ అధ్యయనం ఆందోళన కలిగిస్తోంది. 2019లో 33 వేలమంది కేవలం తీవ్రాతితీవ్రమైన ఎండల కారణంగానే చనిపోయారని చైనా నుంచి వెలువడిన ఆ నివేదిక తెలియజేసింది. ఉష్ణోగ్రతల్లో వస్తున్న అసాధారణ మార్పుల వల్ల ఎండలు మనిషి భరించలేని స్థితికి చేరడం చావులకు దారి తీస్తున్నదని ఆ నివేదిక విశ్లేషించింది. చైనాలోని జింగియా ఆస్పత్రికి చెందిన క్వాన్ చెంగ్ నేతృత్వంలో ఎండలపై ప్రపంచంలో మూడు దశాబ్దాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు, చావులపై నిర్వహించిన పరిశోధనల్లో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా పేరున్న వైద్య పత్రికల్లో ఒకటైన న్యూరాలజీ జర్నల్‌లో పరిశోధన ఫలితాలు ప్రచురించారు. ఇవి ఒక భారత్‌నే కాకుండా ప్రపంచాన్ని కూడా మేల్కొలిపాయి. జబ్బులతో కాకుండా చివరకు వాతావరణంలో వచ్చే మార్పులతో సంభవించే మరణాలను నియంత్రించే ఆధునిక వైద్య విధానాలను పరిశోధకులు కనుగొని మానవాళికి అందించాలని ఆ నివేదిక సూచించింది. భారతదేశంలో 2019లో 33 వేల మంది అసాధారణ ఎండలతో చనిపోతే, ఇందులో 18 వేల మంది (55 శాతం) సాధారణం కంటే అత్యధికంగా ఎండ వేడి కారణంగా మరణించారని, మరో 15 వేల మంది (45 శాతం) ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువకు పడిపోవడం మూలంగా చనిపోయారని నివేదిక వివరాలు వెల్లడించాయి. ఎండ వేడి చావులకు ఎక్కువగా పురుషులు బాధితులవుతున్నారని నివేదిక పేర్కొనడం గమనార్హం. ప్రపంచంలోని 204 దేశాలు, ప్రాంతాల్లో పరిశోధనను నిర్వహించారు. దక్షిణాసియాలో భారత్‌పై ప్రభావం ఎక్కువగా ఉండగా, అత్యధికంగా మధ్య ఆసియాలో ఎండ మంటలకు జనం పిట్టల్లా రాలిపోతున్నారని పరిశోధన వివరాల్లో వెల్లడైంది. లక్షమంది పురుష జనాభాలో 7.7 శాతం ఎండలకు బాధితులవుతుండగా, మహిళలకు లక్ష జనాభాకు 5.9 శాతంగా ఉన్నది. అదే మధ్య ఆసియాలో లక్ష జనాభాకు 18 శాతం ప్రజలు ఎండలకు మాడిపోతున్నారని నివేదిక పేర్కొన్నది. నివేదికలోని అంశాలు భూతాపాన్ని అరికట్టడం కూడా పాలకుల ఎజెండాలో అగ్ర భాగానికి చేర్చాల్సిన అనివార్య పరిస్థితిని తెలియజేస్తున్నది. ఇప్పటివరకు వాతావరణ మార్పుల్లో అసమతుల్యతను పాలకులు తీవ్రమైన అంశంగా గుర్తించడం లేదు. ప్రపంచమంతటా భూగోళం ప్రతి ఏటా ఒళ్ళు గగుర్పొడిచేలా వేడవుతున్నా దానిని నియంత్రించే విధానాలు రూపు దాల్చడం లేదు. ఈ ఎండ మంటలు కూడా ఒక్కో దేశంలో ఒక్కో నెలలో ఒక్కో రూపంలో ఉంటున్నాయి. వాతావరణ సమతుల్యతకు సంబంధించి ఏ దేశానికాదేశం అక్కడి పరిస్థితులకు అనుగుణంగా విధానాలు యుద్ధ ప్రాతిపదికన రూపొందిస్తే తప్ప ఎండ మంటల మరణాలు ఆగవు.



భారతదేశంలో ఏప్రిల్, మే, జూన్ 10 దాకా ఎండలు మండుతాయి. కాని ఈ మధ్య కాలంలో ఈ ఎండలు ఫిబ్రవరి నుంచే మండుతున్నాయి. ఏప్రిల్ నెలలో ఇప్పటికే 45 డిగ్రీల ఫ్యారెన్ హీట్‌ను దాటడంతో జనం అల్లాడిపోతున్నారు. మే నెలలో 50 డిగ్రీలకు ఎండలు పెరుగుతాయనే వాతావరణ శాఖ అంచనాలు వింటేనే బెంబేలెత్తే పరిస్థితి కనిపిస్తున్నది. మే నెల ఎండల గండాన్ని ఎలా తప్పించుకోవాలని అంతా శీతల ప్రదేశాలకు వెళ్ళిపోయే పరిస్థితి కనిపిస్తున్నది. వాతావరణ అసమతుల్యత అసాధారణ స్థాయికి చేరడానికి మనుషుల చర్యలే తప్ప మరో కారణం కాదు. దేశమంతటా పచ్చదనాన్ని పెంచడానికి బదులు స్వార్థ ప్రయోజనాల కోసం తుంచుతున్నారు. పల్లెల్లోని గల్లీల నుంచి ఢిల్లీ దాకా పచ్చదనం శాతం రోజురోజుకూ తగ్గడమే తప్ప పెరిగిన దాఖలాలు లేవు. దీనికితోడు వాయు కాలుష్యం అగ్నికి ఆజ్యంలా తోడై మనుషుల ఆయుః ప్రమాణాలను తెగ్గోస్తున్నది. ఎండల్లో పని కోసం వెళ్ళిన వారు వడగాడ్పుల దెబ్బకు ఎక్కడ పడిపోతారో తెలియని పరిస్థితి నెలకొన్నది. దేశమంతటా గ్రీనరీ శాతం పెరిగితే తప్ప వాతావరణంలో అసాధారణ మార్పులను ఆపలేని దయనీయ పరిస్థితి కనిపిస్తున్నది. పట్టణీకరణ, ఆకాశ హర్మ్యాలను అభివృద్ధికి సూచికలుగా పాలకులు చూపిస్తున్నారు. కాని అక్కడ ఎంత శాతం గ్రీనరీ ఉంది అనేది చెప్పడం లేదు. అసలు గ్రీనరీ ఛాయల్లేని పట్టణాలు, గ్రామాలు ఎన్నో ఉన్నాయి. నిర్మాణాలకు నిర్దేశిత శాతం గ్రీనరీ ఉంటే తప్ప అనుమతులు ఇవ్వమనే విధానాలు పట్టణ ప్రణాళికల్లో చోటు చేసుకోకుంటే మండు టెండల మంటలు ప్రమాద ఘంటికలను మోగిస్తూనే ఉంటాయి. ప్రపంచంలో ఎండ వేడిమితో మూడు దశాబ్దాల్లో 5 లక్షల 20 వేల మంది చనిపోవడమో, రోగగ్రస్థులు కావడమో జరిగిందన్న నివేదికను చదివిన తర్వాతనైనా పాలకుల్లో మార్పు రావాలని ఆశిద్దాం.

# ఆటపాటలే పిల్లలకు గెలుపు బాటలు

కోపం, ఆవేశం, బాధ లాంటివి కలిగినా అవన్నీ ప్రక్కనపెట్టి సర్దుకొని ఆటలు ఆడవ లసినదేనని, గెలుపు ఓటములు సహజమని, ఎవరూ నేర్పకుండానే వారికి అలవడుతాయి. ప్రతి ఆటకు వేరువేరు నియమాలు ఉంటా యని, వాటిని తప్పకుండా పాటిస్తేనే ఆటలు ఆడగలమని అప్రయత్నంగానే చిన్నారులు నేర్చుకుంటారు. మార్కెట్‌లో తక్కువ ధరలో దొరికే మెదడుకు మేత ఆటలు, పజిల్స్ తయారు చేయడం, సుడోకు నింపడం, రూబిక్ క్యూబ్ కలపడం, తికమక ఆట వస్తువులు, కలర్ బ్రిక్స్ లాంటివి చిన్నారులకు అందుబా టులో ఉంచి నేర్పించడం వల్ల సమయాన్ని సద్వినియోగ పరుచుకుంటూ ఏకాగ్రతను పెంచుకోగలుగుతారు. వేసవి సెలవులు అంటే చిన్నారులకు ఎంతో ఇష్టం. ఎంత సేపూ మొబైల్ ఫోన్లలో గేమ్స్, టివిలో సినిమాలు కాకుండా చిన్నారులకు ప్రత్యేకంగా ఏమైనా నేర్పించవచ్చని ఆలోచించండి. తల్లిదండ్రులారా మీ పిల్లలకు ప్రత్యేక, వినూత్న ఆలోచనలు కలిగేలా ప్రోత్సహించండి. ‘బాల్యపు ఆనందాలను వేసవి సెలవుల్లో ఇంట్లో తల్లిదండ్రులు, పెద్దలు చిన్నారులకు అందించడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా పూర్వప్రాథమిక విద్య నేర్చుకొనే పిల్లల నుండి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే వయసున్న చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం ఎంతైనా అవసరం. కాబట్టి ఈ రెండు నెలలు ప్రణాళిక బద్ధంగా చిన్నారులతో గడుపుచు వారికి ఆనందాన్ని, విజ్ఞానాన్ని అందించండి. దీనికి మీరు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాల్సి అవసరం ఏమి లేదు. మీ ఇంట్లో మీ పిల్లలతో ఆడుతూ%ొా% పాడుతూ నేర్పించవచ్చు.



**మీరేమీ చేయవచ్చు**

పిల్లల్లో చదువుతో పాటు సృజనాత్మకత పెంచడానికి వివిధ ప్రక్రియలు పెంపొందించవచ్చు. బొమ్మలు వేయడం నేర్పాలని అనుకుంటే కలర్ పెన్సిల్స్, క్రేయన్స్, కొన్ని వాటర్ కలర్స్ ఉంటే చాలు. నచ్చిన బొమ్మ గీయడం, గీతలతో బొమ్మలు, నమూనాలు, సున్నాలతో బొమ్మలు, రంగులు వేయడం, వస్తువులను చూసి బొమ్మలు గీయడం, మట్టితో బొమ్మలు, అగ్గిపుల్లను అతికిస్తే బొమ్మ, చేతి గాజు ముక్కలతో బొమ్మలు, ఇసుక అంటించి బొమ్మలు వేయడం, పప్పులు, ధాన్యాలు అతికించి బొమ్మలు, పెన్సిల్ చెక్కతో బొమ్మలు ఇలా ఇంట్లో ఉన్న రకరకాల పదార్థాలతో, వ్యర్థాలతో ప్రతి దానికీ అర్థాన్ని కల్పిస్తూ నేర్పించ వచ్చు. ఇలా చేయడం వల్ల చిన్నారుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. దీని వల్ల మంచి ఆలోచన విధానం పెరిగి, తమ తోటి పిల్లలతో వారు రూపొందించిన చిత్రానికి కథ, మాటలు అల్లి వారి భాషలో వ్యక్తీకరిస్తారు. మనము ఊహించిన దాని కంటే వినూత్నంగా వారు వాటి గురించి చెప్పగలుగుతారు.

**ఇవి నేర్పించవచ్చు**

ఇంకా మిగిలిన సమయాల్లో పిల్లలకు భారత, భాగవత, రామాయణ, పంచతంత్ర కథలు చెప్పండి, వారితో తిరిగి చెప్పించండి. ఇలా చేయడం వల్ల వారిలో ధారణశక్తి పెరిగి స్పష్టంగా మాట్లాడడం, తప్పులు లేకుండా, భయం లేకుండా మాట్లాడడం అలవాటు అవుతుంది. సుమతీ శతకం, వేమన శతకం లాంటి శతకాల నుండి నీతి పద్యాలు నేర్పించండి. వారు వినేలా, తిరిగి చెప్పేలా చూస్తే వారు ఉత్సాహంగా నేర్చుకుంటారు. రాగయుక్తంగా పాడడం వల్ల వారు పాటలు పడడం అంటే ఇష్టపడే అవకాశం ఉంది. చిన్నారులు ఒకసారి ఇటు వైపు ఆలోచించడం మొదలు పెడితే ఇక వారికి కాలమే సరిపోదు. మీరు కేవలం పరిశీలకులుగా మాత్రం ఉంటే చాలు. ఇలా చేయడం వల్ల వారిని ఉన్నతులుగా ఎదగడానికి అవకాశం కల్పించిన వారు అవుతారు. అంతేకాక చిన్నారులను అన్ని రంగాల్లో ప్రోత్సహించిన వారు కూడా అవుతారు.

**ఇవి ఆడించవచ్చు**

మీ తీరిక వేళల్లో ఇంట్లో కూర్చొని ‘మరుగున పడనున్న’ గ్రామీణ ఆటలను నేర్పించవచ్చు. పులి మేక, పచ్చీసు, గవ్వలాట, అష్ట చెమ్మ, కచ్చకాయలు, కైలాసం లాంటి ఆటలు ఆడే విధానం ఒకసారి నేర్పిస్తే వారు ఆడుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల ఆట నియమాలు, గెలుపు ఓటములు సమంగా స్వీకరించడం, గెలవడానికి ప్రయత్నించడం నేర్చుకుంటారు. ఆటలాడుతూ పెరిగిన పిల్లలు ఓటమికి అతిగా కుంగిపోవడం గాని, ఒక్క గెలుపుతో ఇక చెయ్యాల్సింది లేదన్నట్టు ఉండడం గాని చెయ్యరు. ఆటలలో ప్రతి చిన్న వ్యక్తిగత విజయం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతు, చదువులలో నెమ్మదిగా ఉండే పిల్లలకు తన నైపుణ్యానికి జట్టులో లభించే గుర్తింపు వల్ల ఆత్మగౌరవం పెరిగి చదవడంలో ఆసక్తి పెంచుకుంటాడు.





**వీటిని తయారు చేయించవచ్చు**

ఇంట్లో ఉండే చిత్తు పేపర్స్‌తో పాము, తరాజు, పంచపాల, తుపాకీ, జల్లెడ, చొక్కా, కేమెరా, గులాబీ పువ్వు, పూలబుట్టి, రాకెట్, పడవ, కత్తి పడవ, తల, ఇల్లు లాంటి ఎన్నో రకాల బొమ్మలు తయారు చేయడం కూడా నేర్పించవచ్చు. దీనికి మీరు కేవలం అతికించడానికి గమ్, కొన్ని రంగు కాగితాలు, పాత దినపత్రికలు అందుబాటులో ఉంచితే చాలు. మీరు ఊహించని బొమ్మలు కూడా తయారు చేసి మీకు బహుమతిగా ఇస్తారు. పిల్లల్లో సహజంగా ఉన్న తెలివి తేటలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అందుకే మీ పిల్లలకు మీరు మంచి నడవడికతో పాటు సృజనాత్మకత పెంచే అన్ని సహజసిద్ధ ఆటలు, పనులు నేర్పించండి.

**ఇవి నేర్చుకుంటారు**

కోపం, ఆవేశం, బాధ లాంటివి కలిగినా అవన్నీ ప్రక్కనపెట్టి సర్దుకొని ఆటలు ఆడవలసినదేనని, గెలుపు ఓటములు సహజమని, ఎవరూ నేర్పకుండానే వారికి అలవడుతాయి. ప్రతి ఆటకు వేరువేరు నియమాలు ఉంటాయని, వాటిని తప్పకుండా పాటిస్తేనే ఆటలు ఆడగలమని అప్రయత్నంగానే చిన్నారులు నేర్చుకుంటారు. మార్కెట్‌లో తక్కువ ధరలో దొరికే మెదడుకు మేత ఆటలు, పజిల్స్ తయారు చేయడం, సుడోకు నింపడం, రూబిక్ క్యూబ్ కలపడం, తికమక ఆట వస్తువులు, కలర్ బ్రిక్స్ లాంటివి చిన్నారులకు అందుబాటులో ఉంచి నేర్పించడం వల్ల సమయాన్ని సద్వినియోగ పరుచుకుంటూ ఏకాగ్రతను పెంచుకోగలుగుతారు. నాటి కాలంలో పిల్లలకు అన్నం తినిపించాలంటే ఇంట్లో నుండి చిన్నారులని వాకిట్లోకి లేదా ఆరుబయటకు తీసుకు వెళ్లి చందమామను చూపించడమో లేదా పాట పాడుతూ ప్రకృతి దృశ్యాలు చూపిస్తూ గోరుముద్దలు తిని పించేవారు. కానీ నేటి కాలంలో అలా జరగడం లేదు. ఆకాశాన్ని, ప్రకృతిని చూపించే తీరికా లేదు. పాట పాడుతూ తినిపించేటంత ఓపిక లేదు. అందుకు వారు ఎంచుకున్న మార్గం ‘పిల్లల చేతిలో సెల్ ఫోన్ పెట్టడం పిల్లవాడి నోట్లో ముద్ద పెట్టడం’ అనే టెక్నిక్‌ను వాడుకున్నారు. తల్లిదండ్రులకూ కావలసింది పిల్లవాడు తినడం మాత్రమే. పిల్లవాడికి కావలసినది మొబైల్ ఫోన్ మాత్రమే. అసలు పిల్లవాడు ఏమి చేస్తున్నాడో, ఏమి తింటున్నాడో, ఎంత తింటున్నాడో ఎవరికీ తెలియదు. ఈ పద్ధతికి అలవాటైన పిల్లలు సెల్ ఫోన్ చేతిలో పెట్టి బొమ్మలు చూపితే గానీ అన్నం తినము అనే స్థాయికి చేరుకున్నారంటే వారిని ఏ స్థాయికి తీసుకు వచ్చామో తల్లిదండ్రులు గమనించాలి. అందుకే చిన్నారులతో ఎక్కువ సమయం గడుపుచు, కొత్త కొత్త విషయాలు నేర్పిస్తూ, సృజనాత్మకత పెరిగేలా వివిధ ప్రక్రియలు నేర్పిస్తూ ఈ వేసవి సెలవులు ఉపయోగించుకొని ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం మీ చేతిలోనే ఉందని గుర్తిస్తారని, నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులని, అలాంటి ఉత్తమ పౌరులుగా మీ చిన్నారులను తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను.

# ఎండ వేడికి గుండె జాగ్రత్త!




గుండెజబ్బు ముప్పు కారకాలనగానే అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు వంటివే గుర్తుకొస్తాయి. అధిక ఉష్ణోగ్రత ప్రభావమూ తక్కువేమీ కాదు. ఇది రోగనిరోధక వ్యవస్థకు చేటు చేస్తుందని.. ఫలితంగా వాపు ప్రక్రియ పెరిగి, గుండెరక్తనాళాల ఆరోగ్యం దెబ్బతింటుందని తాజా అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి. వేసవిలో అధిక వేడి మూలంగా వడదెబ్బ, నిస్త్రాణ, పిక్కలు పట్టే యటం, తలనొప్పి, చర్మం కమలటం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. అ్యతే ఇవే కాదు.. ఇతరత్రా సమస్యల ముప్పూ పొంచి ఉంటుంది. ఉదాహరణకు- గుండెజబ్బులు. అప్పటికే గుండె జబ్బులతో బాధపడుతుంటే తీవ్రమవుతాయి కూడా. ఇంతకీ వేడికీ గుండెకూ ఏంటీ సంబంధం? వాపు ప్రక్రియే. గుండెజబ్బుల విషయంలో అధిక వేడిని అంతగా పట్టించుకోరు గానీ ఇదీ ముఖ్యమైన ముప్పు కారకమేనని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ డేనియల్ డబ్ల్యూ. రిగ్స్ చెబుతున్నారు. వేసవిలో ఎండ ప్రభావానికి గురైనవారి రక్తంలో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) సూచికల మోతాదులు పెరుగుతున్నాయని వివరిస్తున్నారు. అలాగే ఇన్‌ఫెక్షన్లతో పోరాడే బి కణాల సంఖ్య తగ్గటమూ గమనార్హం. రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యాలూ తగ్గుతున్నాయనటానికి ఇది నిదర్శనం. ఇన్‌ఫెక్షన్లు, గాలి ద్వారా వ్యాపించే జబ్బుల వ్యాప్తికి ఉష్ణోగ్రత, తేమ దోహదం చేస్తాయి. అంటే అధిక ఉష్ణోగ్రత ప్రభావంతో ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశమే కాకుండా వాపు ప్రక్రియతో ముడిపడిన గుండె జబ్బుల వంటి సమస్యల ముప్పూ పెరుగుతుందన్నమాట.

## నెలసరి నిలిచిందా గుండె మరింత జాగ్రత్త!



నెలసరి నిలిచిన (మెనోపాజ్) తర్వాత ఆడవారిలో గుండె ఆరోగ్యం ఊహించిన దాని కన్నా వేగంగా క్షీణిస్తున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. సాధారణంగా మగవారితో పోలిస్తే ఆడవారికి చిన్నవయసులో గుండెపోటు ముప్పు తక్కువ. కానీ నెలసరి నిలిచిన తర్వాత మగవారితో సమానంగా ముప్పు పొంచి ఉంటుందని నిపుణులు చెబుతుంటారు. అయితే దీని కన్నా చాలా ఎక్కువగా ముప్పు పెరుగుతున్నట్టు ఇప్పుడు బయటపడింది. గుండెజబ్బు ముప్పు కారకాలు గల మగవారిని, నెలసరి నిలిచిన మహిళలను ఎంచుకొని పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. వీరంతా కొలెస్ట్రాల్‌ను తగ్గించే స్టాటిన్స్ వాడుతున్నవారే. గుండె రక్తనాళాల్లో ఎంత క్యాల్షియం పోగుపడిందో తెలిపే స్కోరును పరిశీలించగా.. మగవారిలో కన్నా నెలసరి నిలిచిన మహిళల్లో సగటున రెండు రెట్లు ఎక్కువగా ఉంటున్నట్టు బయటపడింది. నెలసరి నిలిచిన తర్వాత వీరిలో గుండె ఆరోగ్యం చాలా వేగంగా క్షీణిస్తున్నట్టు ఇది తెలియజేస్తోంది. తీవ్ర గుండె సమస్యల విషయంలో వీరికి స్టాటిన్స్ తగినంత రక్షణం కల్పించటం లేదని ఫలితాలు సూచిస్తున్నాయి. ఇంతకీ నెలసరి నిలిచిన తర్వాత ఆడవారిలో పూడికలు ఏర్పడే వేగం ఎందుకు పెరుగుతోంది? చాలావరకూ ఈస్ట్రోజెన్ మోతాదులు వేగంగా తగ్గటమే. స్త్రీ హార్మోన్‌గా భావించే ఈస్ట్రోజెన్ లైంగిక పరమైన అంశాల్లోనే కాకుండా ఇతరత్రా పనుల్లోనూ పాలు పంచుకుంటుంది. రక్తనాళాలు విప్పారేలా చూడటం వీటిల్లో ఒకటి. ఇలా అధిక రక్తపోటు ముప్పును తగ్గిస్తుంది. అంతేకాదు.. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పోగు పడకుండా, గట్టిపడకుండా కాపాడుతుంది. విశృంఖల కణాలనూ నిర్వీర్యం చేసి వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తలెత్తకుండా చూస్తుంది. నెలసరి నిలిచిన తర్వాత ఈస్ట్రోజన్ మోతాదులు తగ్గటం వల్ల ఇలాంటి రక్షణలన్నీ కొరవడతాయి. కొవ్వు కణజాలం, బరువు పెరగటం.. జీవక్రియల వేగం తగ్గటం, నిద్ర అస్తవ్యస్తం కావటం వంటివీ పొడసూపుతాయి. నిజానికి ఈ విషయం చాలాక్రితమే తెలిసినా ఎంతోమంది మహిళలకు దీని గురించి తెలియదనే చెప్పుకోవాలి. పూడికలు ఏర్పడే వేగం రెట్టింపు అవుతుందనే సంగతి ఇప్పుడు తేలటం మరింత ఆందోళన కలిగిస్తోంది. అందువల్ల గుండెజబ్బు ముప్పు కారకాలు గల పెద్దవయసు మహిళలు ఒక్క స్టాటిన్స్ మీదే ఆధారపడకుండా క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, కొవ్వు పదార్థాలు తగ్గించుకోవటం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవటం, ఒత్తిడి తగ్గించుకోవటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## చర్మంలో పార్కిన్సన్స్ గుట్టు



తల, చేతుల వంటి భాగాలను వణికించే.. నడక, చురుకుదనాన్ని తగ్గించే పార్కిన్సన్స్ జబ్బును, దీంతో ముడిపడిన సమస్యలను చిన్న చర్మం ముక్క పరీక్షతో గుర్తించొచ్చని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధకులు కనుగొన్నారు. త్వరగా చికిత్స చేయటానికి, సమస్య రకాల మధ్య తేడాలను కచ్చితంగా గుర్తించటానికిది తోడ్పడగలదని భావిస్తున్నారు. పార్కిన్సన్స్‌ను, దీంతో ముడిపడిన సమస్యలను నయం చేసే చికిత్సలేవీ లేవు. ఇవి సంక్లిష్టమైనవి కావటం.. వీటి లక్షణాలు ఇతర జబ్బులను పోలి ఉండటం వల్ల తరచూ పొరపడుతుంటారు. గుర్తించటమూ ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ఆశలు రేకెత్తిస్తోంది. నిజంగా జబ్బుతో బాధపడేవారిని గుర్తించి, ప్రయోగ పరీక్షలు నిర్వహించటానికి.. త్వరగా కొత్త చికిత్సలను ఆవిష్కరించటానికి వీలుంటుందని ఆశిస్తున్నారు. చికిత్స తీసుకునేవారికీ సరైన మందులను సూచించటానికి తోడ్పడగలదు. పార్కిన్సన్స్, దీంతో ముడిపడిన సమస్యలను సైనుక్లీనోపతీస్‌గా పిలుచుకుంటారు. వీటిల్లో అల్ఫా-సైనుక్లీన్ అనే ప్రొటీన్ అస్తవ్యస్తమవుతుంది మరి. ఈ జబ్బులన్నీ భిన్నంగా ఉంటాయి. చికిత్సలూ వేరే. అయితే ఒకదాని లక్షణాలు మరోదానిలా కనిపించటం, వీటిని కచ్చితంగా గుర్తించే జీవ సూచికలు లేకపోవటం పెద్ద సవాలుగా నిలుస్తోంది. ఇక్కడే కొత్త అధ్యయనం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ జబ్బులు గలవారి చర్మంలోని నాడీకణాల పోచల్లో ఫాస్ఫోరీలేటెడ్ అల్ఫా-సైనుక్లీన్ (పీ-ఎస్‌వైఎన్) ప్రొటీన్ పోగుపడుతుంది. అదీ జబ్బు తొలిదశలో, లక్షణాలు పైకి కనిపించటానికి చాలా ఏళ్ల ముందుగానే. శరీరంలోని వివిధ భాగాల నుంచి చర్మం ముక్కలను తీసి పరీక్షిస్తే ఇది బయటపడుతుంది. దీని ద్వారా 90% కచ్చితత్వంతో పార్కిన్సన్స్, దీంతో ముడిపడిన సమస్యలను గుర్తించొచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

## మహా మెగ్నీషియం!



మెగ్నీషియం గొప్ప పోషకం. ఇది గుండె లయ, కండరాల సంకోచాలు, రక్తపోటు అదుపు, ఎముక పుష్టి, శక్తిని పుట్టించటం వంటి 300కు పైగా అత్యవసర పనుల్లో పాలు పంచుకుంటుంది. అయినా చాలామందిలో మెగ్నీషియం మోతాదులు తక్కువగానే ఉంటుండటం గమనార్హం. దీన్ని తగినంత లభించేలా చూసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. మెగ్నీషియం చాలా ఆహార పదార్థాలతో సహజంగానే లభిస్తుంది. వయసు, లింగ భేదాన్ని బట్టి మనకు సగటున రోజుకు 310 నుంచి 420 మి.గ్రా. మెగ్నీషియం కావాలి. అలాగని మరీ కొలుచుకొని పదార్థాలను తినాల్సిన అవసరమేమీ లేదు. మెగ్నీషియంతో కూడిన పదార్థాల ఎంపికలో కాస్త జాగ్రత్తగా ఉంటే చాలు. గింజ పప్పులు, గింజలు: గింజ పప్పులు (నట్స్), గింజలు చిన్నవే గానీ మంచి పోషకాల గనులు. వీటిల్లో ప్రొటీన్లు, పీచు, ఆరోగ్యకర కొవ్వులతో పాటు మెగ్నీషియం వంటి ఖనిజాలూ దండిగా ఉంటాయి. సుమారు 30 గ్రాముల బాదంతో 80 మి.గ్రా., జీడిపప్పుతో 72 మి.గ్రా., వేరుశనగలతో 49 మి.గ్రా., గుమ్మడి గింజలతో 150 మి.గ్రా. మెగ్నీషియం లభిస్తుంది. చెంచాడు అవిసె గింజలు తీసుకుంటే 40 మి.గ్రా. అందినట్టే. అరకప్పు మొక్కజొన్న గింజలు తింటే 27 మి.గ్రా. లభిస్తుంది. పప్పులు: పప్పు దినుసులూ తక్కువేమీ కాదు. కంది, పెసర, శనగ, మినప వంటి పప్పుల న్నింటిలోనూ మెగ్నీషయం బాగా ఉంటుంది. అరకప్పు ఉడికించిన శనగలతో 60 మి.గ్రా., అనపగింజలతో 40 మి.గ్రా. లభిస్తుంది. పాలు, పెరుగు: పాలు, పెరుగు అనగానే క్యాల్షియమే గుర్తుకొస్తుంది. వీటిల్లో మెగ్నీషియం పాలూ ఎక్కువే. ఒక కప్పు పాలలో 27 మి.గ్రా., పావు కిలో పెరుగులో 42 మి.గ్రా. ఉంటుంది. కూరగాయలు, ఆకు కూరలు: మెగ్నీషియం విషయంలో ముదురు రంగు ఆకు కూరలూ గొప్పవే. అరకప్పు ఉడికించిన పాలకూరతో 78 మి.గ్రా. లభిస్తుంది. అలాగే కూరగాయల్లో అరకప్పు బఠానీల్లో 31 మి.గ్రా., బంగాళా దుంపల్లో 48 మి.గ్రా. ఉంటుంది.




# ఎండ వేడి చల్లగా!

వేసవి అనగానే సెలవుల కాలమే గుర్తుకొస్తుంది. సరదాగా బయటకు వెళ్లటం, షికార్లు చేయటం బాగానే ఉంటుంది గానీ వేడిని తట్టుకోవటమే కష్టం. అప్పుడే ఎండలు ఎలా భగ్గుమంటున్నాయో చూస్తూనే ఉన్నాం. రోజురోజుకీ పెరిగిపోతున్న వేడి కలవర పెడుతోంది. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వేసవి వెంట బెట్టుకొచ్చే సమస్యలూ సరేసరి. చెమట ఎక్కువగా పోయటం వల్ల ఒంట్లో నీరు, లవణాలు తగ్గిపోతాయి. బలహీనత, నీరసం కమ్ముకొస్తాయి. దాహం తీర్చుకోవటానికి ఎక్కడపడితే అక్కడ తాగే నీటితో.. వేడి మూలంగా త్వరగా చెడిపోయే ఆహారంతో విరేచనాలు, కామెర్ల వంటి జబ్బులూ దాడిచేస్తాయి. విష జ్వరాల బెడదా తక్కువేమీ కాదు. కానీ ఆహార, విహారాల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవి బాధలను నివారించుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. సమస్యలు ఎదురైనా ఔషధాలు, చిట్కాలతో ఉపశమనం పొందొచ్చని భరోసా ఇస్తోంది. 'ఖాదీని యాత్మ మనః కాలో దిశస్య ద్రవ్య సంగ్రహః' అని శాస్త్రం చెబుతుంది. అంటే పంచ మహాభూతాలు (భూమి, జలం, వాయువు, అగ్ని, ఆకాశం), ఆత్మ, మనసు, దిక్కులు, కాలం.. ఇవన్నీ కలిసి మనకు కనిపించే అన్నింటినీ తయారుచేస్తాయని అర్థం. వీటిని కార్య కారణ ద్రవ్యాలనీ అంటారు. సృష్టిలోని ప్రతీదీ వీటితోనే ఏర్పడుతుంది. వీటిల్లో కాలం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయా కాలాలు మన శరీరం మీద, ఆరోగ్యం మీద గణనీయమైన ప్రభావాన్ని చూపి స్తాయి. అందుకే ఆయా కాలాలకు అనుగుణంగా వ్యహరించాలని ఆయుర్వేదం నిర్దిష్టంగా చెబుతుంది. మనకు సంవత్సరంలో పన్నెండు మాసాలు, రెండు ఆయనాలు, ఆరు రుతువులు. ఉత్తరాయణంలో శిశిర, వసంత, గ్రీష్మ రుతువులు.. దక్షిణాయనంలో వర్ష, శరద్, హేమంత రుతువులు వస్తాయి. మనిషి శరీర బలాన్ని బట్టి ఆయుర్వేదం వీటిని ఆదాన, విసర్గ కాలాలుగానూ విభజిస్తుంది. ఉత్తరాయణాన్ని ఆదాన కాలంగా, దక్షిణా యనాన్ని విసర్గ కాలంగా పేర్కొంటుంది. విసర్గ కాలంలో సూర్యుడు తన శక్తిని భూమ్మీది సమస్త ప్రాణికోటికి అందిస్తాడు. అదే ఆదాన కాలంలో బలాన్ని వెనక్కి గ్రహిస్తుంటాడు. ఆదాన కాలంలో వచ్చే గ్రీష్మ రుతువులో వేడి పెరగటం వల్ల ఒంట్లో జల భూతం తగ్గుతుంది. ఫలితంగా నీరసం, దాహం పెరుగుతాయి. ఎండా కాలంలో ఒంట్లో శ్లేష్మం (కఫం) కరిగిపోయి జఠరాగ్నిని చల్లారుస్తుంది. దీంతో అగ్నిమాంద్యం తలెత్తి ఆకలి తగ్గటం, తిన్నది సరిగా జీర్ణం కాకపోవటం వంటివి మొదలవుతాయి. అన్ని వ్యాధులకూ మూలం అగ్నిమాంద్యమేనని ఆయుర్వేదం చెబుతుండటం గమనార్హం.



### తిండి సరిగా..

ఆహారం రుచిగా, శుచిగా ఉంటేనే ధాతువులకు బలం చేకూరుతుంది. కాబట్టి ఆహారం మీద శ్రద్ధ అవసరం. ఎండా కాలంలో పదార్థాలు త్వరగా చెడిపోతాయి కాబట్టి ఎక్కువసేపు బయట నిల్వ ఉంచివని తినొద్దు. అప్పుడే వండిన ఆహారం తినాలి. ఈ కాలంలో అగ్నిమాంద్యం వచ్చే అవకాశముంది కాబట్టి తేలికగా జీర్ణమయ్యే, నోటికి హితవుగా ఉండే ఆహారం తీసుకోవాలి. మితంగా నెయ్యి, నూనె వంటి స్నిగ్ధ పదార్థాలూ అవసరమే. వేసవిలో మధుర (తీపి) రసం మేలు చేస్తుంది. ఇది ఒంటికి బలాన్ని చేకూరుస్తుంది. కూరల విషయంలో దోసకాయ, పొట్లకాయ, బీరకాయ, సొరకాయ వంటి నీటితో కూడిన కూరగాయలు మేలు. బచ్చలి, పొన్నగంటి వంటి ఆకుకూరలూ శ్రేష్ఠమే. ద్రాక్ష, దానిమ్మ, బత్తాయి, నారింజ పండ్లు నీటితో పాటు పోషకాలనూ అందిస్తాయి. మితంగా మామిడి పండ్లు, పుచ్చకాయ కూడా తినొచ్చు. పెరుగుతో భోజనం చేయకపోతే అసలు తిన్నట్టే అనిపించదు. అయితే వేసవిలో పుల్లటి పెరుగు తినొద్దు. ఇది పిత్తం ప్రకోపించేలా చేస్తుంది. తీయటి పెరుగు తినాలి. వేసవిలో చాలామంది ఐస్‌క్రీములు తింటుంటారు. ఇలాంటి చల్లటి పదార్థాలు హాయిని కలిగిస్తుండొచ్చు గానీ మరీ చల్లటివి తినొద్దు. అతి శీతల పదార్థాలు జీర్ణశక్తిని తగ్గిస్తాయి.

### పానీయ శక్తి

వేసవిలో చెమట రూపంలో ఒంట్లోంచి నీరు, లవణాలు ఎక్కువగా బయటకు వెళ్లిపోతాయి. అందువల్ల ఎప్పటికప్పుడు నీటిని భర్తీ చేసుకోవాలి. అయితే మరీ చల్లగా ఉండే నీటి కన్నా గది ఉష్ణోగ్రతలో లేదా కాస్త చల్లగా ఉండే కుండలో నీరు తాగటం మంచిది. కొన్నిరకాల పానీయాలూ ఉపయోగపడతాయి.

షడంగ పానీయం: ఇది ఔషధ పానీయం. సాధారణంగా దీన్ని జ్వరం వచ్చినవారికి సూచిస్తారు గానీ ఎండాకాలంలోనూ మేలు చేస్తుంది. తుంగ ముస్తెలు, పర్పాటకం, వట్టివేళ్లు, చందనం, సుగంధిపాల, శొంఠిని రాత్రిపూట నీటిలో నానబెట్టి.. మర్నాడు ఉదయం వేడి చేసి వడగట్టుకోవాలి. దీన్ని అప్పుడప్పుడూ కొద్దికొద్దిగా తాగాలి. ఇప్పుడు షడంగ పానీయం చూర్ణాన్ని కూడా అమ్ముతున్నారు. తీసుకున్న చూర్ణానికి 14 రెట్లు నీళ్లు కలిపి.. సగం మిగిలే వరకు కాచుకోవాలి. చల్లబడిన తర్వాత కొద్దికొద్దిగా తాగాలి. రసాలా: పెరుగులో చక్కెర, కాస్త యాలకుల పొడి కలిపి తీసుకోవటం మంచిది. ఇది ఒంటికి చలువనిస్తుంది. రాగ: దానిమ్మ పండ్ల రసంలో పెరుగు మీదుండే తేట లేదా చిక్కటి పాలు, చక్కెర కలిపి కొద్దికొద్దిగా తాగుతుంటే శరీర తాపం తగ్గుతుంది.

ఖాండవ: దానిమ్మరసంలో బాగా వండిన మాంసరసాన్ని (సూప్) కూడా కలిపి చేస్తే ఖాండవ పానీయం తయార వుతుంది. ఇందులో బెల్లం, కొద్దిగా మిరియాలు, యాలకులు, లవంగ, దాల్చిన చెక్క పొడులు కూడా వేసి.. చల్లగా చేసుకొని సాయంత్రం వేళల్లో తాగొచ్చు. మాంసరసం ఉండటం వల్ల శరీరానికి తగినంత పోషణ కూడా లభిస్తుంది. పుల్లటి దానిమ్మ మూలంగా నోటి హితవు కలుగుతుంది, జీర్ణక్రియ పెరుగుతుంది.



మజ్జిగ: పల్చటి మజ్జిగలో నిమ్మరసం పిండుకొని.. కొద్దిగా మిరియాల పొడి, సైంధవ లవణం కలిపి ఉదయం, సాయంత్రం ఒకో గ్లాసు తాగితే చెమట ద్వారా పోయిన నీరు, లవణాలు భర్తీ అవుతాయి. వడదెబ్బ తగలకుండా కాపాడుకోవచ్చు.

నిమ్మరసం: నీటిలో నిమ్మరసం కలిపి తాగినా మంచిదే. ఇందులో కొద్దిగా ఉప్పు, చక్కెర కలిపితే ఇంకా మంచిది. వీలుంటే జీలకర, యాలకుల పొడులూ వేసుకోవచ్చు.

మామిడి పానీయం: మామిడి కాయను ఉడికించి, గుజ్జును తీయాలి. దీనికి తగినంత చక్కెర కలిపి ఉడికించి, పాకం చేసుకోవాలి. ఇందులో కొద్దిగా సైంధవ లవణం, యాలకుల పొడి కలిపి.. నిల్వ చేసుకోవాలి. అవసరమైనప్పుడు కొద్దిగా తీసుకొని, నీటిలో కలిపి పానీయంగా తాగితే మేలు చేస్తుంది.

పానకం: శ్రీరామనవమికి బెల్లంతో చేసే పానకం అందరికీ తెలిసిందే. ఇది దప్పికను బాగా తీరుస్తుంది. చలువ చేస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది.

ధనియాల నీరు: ముందురోజు రాత్రి ధనియాలను నీటిలో నానేసి, మర్నాడు ఉదయం తాగితే ఒంట్లో వేడి తగ్గుతుంది.

విహారంలో జాగ్రత్త

ఎండలోకి ఎక్కువగా వెళ్లకూడదు. ఒకవేళ వెళ్తే శరీరానికి ఎండ నేరుగా తగలకుండా చూసుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి. తలకు రుమాలు చుట్టుకోవాలి. అలాగే లేత రంగు దుస్తులు ధరించాలి. ఉదయం శరీరానికి నువ్వుల నూనె రాసుకొని, తర్వాత స్నానం చేస్తే చల్లదనం లభిస్తుంది. స్నానం చేసిన తర్వాత అరగదీసిన గంధాన్ని పూసుకోవాలి. నుదురు, పొట్ట, ఛాతీ మీద చందనం రాసుకుంటే శరీరంలోంచి ఉష్ణం త్వరగా బయటకు వెళ్లిపోతుంది. రాత్రి పడుకునే ముందు మాడుకు, పాదాలకు నువ్వుల నూనె రాసుకుంటే మంచి ఉపశమనం కలుగుతుంది. నిద్ర బాగా పడుతుంది. కారులో ప్రయాణించేవారు తుంగ ముస్తల పొడిని ఫిల్టర్ కాగితంలో చుట్టి లోపల పెట్టుకోవచ్చు. ఇది గాలిని సుగంధమయం చేయటమే కాకుండా ఎండదెబ్బ తగలకుండానూ కాపాడుతుంది. ముస్తల పొడికి చందనాన్నీ కలిపితే దోమలు దరిజేరకుండా చూసుకోవచ్చు.

### సమస్యలు- చిట్కాలు, ఔషధాలు

ఎండాకాలంలో కొన్ని జబ్బులు ప్రత్యేకించి కనిపిస్తుంటాయి. కొన్ని చిట్కాలు, ఔషధాలతో వీటిని తగ్గించుకోవచ్చు.

తలనొప్పి: నుదుటికి గంధం పూతను రాసుకుంటే తలనొప్పి తగ్గుతుంది. చిన్న గుడ్డలో రెండు మూడు చుక్కల జీవనధార తైలాన్ని వేసి వాసన చూసినా మేలే.

అతిసార (విరేచనాలు): దీన్ని అసలే నిర్లక్ష్యం చేయొద్దు. ఎండాకాలంలో మామూలుగానే ఒంట్లో నీరు తగ్గుతుంది. విరేచనాలతో మరింత ఎక్కువగా తగ్గుతుంది. కాబట్టి సత్వర చికిత్స అవసరం. దీనికి గంగాధర చూర్ణం.. కుటజ ఘనవటి, కర్పూర రస మాత్రలు.. బిల్వ అవలేహ్యం, కుటజ అవలేహ్యం ఔషధాలు ఉపయోగపడతాయి.

వడదెబ్బ: మజ్జిగలో ఉల్లిపాయ కలిపి తీసుకుంటే ఎండ దెబ్బ తగలకుండా చూసుకోవచ్చు. చద్దన్నమూ మేలు చేస్తుంది. అయితే రాత్రి అన్నంలో నీరు పోసి పొద్దున లేచి తినటం కాదు. రాత్రిపూట తాజా అన్నంలోనే పాలు పోసి, కొద్దిగా పెరుగు వేసి తోడు పెట్టాలి. అలాగే మిరపకాయ, ఉల్లిపాయ వేసి మూత పెట్టాలి. మర్నాడు ఉదయం ఉప్పు కలిపి తినాలి. ఇది వడదెబ్బ తగలకుండానే కాదు, మానసిక స్థితి అస్తవ్యస్తం కాకుండానూ కాపాడుతుంది.

గులాబీ రెక్కలు, ప్రవాళ భస్మం కలిపి చేసిన గుల్కండ్ విత్ ప్రవాళ కూడా మంచిదే. దీన్ని రోజూ ఉదయం, సాయంత్రం ఒక చెంచా చొప్పున తీసుకుంటే వడదెబ్బతో పాటు చర్మం నలుపెక్కటాన్నీ నివారించుకోవచ్చు.

చర్మ సమస్యలు: ఎండ తగిలిన చోట చర్మం నల్లబడటం చూస్తూనే ఉంటాం. ఇలాంటివారు సాయంత్రం వేళ చెంచాడు పులిసిన పెరుగులో కాస్త పసుపు, చందనం, నిమ్మరసం కలిపి.. ముఖం, చేతులు, మెడ, పాదాలకు రాసుకోవాలి. అరగంట తర్వాత స్నానం చేస్తే నలుపు తగ్గే అవకాశముంది. కొబ్బరినూనెలో గంధాన్ని కలిపి చర్మానికి రాసుకుంటే చెమట కాయల వంటి సమస్యలు తగ్గటానికి తోడ్పడుతుంది.

కామలా (కామెర్లు): ఇది వచ్చినప్పుడు తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి. వేపుళ్లు, నూనె పదార్థాలు తగ్గించాలి. మిరియాలు వాడొద్దు. దీనికి కటుక రోహిణి, గుంట గలకర ఉపయోగపడతాయి. అలాగే నేల ఉసిరి మొక్కను దంచి చిన్న ఉండగా చేసుకొని తీసుకుంటే కామెర్లు తగ్గుతాయి. ఆరోగ్యవర్ధిని మాత్రలూ మేలు చేస్తాయి.

కళ్లకలక: దీనికి త్రిఫల కషాయం ఉపయోగపడుతుంది. గిన్నెలో రెండు చెంచాల త్రిఫల చూర్ణం తీసుకొని.. దీనికి ఏడు రెట్లు నీరు కలపాలి. గిన్నెను పొయ్యి మీద పెట్టి సగం అయ్యేవరకు మరిగించాలి. చల్లబడ్డాక గుడ్డతో కషాయాన్ని వడగట్టి తరచూ కళ్లను కడుక్కోవాలి. సప్తామృత లోహం మాత్రలను ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఒక్కోటి వేసుకోవచ్చు. త్రిఫలా ఘృతాన్ని ఉదయం, రాత్రి ఒకో చెంచా తిన్నా మంచిదే.

విషజ్వరాలు: వేసవిలో విషజ్వరాలూ వస్తుంటాయి. జలుబు (ప్రతిశ్యాయ) తగ్గటానికి శీతోపలాది చూర్ణం, హరిద్రకాండ, లక్ష్మీవిలాస రసం ఉపయోగపడతాయి. జ్వరాలకైతే సుదర్శన చూర్ణం, సుదర్శన ఘనవటి, ఆయుష్ 64, కాలమేఘ వంటి ఔషధాలు మేలు చేస్తాయి.

అన్ని రుతువులకూ కరక్కాయ

ఆరోగ్య సంరక్షణకు కరక్కాయ (హరితకి) చూర్ణం ఎంతో మేలు చేస్తుంది. దీన్ని ఆయా రుతువుల్లో ఆయా అనుపానాలతో తీసుకోవాల్సి ఉంటుంది. శిశిరంలో పిప్పలి, వసంతంలో తేనె, గ్రీష్మంలో బెల్లం, వర్షంలో సైంధవ లవణం, శరద్‌లో చక్కెర, హేమంతంలో శొంఠితో కలిపి తీసుకోవాలి. కరక్కాయ చూర్ణానికి రెండింతల అనుపానాలను కలిపి రోజుకు ఒక్కసారే సాయంత్రం వేళ తీసుకోవాలి. ఇది ఆయా రుతువుల్లో దోషాలు వికృతం కాకుండా కాపాడుతుంది. జబ్బుల బారిన పడకుండా రక్షిస్తుంది. జబ్బులు వచ్చినా తర్వగా కోలుకునేలా చూస్తుంది. అయితే సంతానం కోసం ప్రయత్నిస్తున్న దంపతులు మాత్రం దీన్ని వాడకూడదు.

# మరగకాగిన నూనెలో వేపుళ్లా... వద్దంటే వద్దు!

మరగకాగిన నూనెలో ముంచి తీసే వేపుడు వంటకాలు ఆరోగ్యానికి అస్సలు మంచివి కావని వైద్యపరిశోధనా రంగం హెచ్చరిస్తోంది. ఎందుకిలా? ఏమిటి వీటితో నష్టం?వివరాలు మీ కోసం! పళ్లెంలో వేపుడు ముక్కలు చూస్తూనే నోట్లో నీళ్లూరిపోతుంటాయి. కమ్మగా కరకరలాడుతూ.. కాస్త కారంకారంగా ఉండే వేపుడు కూర వడ్డిస్తానంటే వద్దనే వాళ్లు ఎవరు? ఈ వేపుళ్లను వేగంగా వండెయ్యొచ్చు. పెద్ద ఖర్చూ అవ్వదు. పైగా అంతా ఇష్టంగా తింటారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా హొటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఈ వేపుడు వంటకాలదే తొలి దర్శనం! అలూ చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్.. ఫ్రైడ్ ఫిష్.. చికెన్ స్ట్రిప్స్.. చీజ్ స్టిక్స్.. రుచి విషయంలో వీటి గురించి మరో ఆలోచనేం అక్కర్లేదు. కానీ మరగకాగిన నూనెలో ముంచి తీసే వేపుళ్లతో చాలా నష్టం ఉంది.

### క్యాలరీల తంటా

వేపుడు కూరల నుంచి వచ్చే క్యాలరీలు చాలా ఎక్కువ. ఎందుకంటే ముక్కలను వేడివేడి నూనెలో ముంచి తీసినప్పుడు వాటిలో ఉండే నీరంతా ఆవిరైపోతుంది, ఇదే సమయంలో అవి నూనెను బాగా పీల్చుకుంటాయి. నూనె వంటి కొవ్వుల నుంచి మనకు అందే శక్తి (అంటే క్యాలరీలు) చాలా చాలా ఎక్కువ. అందుకే ఉడికించటం, నిప్పుల మీద కాల్చటం వంటి ఇతరత్రా పద్ధతుల్లో వండిన వాటికంటే నూనె వేపుళ్ల నుంచి మనకు చాలా ఎక్కువ క్యాలరీల శక్తి అందుతుంది. చిన్న ఉదాహరణ చూద్దాం. 100 గ్రాముల బంగాళదుంప ముక్కలను ఉడికించామనుకోండి. దాన్నుంచి మనకు దాదాపు 93 క్యాలరీల శక్తి అందుతుంది, కొవ్వు పెద్దగా ఉండదు. అదే ఆలూ ముక్కలను వేడివేడి నూనెలో వేసి బాగా కరకరలాడేలా వేయించామనుకోండి (డీప్ ఫ్రై). వాటి నుంచి దాదాపుగా 17 గ్రాముల కొవ్వు, 319 క్యాలరీల శక్తి అందుతాయి. అలాగే 100 గ్రాముల చేప ముక్కలను ఉడికిస్తే వాటి నుంచి 105 క్యాలరీల శక్తి, 1 గ్రాము కొవ్వు మాత్రమే అందుతాయి. అదే చేప ముక్కలను నూనెలో వేయిస్తే 232 క్యాలరీల శక్తి, 12 గ్రాముల వరకూ కొవ్వు అందుతాయి. కాబట్టి మనం వండే పద్ధతి వల్ల కొవ్వు, క్యాలరీలు పెరిగిపోతాయని, తరచూ వేపుళ్లను తింటుంటే దీనివల్ల వూబకాయం, మధుమేహం వంటి చాలా రకాల సమస్యలు పొంచి ఉంటాయని గుర్తించాలి.

### జబ్బులూ రుచి చూడాల్సి రావచ్చు!

గుండె జబ్బులు: వేపుడు పదార్థాలు ఎంత తరచుగా తింటుంటే గుండె జబ్బుల ముప్పు అంత ఎక్కువగా పెరుగుతోందని ఇటీవలి కాలంలో జరిగిన రెండు అతి పెద్ద అధ్యయనాల్లో గుర్తించారు.



తరచూ వేపుళ్లు తింటున్న వారిలో హైబీపీ సమస్య ఎక్కువగా ఉంటోంది, మరోవైపు మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) స్థాయులు ఉండాల్సినంత ఉండటం లేదు. ఈ రెండూ గుండె జబ్బుల ముప్పును పెంచుతున్నాయి.

మధుమేహం:వేపుడు పదార్థాలను వారానికి ఒకసారి తింటున్న వారితో పోలిస్తే- వారానికి 4-6 సార్లు తింటున్న వారిలో మధుమేహం వచ్చే ముప్పు 39% అధికంగా ఉంటోంది. వేపుడు పదార్థాల్లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల వల్ల బరువు పెరగటంతో పాటు ఆకలిని నియంత్రించే హార్మోన్లు కూడా అస్తవ్యస్తమైపోతున్నాయని, ఇది మధుమేహం, వూబకాయాలకు దారి తీస్తోందని గుర్తించారు.

క్యాన్సర్లు: వండేప్పుడు ఆహారపదార్థాలను అత్యధిక ఉష్ణోగ్రతల వద్దకు తీసుకువెళుతున్నప్పుడు దానిలో 'ఆక్రిలమైడ్' అనే విషతుల్యం తయారవుతుంది. పొగలొస్తున్న నూనెల్లో వేయించటం, కణకణ మండే నిప్పుల మీద కాల్చటం, మాడ్చటం వంటివన్నీ ఈ రకమైన రసాయనిక చర్యకు ఆస్కారం ఇస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఆలుగడ్డల వంటి వాటిలో ఉండే పిండిపదార్థాలు, చక్కెరలు, ఆస్పరాజిన్ అనే అమైనో ఆమ్లం- ఇలాంటి వాటన్నింటి మధ్యా రసాయన చర్యలు జరిగి 'ఆక్రిలమైడ్' తయారవుతోంది. ఇది చాలా రకాల క్యాన్సర్లకు కారణమవుతోందని జంతువులపై జరిగిన పలు అధ్యయనాల్లో తేలింది. దీని ప్రభావం మనుషుల మీద ఎలా ఉంటోందన్న దిశగా ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. వేపుళ్ల వల్ల క్యాన్సర్ రాదని మాత్రం ఇంత వరకూ ఎవరూ నిర్ధారించలేదు.

### ట్రాన్స్ ఫ్యాట్స్ తిప్పలు

వంట నూనెలను మరగకాచినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వద్ద దానిలో రసాయనిక స్వభావం మారిపోయి అవి 'ట్రాన్స్ ఫ్యాట్స్' రకం కొవ్వులుగా మారిపోతాయి. ఈ తరహా కొవ్వులను మన శరీరం తేలికగా అరిగించుకోలేదు. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి చాలా రకాల ఆరోగ్య సమస్యలు బయల్దేరతాయి. బయట ప్యాకెట్లలో దొరికే వేపుడు పదార్థాలతో కూడా ఈ రకం సమస్య తప్పదు. పైగా ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు తయారీదారులు వాటిని అధిక పీడనంతో హైడ్రోజెన్ వాయువును ఉపయోగించి ప్రత్యేక పద్ధతిలో వండుతారు. దీన్నే 'హైడ్రోజినేషన్' అంటారు. దీనివల్ల కూడా ఆయా వేపుడు పదార్థాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల స్థాయి పెరిగిపోతుంది. మరో పెద్ద సమస్య ఏమంటే- వంట నూనెలను మన ఇళ్లలోనూ, హొటళ్లలో కూడా ఒక్కసారే వాడరు. అవసరమైనప్పుడల్లా మరగకాచి వండుతుంటారు, మళ్లీ భద్రపరుస్తుంటారు. ఇలా ఒకసారి కాచిన నూనెనే మళ్లీ మళ్లీ వేడి చేస్తుండటం వల్ల వాటిలోని ప్రమాదకర ట్రాన్స్ ఫ్యాట్స్ స్థాయులు మరింతగా పెరిగిపోతున్నాయని పరిశోధకులు స్పష్టంగా గుర్తించారు. వేపుళ్లు వండాలంటే నూనెను విపరీతంగా కాచక తప్పదు, ఆ నూనెతో ఈ తరహా అనారోగ్యకరమైన ముప్పులూ తప్పవు.

### మనమేం చెయ్యాలి

వేపుడు పదార్థాలను మరీ తరచుగా తినకుండా ఉండటం అత్యుత్తమం. ఎప్పుడన్నా ఒకసారి తింటే ముప్పు మరీ అంత ఎక్కువగా ఉండదు.

పని తేలిక అవుతుందని, వంటకాలు రుచిగానూ ఉంటాయని ప్రతి కూరనీ నూనెలో పోసి వేయించెయ్యకుండా... ఇతరత్రా వంట పద్ధతులపైనా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఇగురు కూరలు, ఉడికించిన వంటకాలను కూడా రుచికరంగా చేసుకునే పద్ధతులు తెలుసుకోవాలి. మరీ ఎప్పుడన్నా కావాలనుకుంటే వేపుళ్లను ఓవెన్‌లోనో, ఎయిర్ ఫ్రైయర్ల వంటి వాటిలోనో చేసుకుంటే- నూనెలో ముంచి తియ్యాల్సిన పని లేకుండానే ముక్కలు కరకరలాడతాయి!

# భారత జట్టులో దినేశ్ కార్తీక్.. ఇంపాక్ట్ రూల్ లేదంటూ ఇర్ఫాన్ పఠాన్ సెటైర్స్!



ఐపీఎల్ 2024 సీజన్‌లో సత్తా చాటుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వెటరన్ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్‌ను టీ20 ప్రపంచకప్ 2024 జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది. నిలకడగా ఆడుతూ.. తనదైన శైలిలో మ్యాచ్‌లను ముగిస్తున్న దినేశ్ కార్తీక్‌ను టీ20 ప్రపంచకప్ జట్టుకు ఎంపిక చేయాలని అంబటి రాయుడు వంటి మాజీ క్రికెటర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే రాయుడి వ్యాఖ్యలను మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తప్పుబట్టాడు. ఐపీఎల్, ప్రపంచకప్‌కు చాలా తేడా ఉంటుందని, ఐసీసీ టోర్నీల్లో ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ లేదని గుర్తు చేస్తూ సెటైర్లు పేల్చాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో దినేశ్ కార్తీక్ అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగాడు. 288 పరుగుల భారీ లక్ష్యచేధనలో చివరి వరకు పోరాడాడు. 35 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లతో 83 పరుగులు చేసి ఆర్‌సీబీని గెలిపించే ప్రయత్నం చేశాడు. కానీ నటరాజన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లు ఆడిన దినేశ్ కార్తీక్ 226 పరుగులు చేశాడు. అయితే ఆరంభంలో దినేశ్ కార్తీక్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు. కార్తీక్ ప్రదర్శనపై ప్రశంసల జల్లు కురిపించిన అంబటి రాయుడు.. అతన్ని టీ20 ప్రపంచకప్ జట్టులోకి తీసుకోవాలని సెలెక్టర్లకు సూచించాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో ఇర్ఫాన్ పఠాన్‌తో కలిసి పాల్గొన్న రాయుడు ఈ వ్యాఖ్యలు చేశాడు. 'దినేశ్ కార్తీక్ తన కెరీర్‌లో ఎక్కువగా ధోనీతో పోటీ పడ్డాడు. ధోనీ కెప్టెన్‌గా సక్సెస్ కావడంతో కార్తీక్‌కు అవకాశం లేకుండా పోయింది. దినేశ్ కార్తీక్ ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. కెరీర్ చివరి దశలో ఉన్న అతనికి వరల్డ్ కప్ ఆడే అవకాశం దక్కుతుందని భావిస్తున్నాను. అతనికి అవకాశం ఇస్తే మ్యాచ్ విన్నర్‌గా మారుతాడు. అంతేకాకుండా భారత్‌కు ప్రపంచకప్ అందించి తన కెరీర్‌ను ఘనంగా ముగిస్తాడు. సెలెక్టర్లు అతన్ని ప్రపంచకప్ జట్టులోకి తీసుకోవాలని కోరుతున్నా.'అని రాయుడు అన్నాడు. అంబటి రాయుడు వ్యాఖ్యలతో నవ్వుకున్న పఠాన్.. అతని అభిప్రాయాన్ని విభేదించాడు. ఐపీఎల్, టీ20 ప్రపంచకప్‌కు చాలా తేడా ఉంటుందని తెలిపాడు. పైగా ఐసీసీ టోర్నీల్లో ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. ఐపీఎల్ కంటే తీవ్రమైన ఒత్తిడి ఉంటుందని చెప్పాడు. ఐపీఎల్ 2022 ప్రదర్శన ఆధారంగా దినేశ్ కార్తీక్‌ను టీ20 ప్రపంచకప్ 2022 జట్టులోకి తీసుకోగా.. అతను దారుణంగా విఫలమయ్యాడు.

# సంజూ బాగా ఆడుతున్నాడు.. అయినా పంత్‌కే చోటివ్వాలి!




టీ20 ప్రపంచకప్-2024 భారత జట్టులో రిషభ్ పంత్‌కు చోటు ఇవ్వాలని ఆస్ట్రేలియా దిగ్గజం, ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ రిక్కీ పాంటింగ్ అన్నాడు. మెగా టోర్నీ ఆడే అర్హత పంత్‌కు ఉందని.. తన దృష్టిలో అతడే టీమిండియాకు మొదటి వికెట్ కీపర్ ఆప్షన్ అని పేర్కొన్నాడు. ఐపీఎల్-2024లో సత్తా చాటి కచ్చితంగా వరల్డ్‌కప్ ఆడే జట్టులో పంత్ చోటు దక్కించుకుంటాడని రిక్కీ పాంటింగ్ ధీమా వ్యక్తం చేశాడు. కాగా 2022, డిసెంబరులో కారు ప్రమాదానికి గురై.. అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డ పంత్ కోలుకోవడానికి దాదాపు ఏడాదిన్నర కాలం పట్టింది. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో సుదీర్ఘకాలం పాటు పునరావాసం పొందిన పంత్.. క్రమక్రమంగా కోలుకుని మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. ఈ క్రమంలో ఐపీఎల్ పదిహేడో ఎడిషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా తిరిగి పగ్గాలు చేపట్టిన పంత్.. వికెట్ కీపర్ బ్యాటర్‌గానూ సేవలు అందిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆరు ఇన్నింగ్స్ ఆడి 194 పరుగులు చేసిన పంత్ ఖాతాలో రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే.. కెప్టెన్‌గా మాత్రం పంత్ విఫలమవుతూనే ఉన్నాడు. అతడి సారథ్యంలో ఢిల్లీ ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌లు ఆడి కేవలం రెండే గెలిచింది. ఇదిలా ఉంటే.. మే 27న ఐపీఎల్-2024 ముగియనుండగా.. జూన్ 1 నుంచి వెస్టిండీస్- అమెరికా వేదికగా పొట్టి ప్రపంచకప్ సమరం మొదలుకానుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు వికెట్ కీపర్ ఎంపిక గురించి రిక్కీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సంజూ బాగా ఆడుతున్నాడు.. అయినా పంత్‌కే చోటివ్వాలి! "వరల్డ్‌కప్ జట్టులో రిషభ్ పంత్‌కు చోటు ఇవ్వాలా? అంటే కచ్చితంగా ఇవ్వాలనే చెబుతా. ఐపీఎల్ ముగిసేలోపు అతడు అందుకు అర్హత సాధిస్తాడు. గత ఆరు సీజన్లలో పంత్ మెరుగ్గా ఆడాడు. టీమిండియా తరఫున కూడా మంచి ప్రదర్శన ఇచ్చాడు. భారత జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదని తెలుసు. ముఖ్యంగా వికెట్ కీపర్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, కేఎల్ రాహుల్ బాగా ఆడుతున్నారు. చాలా ఆప్షన్లు కనిపిస్తున్నాయి. అయితే.. నేను గనుక జట్టును ఎంపిక చేయాల్సి వస్తే రిషభ్ పంత్‌కే మొదటి ప్రాధాన్యం ఇస్తాను. నన్నెపుడు ఈ ప్రశ్న అడిగినా ఇదే సమాధానం ఇస్తాను" అని రిక్కీ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. కాగా వరల్డ్‌కప్-2024 టీమిండియా వికెట్ కీపర్ల రేసులో ప్రస్తుతం సంజూ శాంసన్ ముందుకు దూసుకుపోతున్నాడు. రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అతడు ఇప్పటి వరకు ఆరు ఇన్నింగ్స్‌లో కలిపి 264 పరుగులు సాధించాడు.

# ఐపీఎల్ నుంచి వైదొలిగి షాక్ ఇచ్చిన మ్యాక్స్ వెల్.. కారణం అదే




ఇప్పటికే వరుస పరాజయాలు.. జట్టును అమ్మేయండి అంటూ దిగ్గజ ఆటగాళ్ల నుంచి విమర్శలు.. ఇక సోషల్ మీడియాలో అభిమానుల ట్రోలింగ్స్ కు అయితే లెక్కలేదు. అయినప్పటికీ బెంగళూరు జట్టు తన ఆట తీరు మార్చుకోవడం లేదు. పైగా అత్యంత నాసిరకంగా బౌలింగ్ వేస్తూ పరువు తీసు కుంటోంది. సోమవారం రాత్రి హైదరాబాద్ జట్టు జరిగిన మ్యాచ్లో బెంగళూరు బౌలర్లు గల్లి స్థాయి బౌలింగ్ వేశారు. ఫలితంగా హైదరాబాద్ జట్టు 287 పరుగులు చేసింది. అనంతరం చేజింగ్ కు దిగిన బెంగళూరు జట్టు 262 పరుగులు చేసి 25 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.. ఈ గెలుపుతో హైదరాబాద్ జట్టు వరుసగా మూడవ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.. పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. అటు బౌలింగ్, ఇటు ఫీల్డింగ్ భాగంలో దారుణంగా విఫలమవుతున్న బెంగళూరు జట్టు బ్యాటింగ్ విభాగంలోనూ కొంతమంది మీదే ఆధారపడుతోంది. అయితే ఈ జట్టు లో మాక్స్ వెల్ ఇలాంటి ఆటగాడు ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటివరకు అతడు తన స్థాయికి తగ్గట్టుగా ఆడలేదు. కోట్లు పెట్టి కొనుగోలు చేయడంతో బెంగళూరు యాజమాన్యం అతడిని బలవంతంగా కొనసాగించాల్సి వచ్చింది. అయినప్పటికీ వచ్చిన అవకాశాలను అతడు వినియోగించుకోలేదు. అయితే ఇటీవల మ్యాచ్ లో అతడి చేతి వేలికి గాయమైంది. దీంతో అతడు విశ్రాంతి తీసుకుంటున్నాడు. అయితే సోమవారం హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్లో బెంగళూరు ఓడిపోయిన నేపథ్యంలో.. మాక్స్ వెల్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ నుంచి వైదొలుగుతున్నట్టు సంచలన ప్రకటన చేశాడు. బెంగళూరు జట్టు మరుసటి మ్యాచ్ కోసం తుది జట్టును ఎంపిక చేస్తున్న నేపథ్యంలో కెప్టెన్ డూ ప్లెసిస్ కు మాక్స్ వెల్ ఈ విషయం చెప్పాడు. ప్లేయింగ్ - 11 లోకి తన బదులు మరొక ఆటగాడిని తీసుకోవాలని కోరాడు. ఎందుకంటే గత ఐదు మ్యాచ్ లలో మాక్స్ వెల్ ఆశించిన స్థాయిలో ఆడలేదు. కొన్నిసార్లు గోల్డెన్ డక్ గా కూడా వెను తిరిగాడు. తన ఫామ్ సరిగా లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు మాక్స్ వెల్ ప్రకటించాడు.. అయితే అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు ఏడు మ్యాచ్లు ఆడిన బెంగళూరు ఆరు మ్యాచుల్లో ఓడిపోయింది. మరో ఏడు మ్యాచ్లు ఆడాల్సి ఉంది. ప్లే ఆఫ్ చేరాలి అంటే కచ్చితంగా ఐదు మ్యాచ్లో బెంగళూరు గెలవాలి. అది కూడా భారీ రన్ రేట్ తేడాతో నెగ్గాలి. అప్పుడే ఆ జట్టు ప్లే ఆఫ్ ఆశలు సజీవంగా ఉంటాయి.

# ఐపీఎల్ లో రికార్డుల వెల్లువ, హైదరా..బాదుడే బాదుడు!

ఐపీఎల్ 17 సీజన్లలో హైదరాబాద్ సన్ రైజర్స్ ప్రపంచ రికార్డుల మోతతో సరికొత్త చరిత్ర సృష్టించింది. తన రికార్డులను తానే అధిగమించుకొంటూ ప్రత్యర్థిబౌలర్లను బెంబేలెత్తిస్తోంది... ఐపీఎల్-2024 డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ తొలిదశ పోటీలే రసపట్టుగా సాగుతున్నాయి. 10 జట్ల మొదటి 30 మ్యాచ్ ల్లోనే ప్రపంచ రికార్డుల మోత మోగుతోంది. మాజీ చాంపియన్ హైదరాబాద్ సన్ రైజర్స్ ప్రస్తుత సీజన్ మొదటి ఆరురౌండ్లలోనే రెండు సరికొత్త రికార్డులను నమోదు చేసింది.




### చిన్నస్వామి స్టేడియంలో పెద్దరికార్డులు...

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ చాలెంజర్స్ తో జరిగిన హైస్కోరింగ్ వార్ లో మాజీ చాంపియన్ హైదరాబాద్ సన్ రైజర్స్ చెలరేగిపోయింది. 20 ఓవర్లలో కేవలం 3 వికెట్ల నష్టానికే రికార్డుస్థాయిలో 287 పరుగుల స్కోరు సాధించింది. ఈ 6వ రౌండ్ పోరులో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ కు ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ- ట్రావిస్ హెడ్ మొదటి వికెట్ కు 8.1 ఓవర్లలోనే 108 పరుగులతో సరికొత్త రికార్డు భాగస్వామ్యాన్ని అందించారు. ట్రావిస్ హెడ్ కేవలం 41 బంతుల్లోనే 9 ఫోర్లు, 8 సిక్సర్లతో 102 పరుగులు, అభిషేక్ 34, క్లాసెన్ 67, మర్కరమ్ 32, సమద్ 37 పరుగులు సాధించడంతో సన్ రైజర్స్ 287 పరుగుల స్కోరుతో తన రికార్డును తానే అధిగమించుకోగలిగింది. టీ-20 చరిత్రలో అత్యధికంగా 20 ఓవర్లలో 3 వికెట్లకు 314 పరుగుల ప్రపంచ రికార్డు స్కోరు సాధించిన ఘనత పసికూన నేపాల్ పేరుతో ఉంది. ఆసియాక్రీడల క్రికెట్లో భాగంగా మంగోలియాతో జరిగిన పోరులో నేపాల్ ఈ రికార్డు నెలకొల్పగలిగింది.

ఐపీఎల్ చరిత్రలో ఇదే అత్యుత్తమ స్కోరు...

ఐపీఎల్ 17 సీజన్ల చరిత్రలో మొదటి రెండు అత్యుత్తమ టీమ్ స్కోర్లు సాధించిన ఏకైకజట్టుగా హైదరాబాద్ సన్ రైజర్స్ నిలిచింది. ప్రస్తుత సీజన్లోనే హోంగ్రౌండ్ హైదరాబాద్ రాజీవ్ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్ తో జరిగిన పోరులో 3 వికెట్లకు 277 పరుగుల రికార్డు స్కోరు సాధించిన సన్ రైజర్స్ ..కొద్దిరోజుల వ్యవధిలోనే తన రికార్డును తానే తిరగరాసుకోగలిగింది. ఫ్రాంచైజీ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక టీమ్ స్కోరు సాధించిన జట్టుగా హైదరాబాద్ సన్ రైజర్స్ చరిత్ర సృష్టించింది. బెంగళూరు బౌలర్లలో లాకీ ఫెర్గూసన్ 2 వికెట్లు, టోప్లే 1 వికెట్ పడగొట్టారు.

### దినేశ్ కార్తీక్ ఒంటరిపోరాటం...

288 పరుగుల టార్గెట్ తో చేజింగ్ కు దిగిన బెంగళూరు రాయల్ చాలెంజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 262 పరుగుల స్కోరు మాత్రమే సాధించి..25 పరుగుల ఓటమి చవిచూసింది. అయితే..ఐపీఎల్ చరిత్రలోనే చేజింగ్ కు దిగి..రెండో ఇన్నింగ్స్ లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా రాయల్ చాలెంజర్స్ సరికొత్త రికార్డు నమోదు చేయగలిగింది. ఓపెనర్లు విరాట్ కోహ్లీ (42 ), డూప్లెసిస్ ( 62 ) స్కోర్లకే వెనుదిరిగినా..టాపార్డర్ విఫలమైనా..మిడిలార్డర్లో దినేశ్ కార్తీక్ కేవలం 35 బంతుల్లోనే 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 83 పరుగులతో వీరోచిత పోరాటమే చేశాడు. మహీపాల్ లోమ్ రోర్ 19, అనూజ్ రావత్ 25 పరుగుల స్కోర్లతో దినేశ్ కార్తీక్ కు తోడుగా నిలిచినా ప్రయోజనం లేకపోయింది. హైదరాబాద్ బౌలర్లలో లెగ్ స్పిన్నర్ మయాంక్ మార్కెండే 2 వికెట్లు, కమిన్స్ 3 వికెట్లు, నటరాజన్ 1 వికెట్ పడగొట్టారు. సన్ రైజర్స్ రికార్డు విజయంలో ప్రధానపాత్ర వహించిన ట్రావిస్ హెడ్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

### ఫోర్ల హోరు..సిక్సర్ల జోరు...రికార్డుల వెల్లువ...

హైదరాబాద్- బెంగళూరు జట్ల ఈ సమరం బౌండ్రీల హోరు, సిక్సర్ల జోరు, రికార్డుల వెల్లువలా సాగింది. కేవలం 40 ఓవర్లలో రెండుజట్లూ కలసి 549 పరుగులు సాధించడం ఐపీఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటి వరకూ నమోదైన మొదటి ఐదు అత్యుత్తమ స్కోర్లలో..నాలుగు అత్యధిక స్కోర్లు ప్రస్తుత సీజన్ మొదటి 30 మ్యాచ్ ల్లోనే నమోదు కావడం విశేషం. రెండుజట్ల బ్యాటర్లు కలసి 81 బౌండ్రీలు బాదడం ప్రపంచ రికార్డుగా నిలిచిపోతుంది. మొత్తం 81 హిట్లలో 38 సిక్సర్లు, 43 ఫోర్లు ఉన్నాయి. సన్ రైజర్స్ బ్యాటర్లు మొత్తం 22 సిక్సర్లు బాదడం ద్వారా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదినజట్టుగా హైదరాబాద్ ను నిలిపారు. రెండుజట్లూ కలసి ఏడు 50 పరుగుల భాగస్వామ్యాలు నమోదు చేయడం కూడా ఇదే మొదటిసారి. మొత్తం మీద అరడజనుకు పైగా సరికొత్త రికార్డులు ఈ మ్యాచ్ ద్వారా వచ్చి చేరాయి. ఈ విజయంతో మొదటి 6 రౌండ్లలో నాలుగో గెలుపుతో సన్ రైజర్స్ పాయింట్ల పట్టిక 4వ స్థానంలో నిలిచింది. రాజస్థాన్, కోల్ కతా, చెన్నై మొదటి మూడుస్థానాలలో కొనసాగుతున్నాయి. మొత్తం 7 మ్యాచ్ లు ఆడిన బెంగళూరు ఐదు వరుస పరాజయాలు, ఒకే ఒక్క గెలుపుతో లీగ్ టేబుల్ ఆఖరి స్థానానికి పడిపోయింది. ఐదుసార్లు విజేత ముంబై ఇండియన్స్ 6 రౌండ్లలో 2 విజయాలు, 4 పరాజయాలతో 4 పాయింట్లు సాధించడం ద్వారా లీగ్ టేబుల్ 8వ స్థానంలో కొట్టిమిట్టాడుతోంది.

# భారత టెన్నిస్ చుక్కాని సుమిత్ నగాల్!

ప్రపంచ టెన్నిస్ పురుషుల సింగిల్స్ లో 80వ ర్యాంక్ సాధించడం ద్వారా సుమిత్ నగాల్ భారత ఉనికిని కాపాడగలిగాడు. మోంటేకార్లో మాస్టర్స్ మెయిన్ డ్రాలో చోటు సంపాదించిన తొలి భారత ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టెన్నిస్ లో భారత్ కు ప్రత్యేకస్థానం ఉంది. రామనాథన్ కృష్ణన్, విజయ్ అమృత్ రాజ్, రమేశ్ కృష్ణన్, లియాండర్ పేస్, మహేశ్ భూపతి, రోహన్ బొపన్న లాంటి ఎందరో గొప్పగొప్ప ఆటగాళ్లను అందించిన ఘనత సైతం ఉంది. అయితే సోమ్ దేవ్ వర్మన్ లాంటి స్టార్స్ రిటైర్మెంట్ తో పురుషుల సింగిల్స్ లో భారత్ పోటీ నామమాత్రంగా మారిపోయింది.



### ఒకే ఒక్కడు ....

రామ్ కుమార్, ప్రజ్ఞేశ్, సాకేత్ మైనేని లాంటి ఆటగాళ్లు ఎందరు తెరమీదకు వచ్చినా తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోలేకపోయారు. భారత టెన్నిస్ పైన ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. మహిళల డబుల్స్ లో సానియా మీర్జా, పురుషుల డబుల్స్ లో రోహన్ బొప్పన సాధించిన విజయాలు చూస్తూ భారత్ సరిపెట్టుకొనే పరిస్థితిలో పురుషుల సింగిల్స్ లో సుమిత్ నగాల్ నిలకడగా రాణిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగలిగాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించడం ద్వారా సింగిల్స్ తొలిరౌండ్ విజయంతో అందరి దృష్టి ఆకట్టుకొన్న సుమిత్..ఏటీపీ తాజా ర్యాంకింగ్స్ ప్రకారం 80వ స్థానంలో నిలవడం ద్వారా చరిత్ర సృష్టించాడు. ఏటీపీ టూర్ ర్యాంకింగ్స్ లో భారత ఆటగాళ్లు గత దశాబ్దకాలంలో మొదటి 200 ర్యాంకుల్లో నిలవడమే గగనంగా మారింది. అలాంటి పరిస్థితి నుంచి ఓ భారత ఆటగాడు పురుషుల సింగిల్స్ లో టాప్-100లో ..అదీ 80వ ర్యాంక్ లో నిలవడాన్ని గొప్ప ఘనతగా చెప్పుకోవాలి.

### మోంటేకార్లో మాస్టర్స్ లో మెరుపులు...

2024 ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్ విజయంతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకొన్ననగాల్..ఫ్రెంచ్ ఓపెన్ కు సన్నాహకంగా జరుగుతున్న మోంటే కార్లో మాస్టర్స్1000 టోర్నీలో చెలరేగిపోయాడు. క్వాలిఫైయింగ్ రౌండ్లలో తనకంటే మెరుగైన ర్యాంకుల్లో నిలిచిన ముగ్గురు ఆటగాళ్లను నగాల్ చిత్తు చేయడం అరుదైన ఘనతగా నిలిచిపోతుంది. మాస్టర్స్ మెయిన్ డ్రాలో చోటు కోసం జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్లలో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కోబొల్లీ, అర్జెంటీనా ఆటగాడు ఫాకుండో డియాజ్ అకోస్టాను చిత్తు చేసిన తీరు అందరినీ ఆకట్టుకొంది. 8వ సీడ్ ఫ్లావియో కోబొల్లీ, 3వ సీడ్ ఫాకుండో డియాజ్ లతో పాటు..మెయిన్ డ్రా తొలిరౌండ్ పోరులో ఇటాలియన్ ఆటగాడు మాటియో ఆర్నాల్డీని 5-7, 6-2, 6-4తో అధిగమించాడు. భారత టెన్నిస్ ఆల్ టైమ్ గ్రేట్ స్టార్లు విజయ్ అమృత్ రాజ్, రమేశ్ కృష్ణన్ తరువాత మోంటేకార్లో మాస్టర్స్ లో పాల్గొన్న భారత తొలి ఆటగాడి ఘనతను సుమిత్ నగాల్ దక్కించుకోగలిగాడు. 1990 నుంచి నిర్వహిస్తున్నమోంటేకార్లో మాస్టర్స్ క్లే కోర్టు టోర్నీ తొలిరౌండ్ విజయం సాధించిన భారత తొలి క్రీడాకారుడిగా కూడా రికార్డుల్లో చేరాడు.

### 13 ర్యాంకులు మెరుగైన నగాల్...

మోంటేకార్లో మాస్టర్స్ ప్రారంభానికి ముందు వరకూ 93వ ర్యాంకులో కొనసాగుతూ వచ్చిన నగాల్ తొలిరౌండ్ విజయం ద్వారా 13 స్థానాల మేర తన ర్యాంకును మెరుగు పరచుకోగలిగాడు. రెండోరౌండ్ లో 7వ సీడ్ హోల్జర్ రునే చేతిలో ఓటమితో నగాల్ పోరుకు తెరపడింది. ఏటీపీ టూర్ ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యుత్తమ ర్యాంకుల్లో నిలిచిన విజయ్ అమృత్ రాజ్, రమేశ్ కృష్ణన్, సోమ్ దేవ్ వర్మన్, శశి మీనన్, ఆనంద్ అమృత్ రాజ్, ప్రజ్ఞేశ్ ల సరసన సుమిత్ నగాల్ నిలిచాడు. భారత్ కు చెందిన 7వ అత్యుత్తమ ర్యాంకర్ గా రికార్డుల్లో చేరాడు.

### రోహన్ చేజారిన టాప్ ర్యాంక్...

మోంటేకార్లో పురుషుల డబుల్స్ ప్రీ- క్వార్టర్ లోనే పరాజయం పొందడంతో ఇప్పటి వరకూ ప్రపంచ నంబర్ వన్ ర్యాంకులో కొనసాగుతూ వచ్చిన వెటరన్ రోహన్ బొపన్న రెండోర్యాంకుకు పడిపోయాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఇబెడెన్ తో జంటగా రోహన్ బొపన్న పాల్గొంటున్న సంగతి తెలిసిందే.

# ప్రపంచకప్ జట్టులో హార్ధిక్ పాండ్యాకు చోటు అనుమానమే?

గతేడాది వరకూ భారత టీ-20 జట్టుకు కెప్టెన్ గా ఓ వెలుగు వెలిగిన పేస్ ఆల్ రౌండర్ హార్ధిక్ పాండ్యా కెరియర్ లో తిరోగమన దశ ప్రారంభమయ్యింది. తరచూ గాయాలు, వరుస వైఫల్యాలతో పాండ్యా పరిస్థితి అయోమయంగా తయారయ్యింది.



### పాండ్యాచోటుకు గ్యారెంటీలేదు...

ఒకప్పుడు హార్ధిక్ పాండ్యా లేని భారత టీ-20 జట్టును ఊహించడం అసాధ్యం అనుకొనే పరిస్థితి ఉండేది. గతేడాది వరకూ భారత టీ-20 జట్టుకు హార్ధిక్ పాండ్యా నాయకుడిగా వ్యవహరించాడు. రోహిత్ శర్మ వారసుడు హార్ధిక్ పాండ్యా మాత్రమేనని, 2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ లో పాల్గొనే భారతజట్టుకు పాండ్యానే నాయకత్వం వహిస్తాడని అందరూ భావించారు. అయితే..గాయంతో కొద్దిమాసాలపాటు భారతజట్టుకు పాండ్యా దూరం కావడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.

### అహ్మదాబాద్ టు ముంబై...

2022, 2023 ఐపీఎల్ సీజన్లలో అహ్మదాబాద్ ఫ్రాంచైజీకి చెందిన గుజరాత్ టైటాన్స్ కు పాండ్యా నాయకత్వం వహించడమే కాదు..వరుసగా రెండుసార్లు ఫైనల్స్ చేర్చడంతో పాటు ఓ విన్నర్, ఓ రన్నరప్ టైటిల్ అందించాడు. దీంతో హార్ధిక్ పాండ్యా గ్రాఫ్ ఒక్కసారిగా మారిపోయింది. ఏకంగా ముంబై ఫ్రాంచైజీకి కెప్టెన్ గా వ్యవహరించే స్థాయికి చేరాడు. గత పుష్కరకాలంగా ముంబైని ఐపీఎల్ లో తిరుగులేని జట్టుగా నిలిపిన రోహిత్ శర్మ నాయకత్వానికే హార్ధిక్ పాండ్యా ఎసరు పెట్టాడు. అయితే..ప్రస్తుత 2024 సీజన్లో ముంబై తలరాతను ఏమాత్రం మార్చలేకపోయాడు. మొదటి 6రౌండ్ల మ్యాచ్ ల్లో ముంబై నాలుగు పరాజయాలతో 10 జట్ల లీగ్ టేబుల్ 8వ స్థానానికి పడిపోయింది.

### ధోనీ ముందు తేలిపోయిన పాండ్యా...

హోంగ్రౌండ్ వాంఖడే స్టేడియం వేదికగా డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన సూపర్ ఫైట్ లో వెటరన్ ధోనీ అనుభవం, వ్యూహాలు, జిత్తుల ముందు పాండ్యా నాయకత్వంలోని ముంబైజట్టు తేలిపోయింది. చివరకు రోహిత్ శర్మ సాధించిన ఫైటింగ్ సెంచరీ సైతం వృధాగా మారిపోయింది. చెన్నై ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో బౌలింగ్ కు దిగిన హార్ధిక్ పాండ్యా బౌలింగ్ లో ధోనీ సిక్సర్ల హ్యాట్రిక్ తో సహా సాధించిన 20 పరుగుల తేడాతోనే సూపర్ కింగ్స్ విజేతగా నిలువగలిగింది. పాండ్యా తన కోటా 4 ఓవర్లలో 3 ఓవర్లు మాత్రమే బౌల్ చేసి 43 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. ఇక..బ్యాటింగ్ లో సైతం పాండ్యా 6 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఆల్ రౌండర్ గా,కెప్టెన్ గా పాండ్యా దారుణంగా విఫలం కావడం కూడా ముంబై పరాజయానికి కారణాలలో ఒకటిగా నిలిచింది.

### మొదటి 6 మ్యాచ్ ల్లో పాండ్యా వెలవెల..

ప్రస్తుత సీజన్ డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ మొదటి ఆరు రౌండ్ల మ్యాచ్ ల్లో హార్ధిక్ పాండ్యా 131 పరుగులు మాత్రమే చేయగలిగాడు. దీనికితోడు బౌలింగ్ లో సైతం పాండ్యా అంతంత మాత్రంగానే రాణించడం చర్చనీయాంశంగా మారింది. గత ఆరుమ్యాచ్ ల్లో పాండ్యా 3 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. అంతేకాదు..పాండ్యాను ఫిట్ నెస్ సమస్యలు సైతం వెంటాడుతున్నాయి.కాలిమడమ గాయంతో 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్ కు దూరమైన పాండ్యా..2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ జట్టులో చోటు సంపాదించాలంటే ఏదైనా అద్భుతమే జరిగి తీరాలి.

### పాండ్యా మెడపైన శివం కత్తి...

భారతజట్టులో పేస్ ఆల్ రౌండర్ స్థానం కోసం హార్ధిక్ పాండ్యాకు ముంబై ఆల్ రౌండర్ శివం దూబే ప్రధాన పోటీదారుడుగా తయారయ్యాడు. భారతజట్టు తరపున మాత్రమే కాదు..ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున సైతం శివం అద్భుతంగా రాణిస్తూ సెలెక్టర్ల దృష్టిని ఆకట్టుకొన్నాడు. ప్రత్యర్థి ఎవరైనా సరే లెక్కలేకుండా..గ్రౌండ్ నలుమూలలకూ సిక్సర్లు బాదడంలో శివం తరువాతే ఎవరైనా. ప్రస్తుత సీజన్ మొదటి ఆరు రౌండ్ల మ్యాచ్ ల్లో శివం 242 పరుగులు సాధించడంతో పాటు 15 సిక్సర్లు బాదాడు. 160కి పైగా స్ట్రయిక్ రేట్ తో వారేవ్వా అనిపించుకొన్నాడు. 44 సగటుతో ఉన్న శివంను భారతజట్టులోకి తీసుకొని తీరాల్సిందేనని భారత మాజీ క్రికెటర్లు, వ్యాఖ్యాతలు యువరాజ్ సింగ్, వెంకటేశ్ ప్రసాద్ పట్టు పడుతున్నారు. ఇప్పటి వరకూ ఆడిన మొదటి ఆరురౌండ్ల మ్యాచ్ ల్లో శివం దూబే 34 నాటౌట్, 51, 18, 45, 28, 66 నాటౌట్ స్కోర్లు సాధించడం విశేషం. ఈనెల ఆఖరి వారంలో బీసీసీఐ ఎంపిక సంఘం..రోహిత్ శర్మ నాయకత్వంలో 15మంది సభ్యుల భారతజట్టును ఎంపిక చేయనుంది. పేస్ ఆల్ రౌండర్ స్థానం హార్ధిక్ పాండ్యాకు దక్కుతుందా? లేక శివం దూబేకు చిక్కుతుందా? అన్నది ఆసక్తి రేపుతోంది. అంతంతమాత్రం ఫామ్, నూటికి నూరుశాతం ఫిట్ నెస్ లేని హార్ధిక్ పాండ్యాను ఎంపిక చేస్తే కుంటిగుర్రంతో రేసులో పాల్గొన్నట్లే అవుతుందని క్రికెట్ విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే..హార్ధిక్ పాండ్యా స్థానాన్ని శివం దూబే తన్నుకుపోడం ఖాయమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.